




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


సంపుటి 09, సంచిక: 48 | గురువారం | 15-01-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

డిసెంబర్‌లో పెరిగిన
'టోకు ధరల ద్రవ్యోల్బణం'

నేడు మహారాష్ట్రలో
మున్సిపల్ ఎన్నికలు 05

బెంగాల్‌లో 11,000 మంది
అక్రమ ఓటర్లు

## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' సంక్రాంతి శుభాకాంక్షలు

## సెలవు

సంక్రాంతి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి గురువారం సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

- ఎడిటర్



# ఖమ్మంకు అరుణ శోభ

- తోరణాలతో ఎరుపెక్కిన నగర వీధులు
- 18న సిపిఐ శత వసంతాల ముగింపు సభకు భారీ అలంకరణ
- పలు కూడళ్ల స్వాగత కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు

ప్రజాపక్షం/ ఖమ్మం

ఖమ్మం నగరం అరుణవర్ణాన్ని పులుముకుంటున్నది. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో ఖమ్మం నగరాన్ని పార్టీ కార్యకర్తలు ఎరుపెక్కిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించిన విషయం విధితమే. సభా సమయం దగ్గర పడుతుండడంతో నగరాన్ని ఎర్ర తోరణాలతో అలంకరిస్తున్నారు. ఇల్లందు క్రాస్ రోడ్డు, మయూరి సెంటర్, జెడ్‌పి సెంటర్, వ్యవసాయ మార్కెట్ సెంటర్, వరంగల్ క్రాస్ రోడ్డు, చర్చికాం పౌండ్ సెంటర్, ముస్తఫానగర్, బోసుబొమ్మ సెంటర్, కాల్వొడ్డు తదితర కూడళ్లలో ఎర్ర తోరణాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. వైరా రోడ్డు, బైపాస్ రోడ్డులో భారీ ఎత్తున తరువాయి 2లో



సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు ప్రచారంలో భాగంగా బుధవారం ఖమ్మం పురవీధుల్లో వంద అడుగుల సిపిఐ జెండా ప్రదర్శన

## ఇందిరమ్మ ఇండ్లకు రూ.152 కోట్లు విడుదల

**రూ.4000 కోట్లు దాటిన చెల్లింపులు**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ప్రతి వారం బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో భాగంగా ప్రస్తుత వారానికి రూ.152.40 కోట్లను విడుదల చేశారు. ఈ ఏడాది మార్చి ఆఖరులోగా లక్ష ఇండ్లను పూర్తి చేయాలన్న లక్ష్యంగా నిర్దేశించుకుని, ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ క్షేత్ర స్థాయిలో పనులు వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నది. ఇంటి నిర్మాణపు పనుల పురోగతిని బట్టి ప్రతి వారం బిల్లులను పూర్తి పారదర్శకంగా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నది. ప్రస్తుత వారంలో 13,861 మందికి తరువాయి 2లో


# ఇరాన్‌ను విడిచి రండి

**భారతీయులకు కేంద్ర ప్రభుత్వం సలహా**

### భద్రతా పరిస్థితులు క్షీణించినందుకు అందుబాటులో ఉన్న మార్గాలలో రావాలని విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** ఇరాన్‌లో పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయని అక్కడి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వ్యతిరేక ప్రదర్శనలు కొనసాగుతూ ఉండటంతో, దొరికిన దారిలో ఆ దేశం వదిలి దేశానికి రావాలని భారతీయులకు కేంద్ర ప్రభుత్వం సలహా ఇచ్చింది. ఇరాన్‌లో సామూహిక ప్రదర్శనలు, ప్రభుత్వ అణచివేత పెరిగి భద్రతా పరిస్థితులు క్షీణించినందువల్ల అందుబాటులో ఉన్న రవాణా మార్గాలలో ఇరాన్‌ను వదిలి రావాలని కోరింది. విదేశీమంత్రిత్వశాఖ కూడా ఇదే ప్రకటన చేస్తూ, తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ ఇరాన్‌కు ఎవరూ వెళ్ళవద్దని కూడా కోరింది. నిరసన ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు దగ్గరగా వెళ్ళవద్దని, పాస్‌పోర్టులు, ఇతర గుర్తింపు కార్డులను ఎల్లప్పుడూ తమ వద్దే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. ఇరాన్ కరెన్సీ రికార్డుస్థాయిలో పతనంకావడంవల్ల డిసెంబరు 28న టెహ్రాన్‌లోని ఒక బజారులో చిన్న గొడవతో ప్రారంభమైన ఆర్థిక తరువాయి 2లో



న్యూఢిల్లీలో చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ విభాగం ఉప మంత్రి సున్ హైయాన్ నేతృత్వంలోని ఆ పార్టీ ప్రతినిధి బృందం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, డి.రాజా, సిపిఐ జాతీయ కార్యదర్శి, రామకృష్ణ పాండాతో భేటీ అయింది. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. అరుణ్ కుమార్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ కూడా పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో సిపిఐది కీలకపాత్ర

- స్వాతంత్ర్య సంగ్రామంలోనూ సిపిఐ, ప్రజాసంఘాలది సముచిత స్థానం
- కమ్యూనిస్టులంతా కలిసికట్టుగా ముందుకు సాగాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి పిలుపు
- 'చలో ఖమ్మం' సిడి ఆవిష్కరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

కమ్యూనిస్టులంతా ఏకమైతే అధికారం చేపట్టడం అసాధ్యమేమీ కాదని, అందుకు కలిసికట్టుగా ముందుకు సాగుదామని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి వామపక్ష పార్టీలకు పిలుపునిచ్చారు. ఈనెల 18వ తేదీన ఖమ్మంలో నిర్వహించనున్న సిపిఐ శతాబ్ది తరువాయి 2లో

# తొమ్మిది మీడియా సంస్థలపై కేసులు

- ఇద్దరు ఎన్‌టివి ప్రతినిధుల అరెస్టు
- విచారణ కోసం సిట్ ఏర్పాటు.. పలువురి ఖండన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఒక రాష్ట్ర మంత్రి, ఓ ఐఎఎస్‌పై ఆరోపణలు ప్రసారం చేయడం, మరో వైపు సిఎంపై అవమానకరంగా వార్తలు వేయడంపై హైదరాబాద్, కోస్గిలలో వేరు వేరుగా పోలీసు కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో తొమ్మిది మీడియా సంస్థలపై కేసు నమోదు చేశారు. కేసుల దర్యాప్తు కోసం డిజిపి శివధర్‌రెడ్డి హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ నేతృత్వంలో మంగళవారం రాత్రి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశారు. సిట్ అధికారులు ఎన్‌టివికి చెందిన జర్నలిస్టులు దొంతు రమేష్, సుధీర్‌లను అరెస్టు చేశారు. మరికొందరు జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని విచారించి వదిలిపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఐఎఎస్ అధికారుల సంఘం అధ్యక్షులు జయేష్ రంజన్ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు తొమ్మిది మీడియా సంస్థలైన ఎన్‌టివి, టిన్యూస్, ఎంఆర్ మీడియా తెలంగాణ, ప్రైమ్9, పివిన్యూస్, సిగ్నల్ టివి తెలుగు, ఓల్గా టైమ్స్, మిర్రర్ టై ఆఫిసియల్‌తో పాటు సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై కేసు నమోదు చేశారు. కేసులో 75, 78, 79, 351(1), 352(2) సెక్షన్‌లు నమోదు చేశారు. ఎన్‌టివిలో ప్రసారమైన కథనం ద్వారా మహిళా అధికారిణి గౌరవానికి భంగం కలిగించిందని జయేష్ రంజన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయ నేతలు, మంత్రులు మహిళా ఐఎఎస్ తరువాయి 2లో




# అడవి వీడిన నక్సల్స్

- ఛత్తీస్‌గఢ్‌లో మరో 29 మంది మావోయిస్టులు లొంగుబాటు
- డివికెఎంఎస్ అధిపతి పోడియం బుద్రాపై రూ.2 లక్షల రివార్డు

**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు విడుతల వారీగా అడవులను వీడి జనంలోకి వస్తున్నారు. తాజాగా బుధవారం సుక్మా జిల్లాలో 29 మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. నిషేధిత సిపిఐ (మావోయిస్టు) అనుబంధ విభాగాలలో సభ్యులై చురుకుగా ఉన్న ఈ క్యాడర్‌లు 'పూనా మార్గెం' (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు) కార్యక్రమం కింద సుక్మాలో సీనియర్ పోలీసు, సిఆర్‌పిఎఫ్ అధికారుల ముందు లొంగిపోయారని ఎస్‌పి కిరణ్ చవాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం పట్ల వారు ప్రభావితులయ్యారని ఆయన అన్నారు. వీరిలో, గోగుండ ప్రాంతంలోని దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్ (డివికెఎంఎస్ మావోయిస్టుల అనుబంధ విభాగం) అధిపతి తరువాయి 12లో

# మేం అమ్మకానికి సిద్ధంగా లేం

**గ్రీన్‌లాండ్‌లో గళమెత్తిన ప్రజలు**



**వాషింగ్టన్:** గ్రీన్‌లాండ్ దీవిని తమ భూభాగంలో విలీనం చేయాలన్న అమెరికా డిమాండ్‌పై బుధవారం పొద్దుపోయాక వైట్‌హౌస్‌లో డెన్మార్క్–గ్రీన్‌లాండ్ విదేశీమంత్రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమెరికా పౌరులుగా ఉండేందుకు గ్రీన్‌లాండ్ ప్రజల నుండి సర్వత్రా వ్యతిరేకత వస్తోంది. వివిధ అంతర్జాతీయ మీడియా సంస్థలు గ్రీన్‌లాండ్ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నాయి. 'మేం అమ్మకానికి సిద్ధంగా లేం, గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదు' అని అక్కడి ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. ఈ వివాదం తారాస్థాయికి చేరుకున్న తర్వాత గ్రీన్‌లాండ్‌లో ప్రతిచోటా స్వాభిమాన సంకేతాలే కనిపిస్తున్నాయి. వెనిజులాలో నిర్లక్ష్యంగా సైనిక చర్యకు పాల్పడిన తరువాయి 12లో






## విరిగి పడిన క్రేన్ : రైలు బోగీలు ధ్వంసం థాయ్‌లాండ్‌లో 32మంది దుర్మరణం

**బ్యాంకాక్ :** ఈశాన్య థాయ్‌లాండ్‌లో వేగంగా వెళుతున్న ప్యాసింజర్ రైలుపై నిర్మాణ పనిలో ఉన్న ఒక భారీ క్రేన్ విరిగి పడిపోవడంతో 32 మంది ప్రయాణికులు దుర్మరణం చెందారు. మరో 66 మంది తీవ్రంగా గాయపడ్డారు. బ్రిడ్జి నిర్మాణ పనిచేస్తున్న భారీ క్రేన్ విరిగి పడటంతో రైలు పట్టాలు తప్పి కొన్ని బోగీలు నలిగిపోయాయి. కొన్ని బోగీలు దగ్ధమయ్యాయి. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు వెళుతున్న ఆ రైలులో 195 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు చెప్పారు. సహాయ బృందాలు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని ప్రయాణికులను రైలు బోగీల నుండి వెలికి తీశారు. తీవ్రంగా గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించారు. ప్రభుత్వం ఈ ఘటనపై వెంటనే దర్యాప్తుకు ఆదేశించింది. ఇప్పటికే థాయ్‌లాండ్‌లో రక్షణ చర్యలు లేకపోవడంవల్ల ఇదే తరహాలో అనేక ప్రమాదాలు వరుసగా జరుగుతున్నారు. ఈ పరిస్థితులను సమీక్షించాలని ప్రభుత్వం కోరింది. ఈ నిర్లక్ష్యపూరితమైన ఘటనకు ఎవరు బాధ్యులైనాగానీ కఠినశిక్ష విధించాలని థాయ్‌లాండ్ ప్రధానమంత్రి చార్న్ విరాకుల్ కోరారు. బ్యాంకాక్ నుండి ఉబోన్‌లోని నఖోన్ రాట్చసిమ రాష్ట్రానికి రైలు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. చైనా ప్రభుత్వం సహాయంతో బ్యాంకాక్ నుండి లావోస్ దేశాన్ని హై–స్పీడ్ రైళ్ళతో అనుసంధానం చేయడానికి పిల్లర్ల మీద ప్రయాణం చేసేవిధంగా కొత్త ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న భారీ క్రేన్ విరిగింది. అదే సమయంలో వెళుతున్న రైలుపై పడింది. ఇప్పటికే వాయువ్య చైనాలో ఈ హైస్పీడు రైళ్ళు నడుస్తున్నాయి. అదే ప్రాజెక్టును థాయ్‌లాండ్‌లో చేపట్టారు.

## ఎన్నికలకు కట్టుబడి ఉన్నా : యూనుస్

**ఢాకా :** ముందుగా నిర్దేశించిన విధంగానే బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12వ తేదీన సార్వత్రిక ఎన్నికలు, రిఫరెండం చేసేందుకు తాత్కాలిక ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ ప్రధాన సలహాదారులు మహ్మద్ యూనుస్ చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఢాకాను సందర్శించిన అమెరికా మాజీ దౌత్యవేత్తలు ఆల్బర్ట్ గాంబిస్, మోర్స్ టాంబ్‌లతో యూనుస్ మాట్లాడుతూ, ఎన్నికలు న్యాయబద్ధంగా నిజాయతీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ బంగ్లాదేశ్‌ను నకిలీ వార్తలు చుట్టుముడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రదర్శకులను ఉరితీస్తే తీవ్ర పరిణామాలు

### ఇరాన్ పాలకులకు ట్రంప్ తాజా హెచ్చరిక
### 2,572 మంది పైగా మృతులు



**వాషింగ్టన్ :** ధరల పెరుగుదల, జీవన ప్రమాణాల క్షీణత, కరెన్సీ విలువ తగ్గుదల వంటి ఆర్థిక సమస్యలపై నిరసన ప్రదర్శనలు చేస్తున్న ప్రదర్శకులను దైవ ద్రోహం పేరుతో ఉరితీస్తే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని ఇరాన్ ప్రభుత్వానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేశారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగితే ఇక ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపులకు అవకాశం లేకుండా నిర్ణయం తీసుకుంటామని, అందుకు విరుద్ధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇరాన్‌లో ప్రదర్శకులు ప్రభుత్వ కార్యాలయాలను తమ అధీనంలోకి తెచ్చుకోవాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతరేక ప్రదర్శకులకు తగిన సహాయాన్ని పంపుతున్నామని, ఈ సహాయం ఇరాన్ వెళ్ళే ప్రయాణమార్గంలో ఉందని ఇప్పటికే ట్రంప్ ప్రకటించారు. హింసాత్మక అల్లర్ల సందర్భంగా ఎర్ఫాన్ సోల్తానీ (26) అనే యువకుణ్ణి ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దళాలు వారం రోజులక్రితం అరెస్టు చేశాయి. ఆ యుకుణ్ణి బుధవారం ఉరి తీస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ పైవిధంగా హెచ్చరిక చేశారు. దీంతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రతిస్పందిస్తూ, దుష్టులు, విదేశీశక్తుల నుండి ఇరాన్ తనను తాను కాపాడుకుంటుందని అన్నారు. ఐతే నిర్ణీత ప్రకారం ఎర్ఫాన్ సోల్తానీని ఉరితీసినట్లు ఎలాంటి వార్తలు రాలేదు.

ఇటీవల అరెస్టు చేసిన ప్రదర్శకులను మొహరేబెహ్ లేదా దేవుడికి వ్యతిరేకంగా చేసే యుద్ధం పేరుతో ఉరితీస్తామని అధికారులు ప్రకటించారు. అల్లర్లు ఉద్ధృతం చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలను స్వాధీనం చేసుకోవాలని అమెరికాలో అజ్ఞాతంలో ఉన్న ఇరాన్ మాజీ రాజు షా కుమారుడు రెజా పహ్లావీ జనవరి ఏడో తేదీన పిలుపు ఇచ్చిన తర్వాత రాత్రికి రాత్రే ఇరాన్‌లో హింస పరాకాష్ఠకు చేరుకుంది. దీంతో ప్రభుత్వ అణచివేత కూడా పెరిగింది. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో ఇంటర్నెట్‌పై బ్లాకౌట్ నిరవధికంగా 132 గంటలుగా కొనసాగుతోంది. కాగా స్టార్ లింక్ ద్వారా ఇరాన్‌లో ప్రజలకు ఉచితంగా అంతర్జాతీయ ప్రపంచంతో అనుసంధానమయ్యేందుకు ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ అవకాశం కలిగించింది. విదేశీయుల ఆడుగుజాడల్లో దేశ ద్రోహానికి తలపడిన వారిని దోషులుగా నిర్ధారించి ఉరిశిక్ష లు అమలు చేసేందుకు వీలుగా విచారణ ప్రక్రియను శరవేగంగా కొనసాగిస్తామని ఇరాన్ అత్యున్నత న్యాయస్థానాధిపతి ఘోలంహొస్సేన్ మొహ్‌సేని–ఎజీ బుధవారం ప్రకటించారు. శిక్షల అమలు ఆలస్యమైతే సమాజంపై అది చాలా తక్కువ ప్రభావం చూపిస్తుందన్నారు. మరోవైపు ప్రదర్శకులు చెబుతున్న సమాచారం ప్రకారం గడచిన 18 రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రజా నిరసనల్లో మరణించినవారిసంఖ్య 2,572 దాటింది. ఇంకా వేలాదిమంది అరెస్టయ్యారు. ఐతే నిజంగా మరణించినవారి సంఖ్య కంటే ఈ అంకెలు చాలా తక్కువేనని అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న మానవహక్కుల సంఘం ప్రకటించింది. టెహ్రాన్ వీధుల్లో అనేకమంది మరణించారని, వారి మృతదేహాలను బంధువులు తీసుకువెళ్ళడానికి వీలుగా వీధుల్లో పక్కనే పడుకోబెట్టి ఉంచారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

## వెనిజులా జైళ్ళ నుండి 400మంది విడుదల

**కారకస్ :** వెనిజులా జైళ్ళ నుండి 400 మంది రాజకీయ ఖైదీలను, ఇతరులను విడుదల చేసినట్లు దేశ జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడు జార్జ్ రోడ్రిగ్జ్ బుధవారం సభలో ప్రకటించారు. వెనిజులాలో దాదాపు 800 మంది పైగా జైళ్ళల్లో ఉన్నారు. అమెరికా సైనికచర్య, వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో కిడ్నాప్–తరలింపు ఘటనల తర్వాత ట్రంప్ చేసిన విజ్ఞప్తి మేరకు దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ఖైదీల విడుదల ప్రక్రియను వేగవంతం చేశారు. రెండు రోజులక్రితం 116 మందిని విడుదల చేశారు. ‘‘కొంతమంది ఖైదీలను మాత్రమే విడుదల చేయాలని నిర్ణయించాం, దేశాన్ని, దేశ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించిన రాజకీయ ఖైదీలకు ఈ నిర్ణయం వర్తించదు, అమెరికా సెనేట్ విభాగం అధికారి ఒకరు మాట్లాడుతూ విడుదలైనవారిలో అమెరికన్ పౌరులు కూడా ఉన్నారన్నారు.



## అమెరికా పౌర హక్కుల మార్గదర్శి కోల్విన్ మృతి

**టెక్సాస్ :** అమెరికా పౌర హక్కుల మార్గదర్శి క్లాడెట్టా కోల్విన్ బుధవారం టెక్సాస్‌లో మరణించారు. ఆమె వయసు 86 సంవత్సరాలు. అమెరికాలో జాతి వివక్ష, నల్లజాతీయులపట్ల చట్టబద్ధమైన వ్యతిరేకత, వారికి ఓటు హక్కు నిరాకరణ వంటి విషయాలకు వ్యతిరేకంగా 50వ దశకం నుండి రెండు దశాబ్దాలపాటు జరిగిన పౌర హక్కుల ఉద్యమంలో క్లాడెట్టా కోల్విన్ చిన్న వయసు నుండీ అగ్రగామిగా నిలిచారు. ఒకవైపు పౌర హక్కుల ఉద్యమం చేస్తూ 1969–2004 వరకూ ఆమె నర్సు ఎయిడ్‌గా పనిచేశారు. పౌరహక్కుల మార్గదర్శిగా ఎదిగారు. 15 ఏళ్ళ వయసులో ఉండగా, కోల్విన్ అలబామా మౌంట్ గోమెరిలో ప్రయాణిస్తున్న సమయంలో బస్సులో తను కూర్చున్న సీటు ఖాళీ చేసి ఒక శ్వేతజాతి మహిళకు ఇచ్చేందుకు తిరస్కరించారు. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.

ఈ ఘటనతో ఆమె అందరి దృష్టికీ వచ్చారు. పౌర హక్కుల ఉద్యమంలో గుర్తింపు పొందని వ్యక్తిగా ఉండిపోయినప్పటికీ 1955లో తన తిరుగుబాటు చర్య ద్వారా దర్జీపనిచేసే ఆఫ్రికన్ అమెరికన్ మహిళ రోసా లూయిస్ మెక్కాలీ పార్క్స్ వంటి అనేకమందికి స్ఫూర్తిని ఇచ్చారు. అమెరికా ప్రజారవాణా వ్యవస్థలో జాతి వివక్ష నివారణకు ఆమె దోహదం చేశారు. అమెరికా రవాణా వ్యవస్థలో జాతి వివక్ష నివారణకు ఆమె న్యాయ పోరాటం చేశార. వాషింగ్టన్ మాన్యుమెంట్ నుండి లింకన్ మెమోరియల్ వరకూ 1963లో జరిగిన పౌర హక్కుల మహా ప్రదర్శనలో ఆమె పాల్గొన్నారు.

## సిపిఐది కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఉత్సవాల ముగింపు సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సిపిఐ శత వసంతాల ప్రస్థానం సందర్భంగా తెలంగాణ అభ్యుదయ రచయిత సంఘం (అరసం) ఆధ్వర్యంలో కవి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ రచించిన ‘చలో ఖమ్మం’ ఆరు గీతాలతో కూడిన సిడిని పల్లా వెంకట రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో బుధవారం అరసం కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప రెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ప్రముఖ సినీ దర్శకులు బాబ్జీ, పాటల రచయిత గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లీ ఉల్లా ఖాద్రీ, అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు సుదర్శన్, ప్రజానాట్య మండలి నాయకుడు పి.వెంకటచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నాడు జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో సిపిఐ, ప్రజా సంఘాలు సముచిత స్థానాన్ని పోషించారని పేర్కొన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్న నినాదంతో మొక్కవోని దీక్షతో ఉద్యమించిన ఏకైక పార్టీ సిపిఐ అని, ఆ తర్వాత దేశ అభివృద్ధిలో ప్రజల ఆర్థిక స్వావలంభన కోసం సంక్షేమ పథకాల అమల్లో కూడా పార్టీ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సిపిఐ ఉద్యమ చరిత్రతో గడ్డమీది చంద్ర మోహన్ గౌడ్ పాటలను రచించడం అభినందనీయమన్నారు. కందిమళ్ల ప్రతాప రెడ్డి మాట్లాడుతూ అక్షర జ్ఞానం లేని ప్రజల్లో తమ పాటలు, రచనల ద్వారా చైతన్యం నింపిన ఘన చరిత్ర ఇప్టా, ప్రజానాట్య మండలిదేనని అన్నారు. ఈ దేశంలో సినీ రంగం వెల్లుగొందడానికి ఇప్టానే కారణమని ఆయన తెలిపారు. కవులు కళాకారులు తమ పాటలు, రచనల ద్వారా ప్రజలను మరింత చైతన్యపర్చే విధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బాబ్జీ మాట్లాడుతూ కొంత మంది దోపిడీ దారులకు, పెట్టుబడి దారులకు నిలయమైన సినీ రంగంలో నిలదొక్కుకుని మొక్కఒని దీక్షతో తనకు పోరాటం చేసే శక్తిని ఇచ్చింది ప్రజానాట్య మండలేనని అన్నారు. కార్యక్రమంలో గాయకులు డాక్టర్ సూర్యప్రకాశ్, ఆరెల్లి రవి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## రూ.152 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)


బిల్లులను విడుదల చేశారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ వరకు 2.50 లక్షల ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో సుమారు 1.22 లక్షల ఇండ్లు గోడలు, శ్లాబ్‌లు అయిపోయి త్వరలోనే పూర్తి కానున్నాయని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. మార్చి నెలాఖరులోగా ఇవి పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటూ, మిగిలిన ఇండ్ల పనులు మరో మూడు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణను అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రానున్న రెండు మూడు నెలలు ఇండ్ల నిర్మాణానికి అనుకూలమైనందున పనులు వేగవంతం అయ్యేలా చూడాలని క్షేత్ర స్థాయిలోని సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలిచ్చామని, ఈ అంశంలో జిల్లాల కలెక్టర్లు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ పథకంలో ఇప్పటివరకు మొత్తం రూ.4000 కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు విడుదల చేశామని ఎండి గౌతం వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల సంబంధించి ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వవద్దని, ఈ విధంగా ఎవరైనా డిమాండ్ చేసినా, ఇతర సమస్యలున్నా కాల్ సెంటర్ 1800 599 5991కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## ఇరాన్‌ను విడిచి రండి

(మొదటి పేజీ తరువాయి)

సంఘర్షణ హింసాత్మకం గా మారి జనవరి 8,9 తేదీల నాటికి దేశంలోని 31 రాష్ట్రాలలోని అన్ని నగరాలు,పట్టణాలు, మారుమూల గ్రామాలకు కూడా విస్తరించింది. ‘‘ఇరాన్‌లో ఏర్పడిన పరిణామాల దృష్ట్యా ప్రస్తుతం ఆ దేశంలో ఉన్న భారతీయ విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు,పర్యాటకులు వెంటనే వాణిజ్య విమానాలు సహా దొరికిన వాహనం ఎక్కి దేశం వదిలి రావాలి’’ అని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ద్వారా కేంద్ర ప్రభుత్వం సమాచారాన్ని తెలియజేసింది. ‘‘భారతదేశానికి చెందినవారు అప్రమత్తంగా ఉండాలి, ప్రదర్శనలు జరిగే ప్రాంతాల సమీపానికి వెళ్ళవద్దు, దౌత్యకార్యాలయంతో అనుసంధానంలో ఉండండి, వారి సలహా తీసుకోండి,స్థానిక మీడియా ద్వారా జరుగుతున్న పరిణామాలను గమనించండి’’ అని సలహాలు జారీ చేసింది. భారత విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ కూడా విడిగా ఇరాన్‌కు వెళ్ళే ప్రయాణికులకు సలహాలు జారీ చేసింది. ఇంతకుముందు జనవరి ఐదో తేదీన ఒకసారి కేంద్రం ఒక సలహా జారి చేసింది. అనవసరంగా ఇరాన్‌కు ప్రయాణం చేయవద్దని మాత్రమే కోరింది. ఇరాన్‌లో గడచిన 18 రోజులుగా జరిగిన హింసలో 2,570 మంది పైగా మరణించారని మానవ హక్కుల సంఘం (అమెరికా) ప్రకటించింది. అదేవిధంగా అమెరికా కూడా తమ పౌరులకు ఇదే ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఇరాన్‌లో చదువుతున్న పాకిస్థానీ విద్యార్థులు కూడా నైరుతీ ఇరాన్ సరిహద్దులు దాటి స్వదేశాలకు వెళుతున్నారు. క్వెట్టా నగరంలో ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ అధికార ప్రతినిధి సమినా రైసాని మాట్లాడుతూ, బలూచిస్థాన్ రాష్ట్రం గబ్డ్ సరిహద్దు మీదుగా 60 మంది విద్యార్థులు పాకిస్థాన్‌కు వచ్చారని చెప్పారు.

### ఆరావళిలో మానవ తప్పిదాలవల్ల
# భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం : అధ్యయనం వెల్లడి



**న్యూఢిల్లీ :** ఆరావళీ పర్వతశ్రేణిలో ఆక్రమణలు, అక్రమ తవ్వకాలు, అడవుల నరకివేత,పట్టణప్రాంత మౌలిక సదుపాయాల విస్తరణ వంటి చర్యలన్నీ భూగర్భ జలాలు, జీవావరణం, గాలి నాణ్యత, వాతావరణ నియంత్రణలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని తాజా అధ్యయనం వెల్లడించింది. అటవీ భూములను విస్తారంగా ఇతర అవసరాలకు మళ్ళించడం, ప్రత్యేకించి 1980వ దశకానికి ముందు సరిస్క,బార్డోద్ వన్యప్రాణి సంరక్షణ ప్రాంతం చుట్టుపక్కల అటవీ భూములను వేరే అవసరాలకు ఉపయోగించడంవల్ల వాతావరణ పరిరక్షణకు సంబంధించి దేశీయ అటవీ ఛత్ర పరిధి అంతరించిపోయిందని, వన్యప్రాణుల మనుగడకు, వాటి ఆవాసాలకు సమస్యలు ఏర్పడ్డాయని, వన్య ప్రాణులకు నీటి వనరుల లభ్యత లేకుండాపోయిందని అధ్యయనం తెలియజేసింది. కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ బుధవారం న్యూఢిల్లీలో ఈ నివేదికను ఆవిష్కరించారు.

ఆరావళీ పర్వతశ్రేణుల్లో ప్రకృతి వనరులను, సహజసిద్ధమైన ప్రకృతిని పునరుజ్జీవింపజేయడానికి భారత్‌లోని డెన్మార్క్ దౌత్యకార్యాలయం, హర్యానా రాష్ట్ర అటవీశాఖల మద్దతుతో బాధ్యతలు తీసుకున్న సంకల ఫౌండేషన్ ఈ పరిశోధనా అధ్యయనం చేసింది. ఆరావళీ పర్వతశ్రేణి ప్రాంతంలో క్షీణించిపోతున్న జీవావరణ సమస్యను పరిష్కరించడానికి ఒక సమగ్ర వైఖరిని ఈ అధ్యయనం చేపట్టింది. జీవ వైవిధ్య సంరక్షణతో కూడిన పర్యావరణ స్థిరత్వం, వాతావరణ పరిస్థితులను పూర్వస్థాయికి తీసుకురావడం,జీవనభృతి భద్రత సాధించడం, మానవహక్కులు వంటివాటితో అనుసంధానమైన సమగ్ర వైఖరిని ఈ అధ్యయనం చేపట్టింది. ప్రపంచవ్యాప్తంగా చూసినప్పుడు మనదేశంలో ఉన్న ఆరావళీ పర్వతశ్రేణులు కొన్ని వందల కోట్ల సంవత్సరాలక్రితం ఏర్పడిన అత్యంత పురాతనమైన ప్రకృతి సంపద. దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్)కు, సింధు,గంగ,బ్రహ్మపుత్ర, దాని ఉపనదుల ద్వారా ఏర్పడిన ఉత్తర భారతదేశంలోని విశాలమైన సారవంతమైన భూభాగ సంరక్షణకు ఆరావళీ పర్వతశ్రేణులు ప్రకృతి సహజసిద్ధ వలయంగా పనిచేస్తున్నాయని అధ్యయనం తెలిపింది. ‘‘ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలలో విస్తరించిన ఈ పర్వతశ్రేణుల్లో సమస్యాత్మకంగా మారిన వాతావరణ,పర్యావరణవ్యవస్థ ఐదు కోట్లమంది ప్రజలకు పెద్ద ఆవాసంగా ఉంది. ఇప్పుడు అటవీ వనరుల నిర్మూలన కారణంగా ఆరావళీ పర్వతశ్రేణులకు పెద్ద బెడద వచ్చింది. ఈ ప్రాంతంలో భూమి నాణ్యత, భూసారం క్షీణించిపోతోంది. శరవేగంగా పట్టణీకరణ జరగడంవల్ల చాలా ప్రమాదం వాటిల్లింది, ఈ ప్రాంతం ఎడారీకరణ అవుతోంది, అంటే ఎడారి విస్తరణ లక్షణాలు సోకుతున్నాయి’’ అని నివేదిక తెలియజేసింది.

పైన పేర్కొన్న అధ్యయనంలోని సమస్యలను పరిష్కరించడానికి సంకల ఫౌండేషన్ చొరవ తీసుకుంది. ఆరావళీశ్రేణిలోని గురుగ్రాహం ప్రాంతంలో ఉన్న నాలుగు గ్రామాలలో పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఒక ఆదర్శనమూనా ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సన్నద్ధమైంది. ఈ కార్యక్రమం కింద ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, వారిని ప్రకృతి సంరక్షణలో భాగస్వామ్యం చేయడం, పర్యావరణ పునరుద్ధరణ చర్యలు తీసుకోవడం వంటి పనులు ఈ సంకల ఫౌండేషన్ ఈ ప్రాంతంలో చేపడుతుంది. ఆరావళీ పర్వతాలలో ఉన్న పూర్వ వైభవ నమూనాలను ఈ ప్రాంతంలో అభివృద్ధిచేసి ఒక నమూనా ప్రాంతంగా ప్రపంచం ముందు ప్రదర్శించడం ప్రస్తుత లక్ష్యం.

## ఖమ్మంకు అరుణశోభ

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ జెండాలను ఏర్పాటు చేశారు. నగరంతో పాటు నరంలో ప్రవేశించే అన్ని రహదారుల్లో స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్రను తెలియజేసేవిధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభకు హాజరయ్యే సిపిఐ జాతీయ నాయకత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి స్వాగతం తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పాలకుల నిర్బంధాలలో, ప్రజా పోరాటాలలో మరణించిన కమ్యూనిస్టు పార్టీ నాయకులను యాది చేసుకోవడంతో పాటు తెలంగాణ సాయుధ పోరాట అమరులను స్మరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే కనిపిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజలు హాజరుకానుండడంతో పోలీస్ యంత్రాంగం సైతం అప్రమత్తమైంది. సభా స్థలి ఏర్పాట్లను పోలీస్ అధికారులు పలుమార్లు పరిశీలించారు. నగరంలో జరిగే ప్రదర్శనతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

# మీడియా సంస్థలపై కేసులు

(మొదటి పేజీ తరువాయి)

అధికారిణిని లోబర్చుకుంటున్నారనే ఉద్దేశ్యంతో కథనాన్ని ప్రసారం చేయడం ద్వారా సదరు మహిళా అధికారి వృత్తిపరమైన నైతికతను, వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నం చేసినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రసారం పూర్తిగా బాధ్యతారహితమైనదని, అవాస్తవమైనదని, నిరాధారమైదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ స్టాల్‌ను బుధవారం హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ ప్రారంభం సందర్భంగా మీడియా ప్రతినిధుల అరెస్ట్ విషయంపై స్పందిస్తూ ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. మహిళలపై విమర్శలు చేస్తే కుటుంబాలు ఇబ్బందులు పడుతాయన్నారు. ఇలాంటి విషయాలపై మాట్లాడడం బాధ కలుగుతుందన్నారు. విచారణకు వస్తామని చెప్పి నిందితులు బ్యాంకాక్‌కు వెళుతుంటే మంగళవారం అర్ధరాత్రి నిందితులను అదుపులోకి తీసుకున్నామని సజ్జనార్ చెప్పారు.

**జర్నలిస్టులను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం సహించరానిది : టియుడబ్ల్యూజె**

విచారణ పేరుతో మంగళవారం రాత్రి ముగ్గురు ఎన్‌టివి జర్నలిస్టులను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం సహించరానిదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజె) పేర్కొన్నది. పోలీసుల అదుపులోఉన్న జర్నలిస్టులు దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్‌లను బేషరతుగా విడుదల చేయాలని టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు డిమాండ్ చేశారు. లేనట్లయితే రాష్ట్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. జర్నలిస్టుల ఇళ్లపై పోలీసులు దాడులు చేసి భయాందోళనలకు గురిచేయడం త్రీవంగా పరిగణించదంతో పాటు దీనిని ఖండిస్తున్నామని అన్నారు. ఎలాంటి నోటీసులు లేకుండా ఆర్ధరాత్రి వేళలో జర్నలిస్టుల ఇళ్లపై అందులో మహిళా జర్నలిస్టుల ఇళ్లలో సోదాలు చేసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్య అన్నారు. జర్నలిస్టులపై పోలీసులకు ఏమైనా ఫిర్యాదులు అందితే ప్రజాస్వామ్య పద్దతులలో వారిని విచారించే అవకాశాలు ఉన్నప్పటికీ అంతర్జాతీయ నేరస్థుల మాదరిగా జర్నలిస్టులను అదుపులోకి తీసుకుని మీడియా సంస్థలకు హెచ్చరికలు పంపించాలనుకుంటున్న ఇలాంటి వైఖరిని అనుసరించడం ప్రభుత్వానికి తగదన్నారు.

**నిజ నిర్ధారణకు ముందే అరెస్టు చేయడం భావ్యం కాదు : సిపిఐ**

జర్నలిస్టులపై అరెస్టును సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులు అనేక అంశాలను తెరపైకి తీసుకువస్తుంటారని, వాటిలో ఆధారాలు ఉన్నాయా లేదా అని పోలీసులు పరిశీలించాలి తప్ప ఇలా అరెస్టు చేయడం తగదన్నారు. నిజ నిర్ధారణ జరగకముందే అరెస్టు చేయడం సరైంది కాదని, అరెస్టు చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల అక్రమ అరెస్టును సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తీవ్రంగా ఖండించారు. హైదరాబాదులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. జర్నలిస్టులను నేరస్తులుగా చూడటం సరికాదని, తక్షణమే వారిని విడుదల చేయాలని ఎంఎల్‌సి సత్యం డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.ఐదురోజుల క్రితం ప్రసారమైన వార్త మీద నిన్న సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటుకు పూనుకుందని,సిట్ విచారణ పూర్తి చేయకుండా నిజాలను తేల్చకుండా,వెంటనే జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైనది కాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**జర్నలిస్టుల అరెస్టు పత్రికా స్వేచ్ఛపై దాడి : ఎన్.రామచందర్ రావు**

అర్ధరాత్రి సమయంలో విమానాశ్రయంలో ముగ్గురు ఎన్‌టివి జర్నలిస్టులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ఇది రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛపై , ప్రజాస్వామ్య విలువలపై ప్రత్యేక్షంగా జరిగిన ప్రమాదకరమైన దాడిగా ఆయన అభివర్ణించారు.ఈ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని, అలాగే వారి ఇందిరమ్మ రాజ్యం ఎంత భయంకరంగా ఉందో బయట పెడుతోందని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీ పై విమర్శలు చేసిన వారిని జైలుకు పంపినట్లే, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో నడుస్తున్నారన్నారు.

**అరెస్టుల అంశంలో సిట్ సంయమనం పాటించాలి : జగ్గారెడ్డి**

జర్నలిస్టుల అరెస్టు అంశంలో సిట్ అధికారులు సంయమనం పాటించాలని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. అసత్య కథనాలపై ద్వారా ఎవరినీ కించపర్చడం భావ్యం కాదన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం మంచిందేనని, అయితే పోలీసులు ఆచితూచి వ్యవహరించాల్సి ఉందన్నారు.

**జర్నలిస్టులను నేరస్థుల్లా చూడడం దురదృష్టకం : బిఆర్ఎస్**

పండుగ వేళా జర్నలిస్టులను చట్టవిరుద్ధంగా అరెస్టు చేయడంపట్ల బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామరావు మండిపడ్డారు. డిజిపి జర్నలిస్టులను నేరస్థుల్లా చూడడం దురదృష్టకరం అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తు చేస్తోందని విమర్శించారు. ఈమేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. పాలన చేతగాని సర్కార్ పండుగ పూట జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటాని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఇళ్లలో చొరబడి అర్ధరాతివేళ జర్నలిస్టులను అరెస్టులు చేయడానికి వాళ్లేమైనా తీవ్రవాదులా అన్ని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి గా ఆయన అభివర్ణించారు. జర్నలిస్టుల అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అర్ధరాత్రి పండుగ పూట జర్నలిస్టుల ఇళ్లలోకి వెళ్లి అరెస్టులు చేయడం అవసరమా అని ప్రశ్నించారు. జర్నలిస్టుల పట్ల అంత్యంత కఠినంగా వ్యవహరిస్తూ పండుగ వేళా వారి కుటుంబ సభ్యులను మానసిక వేదన గురి చేయడం భావ్యం కాదని, అరెస్టు జేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలన్నారు.

**జర్నలిస్టుల అరెస్టు అనైతికం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

ప్రజాస్వామ్యపు నాలుగో వ్యవస్థగా ఉన్న జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పు ఒప్పులను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

**అసత్య కథనాలు రాస్తే వివరణ కోరవచ్చు : జర్నలిస్టు సంఘాల నేతలు**

అసత్య కథనాలు రాస్తే ఖండన కోరవచ్చాని, స్పందించక పోతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు కాని , నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం తగదని టియుడబ్ల్యూజె నేతలు అల్లం నారాయణ, మారుతీసాగర్, టిఇఎంజెయు నేత ఎ.రమణకుమార్, ఐజెయు నేత అవ్వారి భాస్కర్‌లు పేర్కొన్నారు.

## వ్యక్తిత్వ హననం చేయవద్దు
### డిజిపి వార్నింగ్



సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననం(క్యారెక్టర్ అసాసినేషన్) పై తెలంగాణ డిజిపి బి.శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో గుర్తు చేశారు. డిజిపిగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశం చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని తెలిపారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్కులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరో మారు స్పష్టం చేశారు. అబద్ధాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## సమస్యలపై పోరాటం...
# పరిష్కారమే సిపిఐ ధ్యేయం

### వందేళ్ల స్ఫూర్తితో బలమైన ఉద్యమాలు చేద్దాం

### మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ శత వసంతాల సాక్షిగా సమస్యలపై పోరాటం, వాటి పరిష్కారమే ధ్యేయంగా మరో వందేళ్లు కూడా ముందుకు సాగుదామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పార్టీ శాఖల కార్యదర్శులు, పట్టణ కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు, మాజీ కౌన్సిలర్ల అత్యవసర సమావేశం స్థానిక శేషగిరి భవన్, సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ దేశ స్వతంత్రానికంటే ముందే భారత గడ్డపై ఆవిర్భవించిన సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. బ్రిటీష్ బానిస సంకెళ్ల నుండి దేశాన్ని విముక్తి చేసేందుకు సిపిఐ రాజీ లేని పోరాటం చేసిందని, ఈ మహా సంగ్రామంలో ఎందరో కమ్యూనిస్టు యువకిశోరాలు రక్త తర్పణం చేశారని చెప్పారు. భూమి కోసం భుక్తి కోసం నిరంకుశ నిజాంను గద్దె దింపేందుకు జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నరవేల మంది ప్రాణ త్యాగాలు చేశారని, వేలాది గ్రామాలు విముక్తి పొందగా, పది వేల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐకు ఉందని, అదే విధంగా తెలంగాణ మలిదశ పోరాటంలో సిపిఐ పెద్దన్న పాత్ర పోషించిందన్నారు. నాటి నుండి నేటి వరకు అదే పోరాట పటిమతో సిపిఐ వందేళ్లుగా ముందుకు సాగుతోందని, రానున్న శత వసంతం కూడా ప్రజలు, కార్మికులు, కర్షకులు, రైతులు, వ్యవసాయ కూలీలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఉత్తేజ పూరితంగా ముందడుగు వేద్దామన్నారు. దేశంలోని సబ్బండ వర్గాల ప్రజానికాన్ని కట్టుబానిసలుగా మార్చేందుకు చూస్తున్న బిజెపి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, ఇందు కోసం కమ్యూనిస్టులు ఐఖ్యత, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐఖ్యత అనివార్యమని చెప్పారు. ఈనెల 18న ఉద్యమాల పురిటిగట్ట ఖమ్మం కేంద్రంగా సిపిఐ శత వసంత ఉత్సవాల ముగింపు సభ ఐదు లక్షల మందితో వైభవంగా జరగనుందని, 40 దేశాల నుండి కమ్యూనిస్టు ప్రతినిధులు తరలి వస్తున్నారని చెప్పారు. కమ్యూనిస్టులకు పస తగ్గిందంటూ నోళ్లు పారేసుకుంటున్న వారికి కనీవినీ ఎరుగని రీతిలో జరిగే ఈ శత వసంత సభ కనువిప్పు కానుందని, ఈ సభను విజయవంతం చేసేందుకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయని, నూతనంగా ఏర్పాటైన కొత్తగూడెం కార్పొరేషన్‌కు జరిగే ఎన్నికల్లో సిపిఐ విజయం సాధించేందుకు ఆయా డివిజన్ల కార్యదర్శులు, మాజీ కౌన్సిలర్లు ఇప్పటి నుండే కృషి చేయాలని, ప్రజలతో మమేకమై చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, గెలుపై లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ ఎన్నికల్లో స్థానిక పరిస్థితులు, స్థితిగతుల దృష్ట్యా కలిసివచ్చే వారితో పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణా చారి, బండి నర్సింహా, గుమ్మడెల్లి దుర్గ, పల్లపోతు సాయి కుమార్, పైడిపెల్లి లక్ష్మి, కైసర్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

# 18న మేడారానికి
# ముఖ్యమంత్రి, మంత్రులు

భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

19న మేడారం గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం

సన్నాహాల్లో ములుగు జిల్లా యంత్రాంగం : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు :** ఈ నెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు మేడారానికి రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం మేడారం హరిత హోటల్‌లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, జిల్లా ఎస్‌పి రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్రమిశ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మేడారం చేరుకున్న అనంతరం అక్కడే బస చేయనున్నారని 19వ తేదీన శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవం చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. 18వ తేదీన రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొత్తం మేడారంలోనే ఉండనున్నందున, ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులను కోరారు. 18వ తేదీ ఆదివారం కావడం, పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ముగియడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని, ఆ దృష్టితో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మేడారం అభివృద్ధి పనుల్లో సహకరిస్తున్న జిల్లా అధికారులు, వారి బృందాలకు, జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు మంత్రి తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్యమంత్రి రాక సందర్భంగా ప్రోటోకాల్, బందోబస్తు, వసతి, సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హెలిప్యాడ్ నిర్వహణ పనులను ఆర్ అండ్‌బి శాఖకు అప్పగించారు. మేడారం జాతరతో పాటు గద్దెల ప్రాంగణ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిచాలని డిపిఓను ఆదేశించారు. ముఖ్యమంత్రి, విఐపి ప్రోటోకాల్ బాధ్యతలను ఆర్‌డిఓ వెంకటేష్‌కు అప్పగించారు. ముఖ్యమంత్రి నిర్వహించే బహిరంగ సభకు జిల్లాలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. అలాగే ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ధింసా, కోయ, గుస్సాడి, కొమ్ము కోయ తదితర సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి భద్రత రూట్ మ్యాప్, పార్కింగ్, గార్డ్ ఆఫ్ ఆనర్ ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షించనున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, ఆర్‌డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానము

చిలుపూర్‌గుట్ట, చిలుపూర్ గ్రా|| మరియు మం||, జనగామ జిల్లా.

**సీల్డ్ టెండర్ కం-బహిరంగ వేలము ప్రకటన**

లేఖ నెం.: SBVSD/Tenders/2026, తేది: 09.01.2026.

దేవాదాయ ధర్మాదాయశాఖ, జనగామ జిల్లా, చిలుపూర్ గ్రా|| మరియు మం|| నందు కల శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము నందు సీల్డు టెండరు - కం - బహిరంగ వేలములు తేది: 19.01.2026 సోమవారం రోజున ఉదయం 11-00 గంటలకు ఆదాయ టెండర్లు మధ్యాహ్నం 2-00 గంటలకు వ్యయ టెండర్లు దేవస్థాన కార్యాలయమునందు జరుపబడును. ఈ క్రింద తెలిపిన పద్దులపై టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరముల కొరకు దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించగలరు.

| క్ర.సం. | వేలము వివరములు | డిపాజిట్ సొమ్ము | పాట కాలపరిమితి |
|---|---|---|---|
| ఆదాయ వేలము వివరములు: | | | |
| 1 | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి అమ్ముకొను హక్కు మరియు గండదీపం వద్ద నూనెప్రోగు చేసుకొనుటకు మరియు కొబ్బరిముక్కలు ప్రోగు చేసుకొను హక్కు, | 3,00,000/- | 01.04.2026 నుండి 31.03.2027 వరకు (ఒక సంవత్సరము) |
| 2 | అంగడిలో పశువుల క్రయ విక్రయ మరియు దుకాణ పన్నులు వసూలు హక్కు, | 3,00,000/- | 01.04.2026 నుండి 31.03.2027 వరకు (ఒక సంవత్సరము) |
| 3 | తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కునకు | 3,00,000/- | 01.04.2026 నుండి 31.03.2027 వరకు (ఒక సంవత్సరము) |
| వ్యయ వేలముల వివరములు: | | | |
| 1 | రంగులు మరియు సున్నములు సప్లయి చేయుటకు లైసెన్స్ టెండర్ కోరుట | 1,000/- | 20.01.2026 నుండి 19.01.2027 వరకు |
| 2 | రంగులు మరియు సున్నములు వేయుటకు లైసెన్స్ టెండర్ కోరుట | 1,000/- | 20.01.2026 నుండి 19.01.2027 వరకు |

సం//- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 13722-PP/CL/ADVT/1/2025-26, Date: 14-01-2026


**గమనిక :** 14.01.2026వ తేదీన 'ప్రజాపక్షం' 3వ పేజీలో 'ఆంధ్రా సిపిఐ'పై ప్రచురించిన కథనంలో దిగువ నుంచి 2వ పేరాలో "...2004 తర్వాత 2009 నుంచి 2023వరకు రెండు పార్టీలకు శాసనసభలో ప్రాతినిధ్యం లేదు" అన్న వాక్యం సరైన సమాచారం ఇవ్వటంలేదు. దాన్ని ఇలా చదువుకోగోర్తాం – ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 2009లో సిపిఐ 4, సిపిఐ(ఎం) 1 స్థానానికి తగ్గిపోయాయి. రాష్ట్ర విభజనానంతరం, 2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రెండు పార్టీలకు ప్రాతినిధ్యం దక్కలేదు. తదుపరి 2019, 2024 ఎన్నికల్లో అదే పరిస్థితి కొనసాగుతున్నది. కాగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి తొలి ఎన్నికల్లో (2014) సిపిఐ, సిపిఐ(ఎం)లకు చెరొక సీటు లభించాయి. 2018 ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కలేదు. కాగా 2013 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుతో పోటీచేసిన కొత్తగూడెం సీటు నుంచి కూనంనేని సాంబశివరావు (ఆయన 2009లో తొలిసారి గెలిచారు) గెలుపొందటంతో తెలంగాణ అసెంబ్లీలో పార్టీకి ప్రాతినిధ్యం లభించింది – సం.




# తెలంగాణలో కమ్యూనిస్టు ఉద్యమం


భారత జాతీయ కాంగ్రెస్‌లో నుండే కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడింది. జయప్రకాశ్ నారాయణ్ 'వై సోషలిజం?' అన్న పుస్తకం, జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ యూనియన్ సందర్శన అనుభవాలు, అక్టోబరు విప్లవ చరిత్ర, భగత్‌సింగ్, చంద్రశేఖర ఆజాద్ వంటి విప్లవవీరుల జీవితచరిత్రలు హైదరాబాద్ రాజ్యంలోని తెలంగాణ జిల్లాల్లో ప్రాచుర్యం పొందాయి. గాంధీ తత్వానికి పర్యాయపదంగా, ప్రత్యామ్నాయంగా సోషలిజం ప్రాచుర్యం పొందింది.

ఆంధ్రమహాసభలో రావినారాయణరెడ్డి నేతృత్వంలో బద్దం యెల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీ నరసింహారెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, చిర్రావూరి లక్ష్మీ నరసయ్య, ఎ.గురవారెడ్డి, రాజిరెడ్డి వంటి యువదళానికి సోషలిస్టు సాహిత్యం మార్గదర్శకమైంది. ఆంధ్రమహాసభను ఒక సాహిత్యోద్యమం నుండి ప్రజా ఉద్యమంగా, రాజకీయ వేదికగా పరివర్తింపజేయాలనేది వారి ఉద్దేశం.

1934లో జరిగిన ఖమ్మం మహాసభల్లో ఆంధ్రమహాసభ అస్పృశ్యతను ప్రధానాంశంగా స్వీకరించింది. 1935 సిరిసిల్ల మహాసభలు ఆంధ్ర మహాసభను ప్రజా ఉద్యమంగా మార్చాయి. ఆ తర్వాత సంవత్సరం షాద్‌నగర్ మహాసభ ప్రధానంగా హరిజనోద్ధరణ, వెట్టి నిర్మూలన సమస్యలను చర్చించింది. 1937 నిజామాబాదు మహాసభ గస్తీనిషాన్ 53 రద్దు కోసం తీర్మానం చేసింది. పౌరహక్కులు, రైతులు ఎదుర్కుంటున్న సమస్యలపై పోరాడాలని తీర్మానించింది.


రావి నారాయణరెడ్డి



బద్దం ఎల్లారెడ్డి


మఖ్దూం మొహియుద్దీన్


రాజ్ బహదూర్‌గౌర్


ధర్మభిక్షం


ఆరుట్ల రామచంద్రారెడ్డి


దేవులపల్లి వెంకటేశ్వరరావు


భీమిరెడ్డి నరసింహారెడ్డి


తెలంగాణ ఆంధ్ర మహాసభ, మహారాష్ట్ర పరిషత్తు, కర్ణాటక పరిషత్తు ఏకమయ్యాయి. హైదరాబాద్ స్టేట్‌లో మూడు ప్రాంతాలకు చెందిన జాతీయవాద భావాలు కలిగిన గోవిందరావు నానల్, రామానందతీర్థ, గోవింద్ దాస్ షరాఫ్, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణరెడ్డి, రామకృష్ణ ధూత్, సిరాజుల్ హసన్ వంటి నాయకులు జాతీయస్థాయి నాయకులతో సంబంధాలు నెలకొల్పుకున్నారు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను ఒక రాజకీయ శక్తిగా మార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ లక్ష్యం కోసం రావి నారాయణరెడ్డి, రామానంద తీర్థ, గోవింద్ దాస్ షరాఫ్ తదితరులు గాంధీజీని కలిసి దీనికోసం ఆయన అనుమతిని తీసుకున్నారు.


**కామ్రేడ్స్ అసోసియేషన్**

ఉత్తర భారతదేశం నుండి వచ్చే పత్రికల ప్రభావం ఫలితంగా హైదరాబాద్‌లో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పడింది. సయ్యద్ ఆలం ఖుంద్ మీరీ, మఖ్దూంమొహియుద్దీన్, మాణిక్‌లాల్ గుప్తా, రాజ బహదూర్ గౌర్, సయ్యద్ ఇబ్రహీం, ఆసిఫ్ అలీ మీర్జా, ఖుత్బే, గులాం హైదర్, జవాద్ రిజ్వి, ఓంకార్ ప్రసాద్, సజాద్ రజ్వీ, హుసేన్ షాహీద్, లియాఖత్ హుసేన్‌లు ఈ సంఘ సంస్థాపక సభ్యులు. హిందూ – ముస్లిం ఐక్యత, సామ్రాజ్యవాదం, ఫాసిజాలకు వ్యతిరేకంగా పోరాటం, నిజాం రాజ్యభాగాల్లో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం, సోషలిజం తన ముఖ్య లక్ష్యాలుగా సంఘం ఎంచుకుంది. ఆంధ్ర మహాసభ, స్టేట్ కాంగ్రెస్ శాఖలకు చెందిన సిరాజుల్ హసన్, హరిశ్చంద్ర హెడా, రావి నారాయణరెడ్డి, బూర్గుల నరసింగరావు, బూర్గుల రామకృష్ణారావు, జయసూర్య, పద్మజానాయుడు, పండిట్ నరేంద్రజీ, రామకృష్ణ ధూత్, స్వామీ రామనంద తీర్థ వంటి నాయకులు కామ్రేడ్ల సంఘ సమావేశాల్లో ప్రసంగించారు. చర్చల్లో పాల్గొన్నారు. సంఘం క్రమంగా ఒక సాహిత్య సామాజిక రాజకీయ ఉద్యమంగా రూపుతీసుకుంది.

1939లో లక్నోలో జరిగిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) సమావేశంలో మఖ్దూం మోహియుద్దీన్, రాజ బహదూర్‌గౌర్‌లు హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించారు. 12 అక్టోబరు 1939న రెడ్డి విద్యార్థి వసతి గృహంలో జరిగిన విద్యార్థి సమావేశంలో ఔరంగాబాదుకు చెందిన అక్బిన్ అలీఖాన్ ప్రధాన కార్యదర్శిగా, ఓంకార్ ప్రసాద్ సహాయకార్యదర్శిగా ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ స్థాపన జరిగింది. హైదరాబాద్‌లో విద్యార్థులు వందేమాతరం ఉద్యమంలో కూడా పాల్గొన్నారు.

1939లో ప్రారంభమైన ఆంధ్రప్రాంత కమ్యూనిస్టు పార్టీ శాఖ ప్రజాసంఘాలు స్థాపించి ప్రజా ఉద్యమాలు ప్రారంభించింది. హైదరాబాద్ రాజ్య పరిస్థితులను ముఖ్యంగా తెలంగాణ ప్రాంత పరిస్థితులను జాగ్రత్తగా పరిశీలించడం ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంత పార్టీ శాఖలు కలిసి పనిచేయవలసిన అవసరాన్ని పార్టీ గుర్తించింది.


చాడ వెంకటరెడ్డి


కూనంనేని సాంబశివరావు


తక్కళ్లపల్లి శ్రీనివాసరావు


ఇ.టి.నరసింహ

ఖమ్మంలోని కమ్మహాస్టల్ వార్డెన్ పొట్లూరి సుందరం ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త, రైతుసంఘం సభ్యుడు కూడా. సుందరం ఖమ్మంలోని చిర్రావూరి లక్ష్మీ నరసయ్య తదితరులతో మంచి సంబంధాలు నెలకొల్పుకున్నాడు. అదేవిధంగా దేవులపల్లి వెంకటేశ్వరరావు మధిర, మునగాల పరగణాలలోని స్థానిక నాయకత్వంతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకున్నాడు.

రాష్ట్ర కాంగ్రెస్ శాఖపై నిషేధం కారణంగా హైదరాబాద్ రాజ్యంలో ఒక అనిశ్చిత పరిస్థితి ఏర్పడి ఉంది. కాని కామ్రేడ్ల సంఘం, అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘం కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ రాజ్య కమ్యూనిస్టు పార్టీ శాఖ నాయకుడు చంద్ర రాజేశ్వరరావు మారుపేరుతో (సుబ్బారెడ్డి) రెడ్డి హాస్టల్‌లో ఉన్నాడు. ఆయన రహస్యంగా రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు.

1940 ఏప్రిల్‌లో మల్కాపురంలో జరిగిన ఆంధ్ర మహాసభలో ఐజగార్ కమిటీ ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణలు ప్రధాన చర్చనీయాంశమ య్యాయి. ఈ ప్రగతి నిరోధక సవరణలను తిరస్కరించాలని రావి నారాయణరెడ్డి ప్రతిపాదించగా మితవాదులు వ్యతిరేకించారు. స్టేట్ కాంగ్రెస్ ఉద్యమంలో భాగంగా వ్యక్తిగత సత్యాగ్రహోద్యమం ప్రారంభించాలని నిర్ణయించారు. బద్దం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీ నర్సింహ్మారెడ్డి దాదాపు 15 బృందాలతో సత్యగ్రహం నిర్వహించారు.

ఆంధ్ర మహాసభలోని అతివాద వర్గం సంస్థపై ఆధిపత్యాన్ని సంపాదించింది. ఈ వర్గ యువనాయకుడైన రావి నారాయణరెడ్డిని 8వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ మహాసభ 1941 జూన్‌లో నల్లగొండ జిల్లా చిలుకూరులో జరిగింది. ఇది అంతకు ముందటి మహాసభలకు పూర్తిగా భిన్నమైనది. మహాసభ ప్రారంభం కాకముందే జనసమీకరణకోసం సభా సమాచారాన్ని అన్ని ఊళ్లకూ వ్యాపింపజేశారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి, ధర్మభిక్షం, దొడ్డా నరసయ్య, వెదిరె రాజిరెడ్డి (నల్లగొండ జిల్లా ఆంధ్ర మహాసభ శాఖాధ్యక్షుడు), కమ్యూనిస్టు నాయకుడు దేవులపల్లి వెంకటేశ్వరరావు వంటి యువనాయకులు ఆ జన సమీకరణ కార్యక్రమంలో భాగస్వాములు. గృహ నిర్బంధంలో ఉన్న బద్దం యెల్లారెడ్డి మహాసభకు హాజరుకాలేకపోయాడు. కాని మఖ్దూం మోహియుద్దీన్, రాజ బహదూర్‌గౌర్, సయ్యద్ ఇబ్రహీం తదితర కామ్రేడ్స్ అసోసియేషన్ నాయకులు, విద్యార్థి సంఘ నాయకుడు ఓంప్రకాశ్ తదితరులు హాజరయ్యారు. ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు చంద్ర రాజేశ్వరరావు నాయకత్వంలో పాల్గొన్నారు.

సభానంతరం తెలంగాణ ప్రాంత కమ్యూనిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తల కోసం కారేపల్లిలో రాజకీయ శిక్షణ తరగతిని నిర్వహించారు. రావి నారాయణరెడ్డి, బద్దం యెల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, నేదునూరి జగన్నాథరావు, రంగారావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి (సిరిసిల్ల), ఆరుట్ల రామచంద్రారెడ్డి, లక్ష్మీ నరసింహారెడ్డి, సర్వదేవభట్ల రామనాథం, పెరవల్లి వెంకట రమణయ్య, రామకృష్ణ శాస్త్రి, డి.సుబ్బారావు, చిర్రావూరి లక్ష్మీ నరసయ్య, దుర్గాప్రసాదరావు, రావెళ్ళ జానకిరామయ్య, అనభేరి ప్రభాకర రావు, దాజి శంకరరావు, కుర్రారం రామిరెడ్డి, వాసిరెడ్డి వెంకటపతి, పెండ్యాల సత్యనారాయణ ఈ తరగతుల్లో పాల్గొన్నారు. బద్దం యెల్లారెడ్డిని రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. పార్టీని శక్తిమంతం చేసే ప్రయత్నాలు రహస్యంగా జరగాలనీ, ప్రజా ఉద్యమాలను పార్టీ నిర్మాణానికి ఉపయోగించుకోవాలనీ నిర్ణయించారు.

హైదరాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ తాత్కాలిక కమిటీని ఏర్పరిచారు. రావి నారాయణరెడ్డి, బద్దం యెల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, దేవులపల్లి వెంకటేశ్వరరావు (నల్లగొండ జిల్లా కార్యదర్శి), పెరవల్లి వెంకటరమణయ్య (వరంగల్లు), చంద్రగుప్త చౌదరీ (ఔరంగాబాదు), వి.డి.దేశ్‌పాండే (నాందేడ్) సభ్యులు, ఆంధ్ర శాఖకు చెందిన ఎస్.వి.కె.ప్రసాద్ సమావేశకర్తగా వచ్చారు.

చిలుకూరు మహాసభ తర్వాత ఆంధ్ర మహాసభలో అప్పటికే ఉన్న అభిప్రాయ భేదాలు మరింత పెరిగి అది మూడు వర్గాలుగా చీలిపోయింది. అతివాదులు (కమ్యూనిస్టులు), మితవాదులు; జాతీయవాదులు (స్టేట్ కాంగ్రెస్ శాఖలో స్వామి రామానంద తీర్థ వర్గం). ఆంధ్ర మహాసభను మళ్ళీ తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవడానికి మితవాదులు తీవ్ర ప్రయత్నం చేశారు. 1942 (వరంగల్లు జిల్లా ధర్మవరం), 1943 (హైదరాబాదు) మహాసభల్లో మితవాదులు పైచేయి సంపాదించి, చిలుకూరు మహాసభ నిర్ణయాలను కొన్నిటిని సవరించారు. తమ స్వీయ నిర్లక్ష్యమూ, మితవాదుల ప్రయత్నాలను తక్కువగా అంచనా వేయడం తమ ఓటమికి కారణమని కమ్యూనిస్టులు గ్రహించారు. వాళ్లు మళ్లీ ఆంధ్ర మహాసభ కార్యకలాపాలపై కేంద్రీకరించడం ప్రారంభించారు.

1944 మే 27, 28 తేదీలలో ఆంధ్ర మహాసభ పదకొండవ మహాసభలు భువనగిరిలో జరిగాయి. రావి నారాయణరెడ్డి అధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. మహాసభలో తమ ఓటమి నిశ్చితమని తెలుసుకున్న మితవాదులు సభలను బహిష్కరించారు. అయితే జాతీయవాదులు పాల్గొన్నారు. కొత్వాలు వెంకటరామరెడ్డి అతిథిగా వచ్చి ప్రసంగించాడు. ఆరుట్ల సోదరులు మహాసభల నిర్వహణ బాధ్యతను స్వీకరించారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి, రామనాథం, లక్ష్మీ నరసయ్య, ధర్మబిక్షం తదితర నాయకులు వేలాది ప్రజలను సమీకరించారు. ఆంధ్ర రాష్ట్రం నుండి ఆంధ్ర మహాసభలలో పాల్గొన్న ప్రతినిధి వర్గానికి చంద్ర రాజేశ్వరరావు, మద్దుకూరి చంద్రశేఖరరావులు నాయకత్వం వహించారు. ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కూడా పాల్గొన్నారు. మితవాదులు సమాంతరంగా తమ సభల్ని ప్రకటించారు. కాని వాటికి ప్రజల నుండి అంతగా సమర్థన లభించలేదు.

12వ ఆంధ్ర మహాసభ సమావేశాలు ఖమ్మంలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ సమావేశ సమయానికి కమ్యూనిస్టు సిద్ధాంతం ఆంధ్ర మహాసభకు మార్గదర్శకమైంది. ఆంధ్ర మహాసభకు,కమ్యూనిస్టు పార్టీకి మధ్యనున్న సన్నని గీత చెరిగిపోయింది. జనం రెండింటినీ, 'సంఘ'మనే పిలిచారు. గ్రామాల్లో దొరల ఆగడాలకు ప్రజా ప్రతిఘటన ఉధృతమైంది. నిజాం సైన్యం, రజాకార్ల అమానుష దాడులు పెచ్చరిల్లాయి. ఇదిలా వుండగా, 1946 జూన్ 11న నిజాం మీర్ ఉస్మాన్‌ఖాన్ 'ఆజాద్ హైదరాబాద్' ఫర్మానా ప్రకటించాడు. జులైలో స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేశాడు. మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ నాయకుడు ఖాసిం రజ్వీ 'ఆజాద్ హైదరాబాద్' ప్రకటన ముస్లిం రాజ్యరక్షణ కోసమనీ, రాజ్యంలోని ముస్లిములందరూ దాని రక్షణ కోసం ప్రతినబూనాలనీ ప్రకటించాడు.

1946 నవంబరు 16న ప్రభుత్వం ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలపై నిషేధం విధించి నాయకుల అరెస్టుకు రంగం సిద్ధం చేసింది.

1947 ఆగస్టు 15న హైదరాబాద్ రాజ్యాన్ని స్వతంత్ర దేశంగా మారుస్తూ నిజాం 'ఆజాద్ హైదరాబాద్'ను ప్రకటించాడు. స్వతంత్ర భారత ప్రభుత్వం నిజాం భారత యూనియన్‌లో చేరేటట్లు చేయడానికి అతను తన రాజ్యాన్ని భారతదేశంలో భాగంగా ప్రకటించినట్లయితే అతన్ని స్వతంత్ర రాజ్యాధిపతిగా గౌరవిస్తామని వాగ్దానం చేస్తూ సంధి ప్రయత్నాలు ప్రారంభించింది.

1947 సెప్టెంబరు 11న రావి నారాయణరెడ్డి, బద్దం యెల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌లు నిజాంను తొలగించడానికి, రాజ్యాన్ని భారత యూనియన్‌లో చేర్చడానికి సాయుధ పోరాటం ప్రారంభించాలని నిర్ణయించారు. హైదరాబాద్ రాజ్య వ్యాప్తంగా రైతులు, కూలీలు, విద్యార్థులు, కార్మికులు, యువకులు, మహిళలు ఈ పిలుపునకు సానుకూలంగా స్పందించారు. కమ్యూనిస్టులు, ఆంధ్ర మహాసభ ఊహించినట్లుగా 1947 నవంబరు 26న భారత ప్రభుత్వానికీ, నిజాముకూ మధ్య యథాతథ స్థితి ఒప్పందం జరిగింది. అది ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజాఉద్యమాన్ని సాయుధ పోరాటాన్ని అణచడానికి అదనపు బలాన్నిచ్చింది. గ్రామాల మీద దాడులు చేశారు. ఇళ్లు దోచుకున్నారు. తగలబెట్టారు. స్త్రీలను విచక్షణారహితంగా మానభంగాలు చేశారు. అసంఖ్యాకంగా మనుషుల్ని హింసించి చంపారు. తెలంగాణ సాయుధ పోరాటం ఇప్పుడు దేశవిదేశాల దృష్టిని ఆకర్షించింది. ప్రపంచవ్యాప్తంగా పోరాటానికి ప్రజలు సమర్థన తెలిపారు.

1948 సెప్టెంబరు 17న భారత ప్రభుత్వ సైన్యం నిజాం రాజ్యంలోకి ప్రవేశించింది. నిజాం ఓటమిని అంగీకరించి భారత యూనియన్‌లో హైదరాబాద్ రాజ్య విలీనాన్ని ప్రకటించవలసి వచ్చింది. అయినా కమ్యూనిస్టు పార్టీ తన సాయుధ పోరాటాన్ని కొనసాగించాలనే నిర్ణయించింది. మరోవైపు భారతప్రభుత్వం తెలంగాణ ప్రాంత కమ్యూనిస్టుల నిర్మూలనకు నిర్ణయించుకుంది.

తెలంగాణా సాయుధ పోరాటంలో 4000 మందికి పైగా అమరులైనారు. తెలంగాణ సాయుధ సమరం చరిత్రలో, భారత స్వాతంత్ర పోరాటం అంతిమ సమరంగా మిగిలిపోయింది. 1952 ఎన్నికల్లో సిపిఐ పాల్గొన్నది. ప్రజలు ఘనంగా ఆదరించారు. తర్వాత కాలపు చరిత్ర తెలిసిందే.

* * *

2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దరిమిలా సిపిఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర సమితులు విడివిడిగా ఏర్పడినాయి. 2015 మార్చిలో తెలంగాణ కమ్యూనిస్టు సమితి ప్రథమ మహాసభలో చాడ వెంకటరెడ్డి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 2018 మహాసభలో ఆయన తిరిగి ఎన్నికైనారు. 2022లో శంషాబాద్‌లో జరిగిన మూడవ మహాసభలో కూనంనేని సాంబశివరావు కార్యదర్శిగా, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, నక్కా బాలమల్లేశ్‌లు సహాయ కార్యదర్శులుగా ఎన్నికైనారు. 2025 ఆగస్టులో మేడ్చల్‌లో నాల్గవ మహాసభలో సాంబశివరావు కార్యదర్శిగా, తక్కళ్లపల్లి, ఇ.టి.నర్సింహా సహాయ కార్యదర్శులుగా ఎన్నికైనారు.

**– కందిమళ్ల ప్రతాపరెడ్డి**



## దశాబ్దాల పోరాటం ఫలించింది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రావిరాల, జన్నాయిగూడెం భూ నిర్వసితులకు ఇంటి స్థలమే కాదు.. భూమికి నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రావిరాల, జన్నాయిగూడెం ఫాబ్‌సిటీ భూ నిర్వాసితులు బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కలిసి అభినందించారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో రంగారెడ్డి జిల్లా, రావిరాల జన్నాయిగూడెంలో 224 మంది రైతుల వద్ద 827 ఎకరాల భూమిని ఫాబ్ సిటీ నిర్మాణ కోసం సేకరించిందన్నారు. భూమి పొజిషన్లో ఉన్న వారికి ఎకరాకు 150 గజాలు, భూమి కోల్పోయిన సీలింగ్ రైతులకు ఎకరాకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామన్న హామీని విస్మరించడంతో రంగారెడ్డి జిల్లా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక దఫాలుగా పోరాటాలు నిర్వహించిందన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల రావిరాల ప్రాంత సందర్శన నేపథ్యంలోనే పెద్ద ఎత్తున సిపిఎం ప్రతిఘటన కార్యక్రమాలకు పూనుకోగా, 150 నుండి 250 గజాల స్థలాల ఉచిత రిజిస్ట్రేషన్, ఇళ్ల స్థలాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందనే ఒప్పందం జరిగింది. ఈ మేరకు ఇప్పటికే నలుగురికి రిజిస్ట్రేషన్స్ కూడా చేసిందన్నారు. ప్రభుత్వం సేకరించిన భూమికి నేటికీ నష్టపరిహారం చెల్లించపోవడం బాధకరమన్నారు. ప్రభు త్వం వెంటనే మిగిలిన రైతులందరికీ ప్లాట్ల కేటాయింపుతో పాటు, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బోగి, మకర సంక్రాంతి,కనుమ పండుగ పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు రవాణా , బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలతో సిరి సంపదలతో ప్రజలందరూ ఆనందంగా, సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యులతో కలిసి పండగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భోగి, సంక్రాంతి ప్రజల జీవితాల్లో నూతన కాంతులు తీసుకురావాలని, ఆనందోత్సాహాల నడుమ భోగి, సంక్రాంతి పండుగ జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. పిల్లలు, పెద్దలు గాలి పటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఐ-ప్యాక్‌పై టిఎంపి పిటిషన్ కొట్టివేత

**కోల్‌కతా:** ఐ-ప్యాక్ కార్యాలయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడుల కేసులో కోల్‌కతా హైకోర్టు బుధవారం తృణమూల్ కాంగ్రెస్ పిటిషన్‌ను కొట్టివేసింది. గురువారం సుప్రీంకోర్టులో కేసు విచారణ నేపథ్యంలో ఇ.డి విచారణను వాయిదా వేసింది. తమ పార్టీకి సంబంధించిన కీలకమైన డేటాను రక్షించాలని కోరుతూ కోల్‌కతా హైకోర్టులో టిఎంసి పిటిషన్ దాఖలు చేసింది. జనవరి ఎనిమిదో తేదీన తాము ఐ-ప్యాక్ కార్యాలయం పైన, సదరు డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంపైన దాడి సందర్భంగా ఎలాంటి పత్రాలను స్వాధీనం చేసుకోలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ న్యాయస్థానానికి స్పష్టం చేయడంతో టిఎంసి పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ఇ డి తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు ప్రాతినిధ్యం వహించారు. దర్యాప్తు సంస్థ ఎలాంటి పత్రాలను ఈ దాడుల్లో స్వాధీనం చేసుకోలేదని ఆయన కోర్టుకు స్పష్టం చేశారు. జనవరి ఎనిమిదో తేదీన జరిగిన రాద్ధాంతంపై సిబిఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరుతూ ఇ డి చేసిన విజ్ఞప్తిపై హైకోర్టు తన విచారణను వాయిదా వేసింది.

# ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు

### గంగిరెద్దులకు పూజలు, హరిదాసులకు భిక్ష ప్రదానాలు





**హైదరాబాద్ :** సరికొత్త ఆశలతో రాష్ట్రవాసులు ఉత్తరాయణానికి స్వాగతం పలికారు. భోగి మంటల కాంతుల నడుమ సంక్రాంతి సంబరాలకు నాంది పలికారు. సకల భోగభాగ్యాలను ప్రసాదించే భోగి పర్వదిన వేడుకలు ఊరువాడా ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజామునే చిన్నాపెద్దా భోగిమంటల చుట్టూ చేరి అంతా మంచి జరగాలని ప్రార్థించారు. రాష్ట్రంలోని లోగిళ్లన్నీ భోగి సందడితో కళకళలాడుతున్నాయి. హైదరాబాద్ రాయదుర్గం మైహోమ్ భుజాలో భోగి సంబురాలు అట్టహాసంగా జరిగాయి. అపార్ట్‌మెంట్ ఆవరణలో పాత సామాగ్రిని భోగి మంటల్లో వేసి, చెడు తొలగిపోయి మంచి జరగాలని ఆకాంక్షించారు. వెంగల్‌రావు నగర్‌లోని కాలనీవాసులు భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

**ఉత్సాహంగా నృత్యాలు :** ఎల్బీనగర్ చిత్రా లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. వేకువజామునే భోగి మంటలేసి ఆనందోత్సాహాల నడుమ సంక్రాంతికి స్వాగతం పలికారు. బసవన్నల ఆటలు, హరిదాసు కీర్తనలతో పండుగ సంస్కృతీ సంప్రాదాయాలను కళ్లకు కట్టారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు భోగి మంటలు చుట్టూ చేరి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. గంగిరెద్దులకు పూజలు చేసి, హరిదాసులకు భిక్ష ప్రదానం చేశారు.

**కొత్తదనానికి స్వాగతం పలుకుతూ :** వరంగల్ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. నగరంలోని బృందావనం అపార్ట్‌మెంట్ వాసులు భోగిమంటలు వేసి సందడిగా గడిపారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో భోగి పర్వదినాన పాతకు వీడుకోలు పలుకుతూ కొత్తదనానికి స్వాగతం పలికారు. ద్వారక పేటలో శ్రీ ద్వారకా వేణుగోపాల స్వామి ఆలయంలో భోగిమంటల చుట్టూ కోలాటాలు వేశారు. మాతృభూమి ఛారిటబుల్ ట్రస్ట్ అనాథ ఆశ్రమంలో చిన్నారులు భోగి మంటలు వేసుకొని ఉత్సాహంగా ఆడి పాడారు.

**ఇంటి ముంగింట రంగవల్లులతో :** వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో భోగి మంటల చుట్టూ చేరి ఆనందంగా గడిపారు. మహబూబాబాద్‌లో సెవెన్ హిల్స్ కాలనీలో బోగి మంటల కాంతులు విరజిమ్మాయి. విఘ్నాలు తొలగి సకల శుభాలు ప్రసాదించాలని అగ్ని దేవుడిని ప్రార్థించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి ధర్మారం బి గ్రామంలో ఇంటి ముంగింట రంగవల్లులు పెట్టి భోగిమంటలతో వేడుకలు జరుపుకున్నారు.

**భట్టి క్యాంపు కార్యాలయంలో భోగి వేడుకలు :** ఖమ్మం జిల్లా మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టి క్యాంపు కార్యాలయంలో భోగి వేడుకల్లో భట్టి విక్రమార్క సతీమణి నందిని పాల్గొన్నారు. కాంగ్రెస్ మహిళ నేతలు నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆజాద్ రోడ్, సుందరయ్యనగర్, ఉపాధ్యాయ కాలనీ, నారాయణ పాఠశాలల్లో వేడుకలు ఆద్యంతం ఉత్సాహంగా జరిగాయి.

ఉత్తరాయణానికి స్వాగతం పలుకుతూ : కరీంనగర్ లోని పలు కాలనీల వాసులు కొత్త ఆశలతో ఉత్తరాయణానికి స్వాగతం చెపుతూ సంక్రాంతి సంబరాలకు నాంది పలికారు. జ్యోతినగర్‌లో నిర్వహించిన భోగి వేడుకల్లో చిన్నా పెద్దా ఉత్సాహంగా పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి చైతన్యనగర్‌లో భోగి వేడుకల ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు పండుగ శోభను కళ్లకు కట్టాయి.

**లోగిళ్లనీ భోగి సంబరాలతో కళకళ :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో వాకర్ అసోసియేషన్ సభ్యులు భోగి మంటలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా లోగిళ్లనీ భోగి సంబరాలతో కళకళలాడాయి. చిన్నా పెద్దా భోగి మంటల చుట్టూ తిరుగుతూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# అటెన్షన్, డైవర్షన్ డ్రామాలొద్దు

### వాటిని కెటిఆర్ కట్టిపెట్టాలి
### మంత్రి లక్ష్మణ్ కుమార్




**ప్రజాపక్షం/ధర్మపురి :** కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేస్తున్న అటెన్షన్, డైవర్షన్ డ్రామాలను వెంటనే కట్టిపెట్టాలని, అది కేవలం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హితవు పలికారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్నింటా విఫలమై ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ఆపార్టీ నేతలు అబద్ధాల రాజకీయాలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ పాత్రికేయులతో మాట్లాడారు. కృష్ణా జలాల అంశంపై ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్ నేతలు ఈ అంశంపై చర్చకు వస్తే అసెంబ్లీ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. కృష్ణా గోదావరి నదీ జలాల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి బాధ్యతతో చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నదని మంత్రి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్ర సంపదను ఇష్టానుసారంగా దోచుకున్న ఫలితంగా ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని అన్నారు. వారు చేసిన దోపిడీతో ఆర్థిక భారాన్ని మోస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా గాడిలో పెడుతోందని చెప్పారు. దోపిడీతో రాజ్యమేలిన బీఆర్ఎస్‌కు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం జవాబుదారీ పాలన ఎలా ఉండాలో ప్రత్యక్షంగా చూపిస్తున్నదని మంత్రి తెలిపారు. మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని రానున్న మున్సిపల్, ప్రాదేశిక ఎన్నికల్లో ఆపార్టీని పూర్తిగా తిరస్కరించబోతున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ధర్మపురి, వెల్గటూర్ మండలాల అధ్యక్షులు సంగనబట్ల దినేష్, శైలేందర్ రెడ్డి ఉన్నారు.

# వేలాదిమంది మకరజ్యోతి దర్శనం

### అయ్యప్ప స్మరణతో ప్రతిధ్వనించిన శబరిమల



**శబరిమల :** శబరిమలలో వేలాది మంది భక్తులు బుధవారం రాత్రి మకరజ్యోతి (మకరవిళక్కు)ని దర్శించుకున్నారు. 'స్వామియేయ్ శరణమయ్యప్ప'' అనే నినాదాలతో భక్తకోటి పులకించింది. ప్రతి ఏడాది లక్షలమంది భక్తులు శబరిమలకు వెళ్ళి తమ మొక్కులు తీర్చుకుంటారు. శబరిమలలో ఈ పర్వదినాన పొన్నాంబలమేడు పర్వత శిఖరాలపై జ్యోతి దర్శనం కావడంతో భక్తుల అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం పారవశ్యంలో మునిగిపోయింది. తెలుగు రాష్ట్రాలు సహా అనేక ప్రాంతాల నుండి వేలాదిమంది వచ్చి మకరజ్యోతిని సందర్శించారు. రెండు నెలలపాటు లక్షలమంది భక్తులు మొక్కులు తీర్చుకున్న తర్వాత శబరిమల పుణ్యక్షేత్రంలో మకరజ్యోతి దర్శనమే ఈ ఏడాదిలో మొక్కుల పూర్తికి తుదిఘట్టం. ఆ తర్వాత ఆలయాన్ని స్వామి ధ్యానయోగం నిమిత్తం మూసివేస్తారు. తలలపై సంప్రదాయబద్ధమైన ఇరుముడులతో నల్లటి దుస్తులు ధరించిన మాల దీక్షధారులు వేలాదిమంది స్వామిని దర్శించుకున్నారు. స్వామి అయ్యప్పను దర్శించేందుకు వేలాదిమంది భక్తులు అటవీ మార్గంలో,ఆలయంవద్ద ఈ శుభదినాన బారులు తీరారు. ''స్వామియే శరణం అయ్యప్ప' అనే మంత్రం విరామం లేకుండా శబరిమల కొండల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. కేరళ దేవాదాయశాఖామంత్రి వి.ఎన్.వాసవన్, ట్రావంకోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు కె.జయకుమార్ ఇతర అధికారులు అర్చకులతో కలిసి అంతకు ముందు తిరువాభరణాలను తీసుకువచ్చి స్వామికి అలంకరించారు. మొదట ఆ ఆభరణాలను ఆలయ ప్రధాన అర్చకుడు, అర్చక అధిపతి స్వీకరించి అలంకరణ చేశారు. ఆ తర్వాత దీపారాధన చేసి భక్తుల దర్శనార్థం తలుపు లు తెరిచారు.

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పట్ట పగలు దొంగతనాలు చేసే పశ్చిమ బెంగాల్ కు చెందిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను సిసిఎస్, కేయుసి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి 15 తులాల బంగారు నగలు,5.5 తులాల వెండి నగలు మొత్తం విలువ రూ.16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేయబడిన నిందితులలో పశ్చిమ బెంగాల్ కు చెందిన ఫెరోజ్ షేక్ ,సుక్ చంద్, యామీన్ లు ఉండగా ప్రస్తుతం ఫెరోజ్ షేక్ అనే నిందితుడు పరారీలో వున్నాడు. నిందితులు మద్యం, హెరాయిన్, మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి జల్సాల కోసం సులువుగా డబ్బులు సంపాదించడానికి పట్ట పగలు ఇండ్ల తాళాలు పగలగొట్టి బంగారు, వెండి నగలు దొంగలించి వాటిని అమ్ముకొని జల్సాలు తీర్చుకొంటు జీవనం కొనసాగిస్తారని పోలీసులు తెలిపారు. నిందితులు అందరూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం. ముజ్ పార గ్రామం, బేలదంగా తాలూకా, ముర్షీదాబాద్ జిల్లాకు చెందిన వారు కాగా గతంలో వీరు పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఆంధ్రా, ఒడిస్సా, మహారాష్ట్రలలో దొంగతనాలకు పాల్పడగా పశ్చిమబెంగాల్, ఆంధ్రా, మహారాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేసి జైలు కు పంపించడం జరిగిందని తెలిపారు. బయటకు వచ్చిన తర్వాత నిందితులు ఒక ముఠాగా ఏర్పడి తెలంగాణలో దొంగతనాలు చేయాలని పథకం వేసుకొవడం జరిగిందన్నారు. పశ్చిమబెంగాల్ నుండి హన్మకొండకు వచ్చి 2025 డిసెంబర్ 17 న హన్మకొండ లోని కేయూసి పీఎస్ ఏరియాలోని పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ లలో రెండు ఇండ్ల తాళాలు పగలగొట్టి బంగారు, వెండి నగలు , నగదు దొంగిలించుకుపోయినారని, తరువాత మళ్ళీ డిసెంబర్ చివరలో హన్మకొండ కు వచ్చి దొంగతనాలు చేయడానికి ప్రయత్నించినారు కానీ అవకాశం దొరక్క తిరిగి వెళ్ళి పోయినారని తెలిపారు. ఆ తర్వాత హన్మకొండ కు ఈ నెల 10న వచ్చి మధ్యాహ్నం హన్మకొండ గోపాలపురం, శివ సాయి కాలనీ లో ఉదయం ఒక ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని బీరువాలో గల సుమారు 15 తులాల బంగారు నగలు, 5 తులాల వెండి నగలు, కొంత నగదు దొంగిలించారని తెలిపారు. ఇట్టి విషయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఆదేశాల మేరకు డీసీపీ సెంట్రల్ జోన్ దారా కవిత పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ క్రైమ్ బాలస్వామీ, ఏసీపీ క్రైమ్ పి.సదయ్య, ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో నేరస్థుల వివరాలు సేకరించి వారి యొక్క ఆచూకీ కోసం ఆరా తీస్తున్న క్రమంలో నిందితులు మళ్ళీ దొంగతనాలు చెడానికి కేయూసి జంక్షన్ దగ్గర కు వచ్చి ఉన్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు సంయుక్తంగా కేయూసి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా నిందితులు పోలీసు వారిని చూసి పారిపోతున్న క్రమంలో వారిని పట్టుకొని విచారించగా వారు చేసిన దొంగతనాల గురించి ఒప్పుకొన్నారని తెలిపారు. పై దొంగతనాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సీపీఎస్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ, కేయూసి ఇన్స్పెక్టర్ ఎస్. రవి కుమార్, ఐటీ కోర్ టీం ఏఏఓ ఎండి. సల్మాన్ పాషా, సీపీఎస్ ఎస్సైలు రాజ్ కుమార్, సాయి ప్రసన్న కుమార్, శ్రీనివాస రాజు, హెడ్ కానిస్టేబుల్లు కె. మహేశ్వర్, వి.జంపయ్య, కానిస్టేబుల్లు టి.మధుకర్, బి.చంద్రశేఖర్, ఎస్. రాములు, జి. ఉపేందర్, కె.వంశీ, జి. విశ్వేశ్వర్, జి. వినోద్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించినారు.

### ఉత్తరాఖండ్ పుల్నా-భ్యుందార్ అటవీ ప్రాంతంలో...
## ఆరవ రోజూ 'చల్లారని అగ్ని కీలలు'
### ఫలించని అటవీ శాఖ బృందాల ప్రయత్నాలు

**డెహ్రాడూన్ :** ఉత్తరాఖండ్‌లోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్' జాతీయ పార్క్ సమీపంలోని పుల్నాభ్యుందార్ అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు ఇంకా చల్లాడంలేదు. ఆరవ రోజైన బుధవారం కూడా అగ్నికీలలు ఎగిసిపడుతున్నాయి. ప్రమాదకరమైన భూభాగం కారణంగా భూమికి చేరుకోవడం దాదాపు అసాధ్యంగా మారిన కారణంగా అధికారులు వైమానిక జోక్యం లేదా వర్షం లేదా హిమపాతం వంటి సహజకారకాల సహాయంతో మంటలను అదుపుచేయడానికి ఆశలు వదులుకుంటున్నారు. శుక్రవారం జనవరి 9న మొదటిసారిగా కనిపించిన ఈ మంటలు నిరవధికంగా ఎగిసిపడుతూ 3,500 మీటర్ల ఎత్తులో దాదాపు 15 హెక్టార్ల అటవీ భూమిని ప్రభావితం చేస్తున్నాయి. రక్షిత లోయ ప్రాంతంలో ఎదురుగా ఉన్న ఒక కొండపై మంటలు రాజుకుంటున్నాయని ఉపగ్రహ ఛాయా చిత్రాలు నిర్ధారించాయి. కోర్ ఫైర్ జోన్‌లోకి ప్రవేశించడానికి అటవీ శాఖ బృందాలు తీవ్ర ప్రయత్నాలు చేశాయి, కానీ శిథిలాలు పడే ప్రమాదం ఉన్న కారణంగా పదే పదే వెనక్కి తగ్గాల్సి వచ్చింది. 'ఇది చాలా మారుమూల ప్రాంతమే కాదు, చేరుకోవడానికి చాలా సవాల్‌తో కూడిన ప్రాంతం అని అటవీ శాఖ కన్జర్వేటర్ ఆకాష్ వర్మ చెప్పారు. పొడి వాతావరణం కారణంగా మంచు కవచం లేకపోవడం వల్ల మొక్కలు ముఖ్యంగా ఎండిన గడ్డి, ఎక్కువ కాలంనాటి ఓక్ మొద్దులు బాగా మండే స్వభావం కలిగినవి ఉన్నాయి. అయితే మా దృష్టి అంతా మరింతగా మంటలు వ్యాప్తి చెందకుండా నివారించడంపైనే ఉంది. ప్రారంభ ప్రయత్నాలలో భాగంగా ఉప్పొంగుతున్న యమునా గంగోత్రి నదీ ప్రాంతం వైపు తాత్కాలిక క్రాసింగ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. బృందాలు ఎలాగోఅలాగా హమ్వంతి రెండవ బీట్ వైపు చేరుకోగలిగాయి కానీ కఠినమైన పరిస్థితుల కారణంగా వెనక్కి తగ్గాల్సి వచ్చింది. మహిళా మంగల్ దాల్ (పృలా) సభ్యులు సహా స్థానికుల మద్దతు సహాయంతో శాశ్వత బ్రిడ్జిని పునర్నిర్మాణం చేసి సోమవారం నాటికి రాకపోకలు, ప్రయాణ సౌలభ్యాన్ని మెరుగుపరిచింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం సమస్య తీవ్రతను గుర్తించింది. చమోలీ జిల్లా మెజిస్ట్రేట్ గౌరవ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. నీటి బాంబు దాడుల సౌలభ్యాన్ని అంచనా వేయడానికి మంగళవారం నాడు వైమానిక నిఘా నిర్వహించారు.



## ఆగని పందెం.. తగ్గని జోరు

### ఆంధ్రా వైపు పరుగులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** సంక్రాంతి అంటేనే గంగి రెద్దులు, రంగవల్లికలు అనుకునే స్థాయి నుంచి ఇప్పుడు కోడి పందాలు మాత్రమే అనే స్థాయికి చేరింది. ఆంధ్రా వైపు పరుగులు పెడుతున్నారు. తెలంగాణలో కోడి పందాలపై ఆంక్షలు ఉండటం ఆంధ్రాలో ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందాలు నిర్వహిస్తుండడంతో తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాల నుంచి కోడిపందాలు చూసేందుకు, పందాల్లో పాల్గొనేందుకు ఆంధ్రా వైపు పరిగెడుతున్నారు. హైదరాబాద్ మహానగరం నుంచి ఆంధ్రావాసులు బయలుదేరడంతో పాటు కోడి పందాలు చూసేందుకు వెళ్లే వారితో రోడ్లు కిటకిట లాడుతున్నాయి. ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతాలకు బాగా ఎగబాడుతున్నారు. మామిడి, పామాయిల్ తోటల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి పందెపు బిరులు తయారు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఎసి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారంటే అతిశయోక్తి కాదు. కృష్ణా, తూర్పు, ప.గోదావరి ఉమ్మడి జిల్లాల పరిధిలో కోడి పందాలను ఎక్కువగా నిర్వహిస్తారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు పందాలను నిర్వహించడంతో పాటు చూపరులకు భోజన సౌకర్యాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. పందాలు సైతం వందలు, వేలు దాటిపోయాయి. లక్షల్లో పందాలు కాస్తున్నారు. ఇక పందాలు నిర్వహించే ప్రాంతాల్లో జూదం తారాస్థాయికి చేరింది. మూడుముక్కలాట, లోపల బయట, పేకాటతో పాటు ఇతరత్రా జూదాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. కొన్ని పందెపు ప్రాంతాల్లో పోలీస్ అధికారులే భద్రత చర్యలు తీసుకోవడం విశేషం. హైదరాబాద్‌తో పాటు కొన్ని ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉన్నత విద్యావంతులు ఈ పందాలలో పాల్గొనేందుకు రావడంతో పాటు పందాలను చూసేందుకు మూడురోజుల పాటు ఉండేవిధంగా ఏర్పాటు చేసుకుంటున్నారు.

## టూథియానా కోర్టు కాంప్లెక్స్, మోగా పాఠశాలల్లో పోలీసుల సోదాలు

**లూథియానా :** స్థానికంగా ఉన్న కోర్టు కాంప్లెక్స్, మోగాలోని ఒక పాఠశాలలో బుధవారం బాంబు బెదిరింపు ఇమెయిల్స్ అందిన నేపథ్యంలో పోలీసులు అక్కడ సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఆయా ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. లూథియానాలోని కోర్టు కాంప్లెక్స్ మొత్తాన్ని సీల్‌చేసి, అక్కడకు ప్రవేశాలను నియంత్రించారు. పోలీస్ బృందాలతో పాటు డాగ్ స్క్వాడ్స్, బాంబు నిర్వీర్య దళాలను అక్కడ మోహరింపజేసి సోదాలు చేపట్టారు. ముప్పు విశ్వసనీయతను నిర్ధారించడానికి, భద్రతను నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. లూథియానా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విపన్ సగ్గార్ మాట్లాడుతూ 'ముందు జాగ్రత్త చర్యగా, ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశాన్ని నివారించడానికి ఈ రోజు 'నో వర్క్' అని మేం ప్రకటించి ఉన్నాం' అని చెప్పారు.

మోగాలో బాంబు బెదిరింపు ఇమెయిల్ అందుకున్న తర్వాత పోలీసులు ఆ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మోగా డిఎస్‌పి గురు ప్రీత్ సింగ్ మాట్లాడుతూ 'ఇమెయిల్ బెదిరింపు గురించి పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో వెంటనే పాఠశాలను ఖాళీ చేయించి విద్యార్థులను వారి ఇళ్లకు పంపించాం. పాఠశాల ప్రాంగణాలను తనిఖీ చేస్తున్నాం' అని ఆయన చెప్పారు. వారం క్రితం ఫిరోజ్‌పూర్, రోపార్‌లోని కోర్టు సముదాయాలకు బాంబు బెదిరింపు, ఇమెయిల్స్ అందడంతో అక్కడ ఉన్న వారిని ఖాళీ చేయించారు. అది తర్వాత బూటకం అని తేలింది. పాటియాలా, జలంధర్ లోని కొన్ని పాఠశాలలకు ఇమెయిల్స్ వచ్చాయి. ఆ తర్వాత ఆ బెదిరింపులు కూడా బూటకమని తేలింది.

# మధిర సమగ్రాభివృద్ధే లక్ష్యం

### రూ.15కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన : డిప్యూటీ సిఎం భట్టి
### వరద ముంపు శాశ్వత పరిష్కారం కోసం రూ.140కోట్ల నిధులు మంజూరు



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణ సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, మధిర శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. బుధవారం మధిర మున్సిపాల్టీ పరిధిలోని 8వ వార్డు సాయినగర్‌లో రూ.15 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధిర మున్సిపాల్టీ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మధిర మున్సిపాల్టీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాల్టీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. మధిర మున్సిపాల్టీలో వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రతిపాదించినన పనులకు మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ నుంచి రూ.140 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే మురుగు నీటి తరలింపుకు ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు ఓవైపు జరుగుతుండగా తాజాగా మంజూరైన భారీ మొత్తం నిధులతో వరద ముంపు లేకుండా శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమం కానుందని తెలిపారు. అదేవిధంగా మధిర మున్సిపాల్టీ వైరా నది వరద ముంపు నుంచి శాశ్వత విముక్తి కల్పించేందుకు భారీ రిటైనింగ్ వాల్ ప్రస్తుతం మధిర మున్సిపాల్టీలో ఉన్న వరద నీటి కాలువలకు రీ డిజైనింగ్ పనులు ఈ నిధులు ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంలో వరద నీటిని మళ్లించేందుకు ఆర్సిఎం చర్చి రోడ్డు నుంచి సాయిబాబా టెంపుల్ వరకు రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా వరద కాలువ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పుల్లఖండం వారి వీధి నుండి శివాలయం వరకు, రామాలయం నుంచి యాదవ బజార్ వరకు, రైస్ మిల్లు నుంచి డంపింగ్ యార్డు వరకు, వ్యవసాయ మార్కెట్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు ఇల్లెందులపాడు ప్రాంతంలో అదేవిధంగా మడుపల్లి ప్రాంతంలో, అంబారుపేట, శివాలయం, రాయపట్నం బ్రిడ్జి వరకు మొత్తం వరద కాలువ నిర్మాణం కోసం రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నారు. మధిర మున్సిపాల్టీ వెంట ప్రవహిస్తున్న వైరా నది పొడవునా మొత్తం భారీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.65కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం మధిర మున్సిపాల్టీ పరిధిలో ఉన్న వరద కాలువల అన్నింటిని రీడిజైనింగ్ చేయడానికి రూ.35 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామానాథం, సిపిఐ జిల్లా నాయకులు బెజవాడ రవిబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన 'టోకు ధరల ద్రవ్యోల్బణం'

డిసెంబరులో 0.83 శాతం నమోదు




**న్యూఢిల్లీ :** టోకు ధరల ద్రవ్యోల్బణం వరుసగా రెండవ నెల కూడా ఊపందుకుంది. 2025 డిసెంబరులో అది 0.83 శాతంగా నమోదై స్వల్ప పెరుగుదలను చూపించింది. ఆహారం, ఆహారేతర వస్తువులు, తయారీ వస్తువుల ధరలు నెలవారీ ప్రాతిపదికన పెరగడం దీనికి కారణమని బుధవారం ప్రభుత్వ డేటా వెల్లడించింది. గత రెండు నెలల్లో ప్రతి ద్రవ్యోల్బణ ధోరణిని చూసిన తర్వాత టోకు ధరల సూచిక (డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం డిసెంబరులో సానుకూలంగా తిరిగివచ్చింది. నవంబరు, అక్టోబరులలో ధరల పెరుగుదల రేటు వరుసగా ప్రతికూలంగా () 0.32 శాతం, () 1.21 శాతంగా ఉంది. దీనికి విరుద్ధంగా, 2024 లో డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం 2.57శాతంగా ఉంది. 2025 డిసెంబరులో ద్రవ్యోల్బణం సానుకూలంగా ఉండటానికి ప్రధానంగా ఇతర తయారీ ఖనిజాలు, యంత్రాలు, పరికరాల తయారీ, ఆహార ఉత్పత్తుల తయారీ, వస్త్రాలు మొదలైన వాటి పెరుగుదల ప్రధాన కారణమని పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. డబ్ల్యుపిఐ డేటా ప్రకారం...ఆహార వస్తువులలో ప్రతి ద్రవ్యోల్బణం డిసెంబరులో 0.43శాతంగా ఉంది. నవంబరులో ఇది 4.13శాతంగా ఉంది. కూరగాయలలో ప్రతి ద్రవ్యోల్బణం డిసెంబరులో 3.50శాతంగా ఉంది. అయతే ఇది నవంబరులో 20.23శాతంగా ఉంది. తయారీ ఉత్పత్తుల విషయంలో డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం నవంబరులో 1.33శాతం ఉండగా అది 1.82శాతానికి పెరిగింది. ఆహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం డిసెంబరులో 2.95శాతంగా నమోదు కాగా, నవంబరులో 2.27శాతం ఉంది. ఇంధనం, విద్యుత్‌రంగాలలో ప్రతికూల ద్రవ్యోణం లేదా ప్రతి ద్రవ్యోల్బ ణం డిసెంబరులో 2.31శాతంగా కొనసాగింది. ఇది ఒక నెల క్రితం 2.27శాతంగా ఉం ది. ఈ వారం ప్రార ంభంలో విడుదలైన డేటా ప్రకారం.. ఆహార ధరలు పెరగడం వల్ల దేశ రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరులో 1.33శాతానికి పెరిగింది. నవంబరులో ఇది 0.71 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పాలసీ వడ్డీరేట్లను 1.25శాతానికి తగ్గించింది. ఆర్థిక వ్యవస్థ శరవేగంగా ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటున్నందున రిజర్వ్ బ్యాంక్ గతనెలలో ప్రస్తుత ద్రవ్యోల్బణ అంచనాను గతంలో అంచనా వేసిన 2శాతానికి గణనీయంగా తగ్గించింది. బెంచ్ మార్క్ వడ్డీ రేట్లను నిర్ణయించడానికి ఆర్‌బిఐ ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణాన్ని ట్రాక్ చేస్తుంది.

# ప్రపంచ పండుగ 'పొంగల్'

ఢిల్లీలో కేంద్రమంత్రి మురుగన్ నివాసంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోని పురాతన నాగరికతలలో ఒక దానికి ప్రతీకగా నిలిచే పొంగల్ పండుగను ప్రపంచ పండుగగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బుధవారం ఢల్లీలో జరిగిన పొంగల్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ నివాసంలో జరిగిన ఈ వేడుకలకు, ఇటీవల విడుదలైన 'పరాశక్తి' చిత్ర బృందంతో సహా పలువురు తమిళ ప్రముఖులు హాజరయ్యారు. రాబోయే కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దక్షిణ రాష్ట్రానికి చేరువయ్యే ప్రయత్నంగా మోదీ ఈ వేడుకలకు హాజరుకావడం కనిపించింది. అక్కడ జరిగిన సభను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ ఈ పండుగ రైతుల కష్టాన్ని కొనియాడుతుందని, భూమికి, సూర్యుడికి కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. ప్రకృతితో సామరస్యపూర్వక సమతుల్యతను కాపాడుకోవాలనే సందేశాన్ని ఇచ్చే పొంగల్, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులతో ఆదరించబడే ఒక ప్రపంచ పండుగగా ఆవిర్భవించిందని ఆయన అన్నారు. కృతజ్ఞత కేవలం మాటలకే పరిమితం కాకుండా, మన దైనందిన జీవితంలో అంతర్భాగం కావాలని పొంగల్ పండుగ మనకు గుర్తు చేస్తుంన్నారు. భూమి మనకు ఇంతటిని ప్రసాదిస్తున్నప్పుడు, దానిని ప్రేమగా చూసుకోవడం, రక్షించుకోవడం మన బాధ్యత అని కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు హాజరైన ఈ వేడుకల్లో మోదీ ఉద్ఘాటించారు. ఉపరాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు కింజరాపు హాజరైన వారిలో ఉన్నారు. తమిళ చిత్రం 'పరాశక్తి' నటీనటులు శివకార్తికేయన్, రవి మోహన్, సంగీత దర్శకుడు జి వి ప్రకాష్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీతో కలిసి పండుగను జరుపుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా తమిళ, తమిళ సంస్కృతిని ఆదరించే వారందరూ పొంగల్ పండుగను గొప్ప ఉత్సాహంతో జరుపుకుంటారని, వారి మధ్య ఉండటం తనకు గర్వకారణమని మోదీ అన్నారు.తమిళ సంస్కృతి ప్రపంచంలోని పురాతన జీవన నాగరికతలలో ఒకటి అని, ఇది శతాబ్దాల జ్ఞానం, సంప్రదాయాలను కలిగి ఉందని, చరిత్ర నుండి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. ప్రకృతి, కుటుంబం, సమాజం మధ్య సామరస్య పూర్వక సమతుల్యతను కాపాడుకోవాల్సిన ప్రాముఖ్యతను పొంగల్ నొక్కి చెబుతుందని కూడా మోదీ అన్నారు. ఈ ఏడాది తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళ సమాజానికి ప్రధానమంత్రి చేసిన ఈ ప్రసంగం ప్రాధాన్యత సంతరించుకుంది. అనంతరం, నటుడు శివకార్తికేయన్ మాట్లాడుతూ, ప్రధానమంత్రిని కలవడం ఎల్లప్పుడూ ఒక గౌరవం, ఆనందమని అన్నారు. 'ఢిల్లీలో జరిగిన పొంగల్ వేడుక దేశ ఐక్యతకు ఒక సందేశం' అని ఆయన విలేకరులతో అన్నారు. సహనటుడు రవి మోహన్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి మోదీ వ్యక్తిత్వం తనను ఎంతగానో ఆకట్టుకుందని అన్నారు. 'ప్రధానమంత్రి చిరునవ్వుతో మమ్మల్ని పలకరించారు. ఇక్కడ ఉండటం చాలా గొప్పగా అనిపిస్తోంది' అని ఆయన అన్నారు.

'జన నాయగన్'కు రాహుల్ మద్దతు

# 'స్నేహపూర్వక చర్య' : టివికె



**చెన్నై:** తమిళ నడుటు విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్రానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మద్దతును ఒక 'స్నేహపూర్వక చర్య'గా భావిస్తున్నట్లు విజయ్ నేతృత్వంలోని టివికె పార్టీ తెలిపింది. అయితే, తమిళనాడు కాంగ్రెస్ మాత్రం తమ నాయకుడి ప్రకటన సెన్సార్ బోర్డు ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులనుద్దేశించిందని, దాని వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 2025 సెప్టెంబర్ 27న కరూర్ తొక్కిసలాట జరిగినప్పటి నుండి ఆయన మద్దతుగా ఉన్నారని, విజయ్ చివరి చిత్రానికి అనుకూలంగా, కేంద్రానికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేసిన ప్రకటన ఒక స్నేహపూర్వక చర్య అని తమిళగ వెట్రి కజగం సీనియర్ నాయకుడు తెలిపారు. అయితే, ఎన్నికల పొత్తులపై ఎలాంటి ఊహాగానాల్లోకి వెళ్లడానికి ఆయన నిరాకరించారు. ఈ నిర్ణయాన్ని పార్టీ అధినేత మాత్రమే తీసుకుంటారని చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రకటన కేవలం సెన్సార్ బోర్డు ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులనుద్దేశించిందని, ఈ ప్రకటన వెనుక ఎలాంటి రాజకీయ లేదా ఎన్నికల ప్రేరణ లేదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ పేర్కొంది. 'జన నాయగన్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న సమాచార, ప్రసార మంత్రిత్వశాఖపై మా నాయకుడు రాహుల్ చేసిన ప్రకటన, ప్రజాస్వామ్య వ్యతిరేకమే కాకుండా ఫాసిస్ట్ అయిన మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం నిజ స్వరూపాన్ని బయటపెట్టడానికే. ఈ ప్రకటనకు తమిళనాడు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు' అని ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ డిఎంకెతో మాత్రమే పొత్తు పెట్టుకుంటుందని, ఇది 200 శాతం స్పష్టమని ఆయన అన్నారు. అందులో ఎలాంటి మార్పు ఉండదు అని ఆయన స్పష్టం చేశారు. మొదటి నుండి రాహుల్ గాంధీ మా పార్టీ వ్యవస్థాపక నాయకుడు విజయ్‌తో స్నేహపూర్వకంగా ఉన్నారు అని టివికెకు చెందిన మరో చెప్పారు.

# నేడు 'మహా'లో మున్సిపల్ ఎన్నికలు

893 వార్డులలోని 2,869 స్థానాలకు పోలింగ్

అధికార మహాయుతి కూటమి, ప్రతిపక్ష ఎంవిఎ కూటమి హోరాహోరీగా పోరు



**ముంబయి:** మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. 29 మున్సిపల్ కార్పొరేషన్లకు నేడు ఎన్నికలు జరగనున్నాయి. ధనికంగా ఉన్న బృహన్‌ముంబయిపై పట్టు సాధించడం కోసం బిజెపి నేతృత్వంలోని మహాకూటమి, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని ఐక్య కూటమితో హోరాహోరీగా తలపడుతోంది. శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రేతో పొత్తు పెట్టుకోవడం వల్ల ఎంఎన్‌ఎస్ నాయకుడు రాజ్ థాక్రే భారీగా నష్టపోతారని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ జోస్యం చెప్పారు. పుణె, పింప్రి–చించ్వాడ్‌లో రెండు ఎన్‌సిపి వర్గాలు కలవడం కేవలం స్థానిక పరిణామం మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు.పొత్తు భాగస్వాములు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకూడదనే నియమాన్ని ఉప ముఖ్యమంత్రిష ఎన్‌సిపి నాయకుడు అజిత్ పవార్ ఉల్లంఘించారని ఫడ్నవీస్ విచారం వ్యక్తం చేశారు. 893 వార్డులలో విస్తరించి ఉన్న 2,869 స్థానాలకు 15న ఉదయం 7.30 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుంది. మొత్తం 3.48 కోట్ల మంది ఓటర్లు 15,931 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. వీరిలో ముంబయిలో 1,700 మంది, పుణెలో 1,166 మంది ఉన్నారు. 6న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. బిఎంసి ఎన్నికలు, ఓట్ల లెక్కింపును పర్యవేక్షించడానికి సీనియర్ అధికారులతో సహా 25,000 మందికి పైగా పోలీసు సిబ్బంది ముంబయి వ్యాప్తంగా మోహరించనున్నారు. ముంబయి మినహా మిగిలిన 28 పట్టణ సంస్థలలో బహుళ సభ్యుల వార్డులు ఉన్నాయి. ఎన్నికలకు ముందు రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రత్యర్థి ఎన్‌సిపి వర్గాలు పుణె, పింప్రి–చించ్వాడ్‌లో స్థానిక పొత్తును కుదుర్చుకుంటున్నప్పటికీ, విడిపోయిన బంధువులైన ఉద్ధవ్, రాజ్ థాక్రే మరాఠీ ఓట్లను ఏకీకృతం చేసే ప్రయత్నంలో రెండు దశాబ్దాల తర్వాత తిరిగి కలిశారు. ఈ ఎన్నికల్లో, ప్రతిపక్ష కాంగ్రెస్ తన మహా వికాస్ అఘాడీ మిత్రపక్షాలైన శివసేన (యుబిటి), శరద్ పవార్ ఎన్‌సిపి (ఎస్‌పి) నీడ నుండి బయటకు వచ్చి ముంబయిలో తన ఉనికిని చాటుకుంది. రాష్ట్ర రాజధానిలో కాంగ్రెస్ ప్రకాష్ అంబేద్కర్ వంచిత్ బహుజన్ అఘాడి (విబిఎ), రాష్ట్రీయ సమాజ్ పక్షతో చేతులు కలిపింది. అదే సమయంలో నాగపూర్‌లో స్వతంత్రంగా పోటీ చేస్తోంది. 2020–2023 మధ్య వాటి పదవీకాలం ముగిసిన తర్వాత, ఆరేళ్లకు పైగా విరామం తర్వాత 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో తొమ్మిది భారతదేశంలో అత్యంత పట్టణీకరణ చెందిన ప్రాంతమైన ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) పరిధిలోకి వస్తాయి. పోటీ జరుగుతున్న ప్రాంతాలలో ఛత్రపతి శంభాజీనగర్, నవీ ముంబై, వసాయివిరార్, కళ్యాణ్‌డోంబివ్లి, కొల్హాపూర్, నాగపూర్, ముంబయి, సోలాపూర్, అమరావతి, అకోలా, నాసిక్, పింప్రిచించ్వాడ పూణే, ఉల్హాస్‌నగర్, థానే, చంద్రపూర్, పర్భణి, మీరా భయందర్, నాందేడ్‌వాఘాలా, పన్వెల్, భివండి నిజాంపూర్, లాతూర్, మాలేగావ్, సాంగ్లీమిరా జ్‌కుప్వాడ జల్గావ్, అహిల్యానగర్, ధూలే, జల్నా, ఇచల్‌కరంజి ఉన్నాయి. కాగా, 227 వార్డులున్న ముంబయిలో, బిజెపి 137 స్థానాల్లో, శివసేన 90 స్థానాల్లో పోటీ చేస్తుండగా, ఎన్‌సిపి 94 స్థానాల్లో విడిగా పోటీ చేస్తోంది. శివసేన (యుబిటి) 163 మంది అభ్యర్థులను, ఎంఎన్‌ఎస్ 52 మందిని, కాంగ్రెస్ 143 మందిని, విబిఎ 46 మందిని బరిలోకి దింపాయి. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో కాంగ్రెస్ 1,263 మంది అభ్యర్థులను నిలబెట్టింది.

# అన్నీ ఊహాగానాలే...

రాహుల్‌గాంధీ నుంచి ఎలాంటి సందేశం లేదు : డికె



**బెంగళూరు:** కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికార మార్పుపై మీడియాలో వస్తున్నట్లుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుండి ఎలాంటి సందేశం రాలేదని ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి పనులను కొనసాగించాలని ఆయన కోరారని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా ఉన్న శివకుమార్, మంగళవారం సాయంత్రం రాహుల్ గాంధీతో జరిగిన తన సంక్షిప్త సంభాషణతో ముడిపెడుతూ, 'ప్రయత్నాలు విఫలం కావచ్చు, కానీ ప్రార్థనలు విఫలం కావు' అనే తన సోషల్ మీడియా పోస్ట్‌కు సంబంధించిన ఊహాగానాలను తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి పదవి కోసం ఇద్దరి మధ్య కొనసాగుతున్న అధికార పోరు నేపథ్యంలో, మంగళవారం సాయంత్రం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం డి కె శివకుమార్‌తో రాహుల్ గాంధీ జరిపిన సంక్షిప్త సంభాషణ ఊహాగానాలకు దారితీసింది. 'నేను రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిని, ఆయన (రాహుల్ గాంధీ) ప్రతిపక్ష నాయకుడు (లోక్‌సభలో), ఆయన గతంలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఆయనతో మా సమావేశం, ఆయనతో చర్చలు, ఆయనకు గౌరవం ఇవ్వడం, ప్రోటోకాల్ ప్రకారం ఆయనకు స్వాగతం పలకటం వంటి విషయాలను బహిరంగంగా చర్చించవచ్చా? మీరు (మీడియా) అనవసరంగా ఎవరో చెప్పిన ఆఫ్‌ది రికార్డ్ విషయాలను ఉటంకిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు. మీ టీవీ ఛానెళ్లకు ఉన్న గౌరవాన్ని నాశనం చేస్తున్నారు' అని ఒక ప్రశ్నకు సమాధానంగా శివకుమార్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తాము రాహుల్‌గాంధీని కలిశామని, ఎలాంటి సందేశం లేదని, మంచి పద్ధతిలో పని కొనసాగించమని తమను కోరారని చెప్పారు. రాష్ట్రంలో ఎంజి నరేగాకు సంబంధించి ప్రణాళిక చేసిన కార్యక్రమాల గురించి ఆయనకు తెలియజేశామని, రాష్ట్రంలో బిజెపి రాజకీయాల గురించి కూడా చర్చించామని చెప్పారు. రాహుల్ గాంధీతో మీడియాకు రికార్డులో పంచుకోలేని విషయాలు ఏమైనా చర్చించారా అని అడిగినప్పుడు, 'నాతో అలాంటిదేమీ లేదు, నాతో ఎప్పుడూ ఆన్‌రికార్డే ఉంటుంది' అని అన్నారు.

# ఎల్‌డిఎఫ్‌తోనే ఉంటాం

కేరళ కాంగ్రెస్ (ఎం) చైర్మన్ జోస్ కె మణి స్పష్టీకరణ

**కొట్టయాం :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పొత్తులో మార్పు ఉండవచ్చనే ఊహాగానాలన్నింటినీ కేరళ కాంగ్రెస్ (ఎం) చైర్మన్ జోస్ కె మణి త్రోసిపుచ్చారు. అవి పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేశారు. కేరళ కాంగ్రెస్ (ఎం) అధికార సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌కు అండగా నిలబడుతుందని, రాష్ట్రంలోని మధ్య జిల్లాల్లో గణనీయమైన ప్రభావం కలిగిన కీలక భాగస్వామిగా కొనసాగుతుందని మణి పేర్కొన్నారు. బుధవారం కొట్టయాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పొత్తు మార్పు గురించి ఊహాగానాలు చేసిన మీడియాలోని ఒక వర్గం నివేదికలు నిరాధారమైనవన్నారు. అవి తప్పుడు వార్తలని విమర్శించారు. తాము లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)తోనే దృఢంగా ఉంటామని పార్టీ పదేపదే స్పష్టం చేసిందని, ప్రతిరోజూ ఈ విషయాన్ని పునరావృతం చేయవలసిన అవసరం లేదని మండిపడ్డారు. 'కేరళ కాంగ్రెస్‌కు ఒకే వైఖరి ఉంది, అదేంటంటే మేము వామపక్షాలతో ఉన్నాము. నేను ప్రతిరోజూ వచ్చి ఈ విషయం చెప్పలేను. మేము ఎల్‌డిఎఫ్‌లోనే దృఢంగా ఉంటాము. ఈ చర్చలు ఎవరు జరుపుతున్నారు? మా కోసం ఎవరూ ఏడవాల్సిన అవసరం లేదు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి తమ మాజీ రాజకీయ మిత్రపక్షమైన కేరళ కాంగ్రెస్ (ఎం)ను సంప్రదించిందనే మీడియా నివేదికల మధ్య మణి ఈ వ్యాఖ్యలు చేశారు. వివిధ వర్గాల నుండి ఆహ్వానాలు వస్తున్నప్పటికీ, పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, పొత్తులు మార్చే ప్రసక్తే లేదని మణి స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ఏ వైఖరి అవలంబిస్తుందనే దానిపై మీడియా చాలా నెలలుగా ఊహాగానాలు చేస్తోందని, 'ఇది కేరళ కాంగ్రెస్ (ఎం) బలానికి నిదర్శనం' అని ఆయన అన్నారు. కేరళ కాంగ్రెస్ (ఎం)ను గతంలో యుడిఎఫ్ నుండి బహిష్కరించారని, ఆ తర్వాత వామపక్ష కూటమితో పొత్తు పెట్టుకోవాలని దృఢమైన నిర్ణయం తీసుకుందని మణి చెప్పారు. యుడిఎఫ్‌పై పరోక్ష విమర్శలు చేస్తూ, లోక్‌సభ ఎన్నికలు ముగిసినప్పుడు యుడిఎఫ్‌కు 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆధిక్యం ఉందని ఆ సీనియర్ నాయకుడు అన్నారు. కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేసరికి అది 80కి తగ్గిందని, ఇది వారికి ఆందోళన కలిగించే విషయం కావచ్చని ఆయన అన్నారు. తాను సోనియా గాంధీతో చర్చలు జరిపినట్లు వచ్చిన మీడియా నివేదికలకు సంబంధించిన ప్రశ్నలను ఆయన తోసిపుచ్చారు. రాజకీయ పొత్తు లేదా కూటమి మార్పు విషయంలో కేరళ కాంగ్రెస్ (ఎం)లో ఎలాంటి విభేదాలు లేవని కూడా మణి స్పష్టం చేశారు. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, ఐదుగురు ఎమ్మెల్యేలు కలిసికట్టుగా ఉంటారన్నారు. పార్టీ చర్చల సమయంలో అనేక అభిప్రాయాలు వస్తాయని, ఆ తర్వాత వాటిపై చర్చించి ఒకే నిర్ణయం తీసుకుంటామన్నారు.

# 11,000 మంది అక్రమ ఓటర్లు

గణాంకాలు వెల్లడించిన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం

'సర్' ప్రక్రియలో 9,30,993 మంది ఓటర్ల సంబంధింత విచారణల పూర్తి




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగా ఇప్పటి వరకు 11,000 మందికి పైగా అక్రమ ఓటర్లను గుర్తించిట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. వీరిలో అత్యధిక సంఖ్యలో నాదియా జిల్లాకు చెందినవారే ఉన్నారని తెలిపింది. అయితే బాంకురా, కోల్‌కతా నగరంలోని దక్షిణ భాగంలో ఇప్పటివరకు అక్రమ ఓటర్లు ఉన్నట్లు గుర్తించలేదు. కాగా, రాష్ట్ర ప్రభుత్వ వెల్లడించిన గణాంకాలపై ఎన్నికల సంఘం స్పందించలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సంఘం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) విచారణలను నిర్వహిస్తోంది. అందులో కొన్ని తార్కిక వ్యత్యాసాలను గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం, కొనసాగుతున్న ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా 9,30,993 మంది ఓటర్లకు సంబంధించిన విచారణలు పూర్తయ్యాయి. వారి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ విచారణలు, పత్రాల ధృవీకరణ తర్వాత, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్‌ఒలు) ఇప్పటి వరకు 11,472 మంది ఓటర్లను అక్రమ ఓటర్లుగా గుర్తించారు. వారి పేర్లను తుది ఓటర్ల జాబితా నుండి తొలగిస్తామని అధికారులు తెలిపారు. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ ఎస్‌ఐఆర్ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 65,78,058 నోటీసులు జారీ అయ్యాయి. వీటిలో 32,49,091 నోటీసులు ఇప్పటికే జారీ చేయబడ్డాయని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ద్వారా వెల్లడైంది. నోటీసులు అందుకున్న 9,30,993 మంది ఓటర్లకు విచారణలు పూర్తయ్యాయని, దీని ఫలితంగా అక్రమ ఓటర్లను గుర్తించామని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంచుకున్న జిల్లా వారీ గణాంకాల ప్రకారం, విచారణల తర్వాత నాదియా జిల్లాలో అత్యధికంగా 9,228 మంది అక్రమ ఓటర్లు నమోదయ్యారు. పెద్ద సంఖ్యలో నోటీసులు జారీ అయినప్పటికీ దక్షిణ కోల్‌కతాలో ( 1,36,561 నోటీసులు జారీ), బాంకురాలో (1,63,357 నోటీసులు జారీ) ఇప్పటివరకు ఎలాంటి అక్రమ ఓటర్లు గుర్తించలేదు. డేటా ప్రకారం, కూచ్ బెహార్‌లో ఇప్పటివరకు 10 మంది అక్రమ ఓటర్లు, జల్పైగురిలో నలుగురు, డార్జిలింగ్‌లో ఇద్దరు, ఉత్తర దినాజ్‌పూర్‌లో ఇద్దరు, దక్షిణ దినాజ్‌పూర్‌లో 195 మంది ఉన్నట్లు తేలింది. మాల్దాలో 15 మంది ఓటర్లను అక్రమ ఓటర్లుగా గుర్తించగా, ముర్షిదాబాద్‌లో 68, ఉత్తర 24 పరగణాలలో 147, దక్షిణ 24 పరగణాలలో 69 మంది ఉన్నట్లు నమోదైంది. ఉత్తర కోల్‌కతాలో 54 మంది అక్రమ ఓటర్లు కనుగొనబడగా, హౌరాలో 26, హుగ్లీలో 989, పూర్బ మేదినీపూర్‌లో ఇద్దరు ఉన్నట్లు తేలింది. పశ్చిమ మేదినీపూర్ జిల్లాలో 105 మంది, పురూలియాలో 44, పూర్బ బర్ధమాన్‌లో 167, బీర్‌భూమ్‌లో 264 మంది ఇలాంటి ఓటర్లు నమోదయ్యారు. కొండ, అటవీ జిల్లాల విషయానికొస్తే, అలీపుర్‌ద్వార్‌లో తొమ్మిది మంది అక్రమ ఓటర్లు, కాలింపాంగ్‌లో 65, ఝార్గ్రామ్‌లో ముగ్గురు, పశ్చిమ బర్ధమాన్‌లో నలుగురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఎస్‌ఐఆర్ ప్రక్రియ రాష్ట్రంలో ఒక ప్రధాన రాజకీయ వివాదాంశంగా మారింది. ఈ ప్రక్రియ నకిలీ ఓటర్లను గుర్తించడానికి సహాయపడుతుందని ప్రతిపక్షాలు వాదిస్తుండగా, అధికార తృణమూల్ కాంగ్రెస్ దీనిని నిర్వహిస్తున్న తీరును ప్రశ్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ చర్చను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఎందుకంటే తుది ఓటర్ల జాబితా ప్రచురించినప్పుడు అక్రమ ఓటర్ల సంఖ్య మారుతుందా లేదా అనే దానిపై ఇప్పుడు అందరి దృష్టి ఉంది.

# తల్లిదండ్రులు, తమ్ముడ్ని కలిసిన తేజ్ ప్రతాప్ యాదవ్

**పాట్నా:** కుటుంబంతో పాటు ఆర్‌జెడికి దూరమైన తేజ్ ప్రతాప్ యాదవ్ చాలా కాలం తర్వాత కుటుంబ సభ్యులను కలిశారు. బిహార్ మాజీ సిఎం రబ్రీదేవి నివాసానికి వెళ్లారు. తల్లిదండ్రులైన లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిని కలిసి వారి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం పొందారు. తమ్ముడు తేజస్వీ యాదవ్‌ను కూడా తేజ్ ప్రతాప్ కలిశారు. బుధవారం సంక్రాంతి సందర్భంగా నిర్వహించే దహిచురా విందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారితో ఫొటోలు దిగారు. కాగా, సోదరుడు తేజస్వి యాదవ్ కుమార్తె కాత్యాయణిని తేజ్ ప్రతాప్ యాదవ్ ఎత్తుకోవంతో పాటు కుమార్తె వరుసైన ఆ చిన్నారితో నవ్వుతూ ఫొటోలు దిగారు. రాజకీయంగా, కుటుంబ పరంగా విభేదాలున్నప్పటికీ తమ బంధాలు చెక్కుచెదరలేదన్న సంకేతాన్ని ఇచ్చారు. మరోవైపు గత ఏడాది చిరకాల స్నేహితురాలితో కలిసి ఉన్న ఫొటోను తేజ్ ప్రతాప్ షేర్ చేయడంతో పాటు ఆమెతో తన సంబంధాన్ని బహిర్గతం చేశారు. దీనిపై ఆగ్రహించిన ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడైన తేజ్ ప్రతాప్‌ను కుటుంబంతో పాటు పార్టీ నుంచి వెలివేశారు. అయితే కొత్త పార్టీ ఏర్పాటు చేసిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆర్‌జెడి కూడా ఘోర పరాజయం పొందింది. ఈ పరిణామాల నేపథ్యంలో తల్లిదండ్రులు, సోదరుడ్ని తేజ్ ప్రతావ్ యాదవ్ కలవడం ప్రాధాన్యత సంతరించుకున్నది.

'ఆపరేషన్ పవన్' సమయంలో...

# భారత సైనికుల త్యాగాలను తప్పక గౌరవించాలి


రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ:** దాదాపు దశాబ్దాల క్రితం శ్రీలంకలో 'ఆపరేషన్ పవన్' సమయంలో భారత సైనికులు చేసిన త్యాగాలు తప్పక గౌరవించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 1990లలో ప్రభుత్వాలు వారి సహకారాన్ని బహిరంగంగా గుర్తించలేదని రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. ఆపరేషన్‌లో భారత బలగాల సహకారాన్ని మోదీ ప్రభుత్వం 'విశాల హృదయం' తో గుర్తించడమే కాకుండా, ప్రతి స్థాయిలో వారి సహకారాన్ని గుర్తించే ప్రక్రియలో కూడా ఉందని రక్షణ శాఖ మంత్రి వెల్లడించారు. బుధవారం ఇక్కడ సాయుధ దళాల మాజీ సైనికుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'ఈ రోజు మొత్తం దేశం తన సైనికులను గుర్తుచేసుకుంటూ వారి సహకారాన్ని స్మరించుకుంటూ కృతజ్ఞత తెలియజేస్తున్న తరుణంలో దాదాపు 40 సంవత్సరాల క్రితం శ్రీలంకలో శాంతిపరిర క్షక చర్యలో ఐపికెఎఫ్ ( భారత శాంతిపరిరక్షక దళం)లో భాగంగా పాల్గొన్న వారందరినీ నేను గుర్తుచేసుకుంటున్నాను' అని ఆయన చెప్పారు. భారతదళాలను శ్రీలంకకు పంపాలని అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చర్చకు తెరిచేఉందని, ఈ విషయమై తాను దాని లోతుల్లోకి వెళ్లాలనుకోవడం లేదు కానీ ఆపరేషన్ పవన్‌లో పాల్గొన్న మన సైనికుల త్యాగాలను గౌరవించాలని మాత్రం బలంగా నమ్ముతున్నాను' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.1997 జూలై, 1990 మార్చి మధ్య భారత శాంతిపరిరక్షక దళం శ్రీలంక లో ఉన్న సమయంలో భారతదేశం దాదాపు 1200మంది సైనికులను కోల్పోయిందని వివరించారు. 1987 జూలై 29న భారతదేశం, శ్రీలంక ఒక చారిత్రక శాంతి ఒప్పందంపై సంతకం చేశాయి. దీని తర్వాత భారతదేశం ద్వీప దేశం శ్రీలంకలో ఐపికెఎఫ్‌ను మోహరింపజేసింది. ఇది సంవత్సరాలుగా విస్తృత హింస, పౌర కలహాలకు సాక్ష్యంగా ఉన్న తమిళ ఆధిపత్య ప్రాంతాలలో శాంతిని నెలకొల్పింది. అయితే ఆ ప్రాంతాలలో శాంతి లేకుండా పోయింది. చివరికి ఐపికెఎఫ్ ఉపసంహరించబడింది. శ్రీలంకకు బలగాలను పంపాలని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం నిర్ణయిస్తే, ద్వీప దేశం శ్రీలంక నుండి బలగాలను ఉపసంహరించుకోవాలని అనంతరం అధికారంలోకి వచ్చినటువంటి వి.పి.సింగ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'ఆపరేషన్ పవన్ సమయంలో భారత దళాలు అద్భుతమైన ధైర్యం, పరాక్రమాన్ని ప్రదర్శించాయి. విధి నిర్వహణలో చాలామంది సైనికులు అమరులయ్యారు. వారి ధైర్యం, సాహసం గురించి ఎలాంటి సందేహం లేదు' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 2015లో శ్రీలంకను సందర్శించిన సందర్భంగాప్రధానమంత్రి నరేంద్రమోదీ కొలంబోలోని ఐపికెఫ్ స్మారకచిహ్నం వద్ద భారత సైనికులకు మోదీ నివాళులు అర్పించడాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.

భారతదేశం దృఢ సంకల్పం, సంయమనానికి...

# ఆపరేషన్ సిందూర్ ఒక నిదర్శనం

ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ



**న్యూఢిల్లీ:**ఆపరేషన్ సిందూర్ భారతదేశం దృఢ సంకల్పం, సంయమనానికి 'నిర్వచనీయ ప్రదర్శన' అని, దేశ సాయుధ దళాలు, యువత నైతిక బలం, వృత్తిపరమైన నైపుణ్యానికి ప్రతిబింబమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ అన్నారు. గత ఏడాది మే 7వ తేదీ తెల్లవారుజామున భారత సాయుధ దళాలు ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది. ఏప్రిల్‌లో జరిగిన భయంకరమైన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా కనీసం 100మంది ఉగ్రవాదులను హతమార్చాయి. ఈ దాడిలో 26మంది అమాయక పౌరులు మరణించారు. బుధవారం ఇక్కడ జరిగిన నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) గణతంత్ర దినోత్సవ క్యాంప్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న క్యాడెట్లను ఉద్దేశించి ఉపేంద్ర ద్వివేదీ ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ భారతదేశం సంకల్పం, సంయమనానికి ఒక నిర్వచనాత్మక ప్రదర్శన అని, ఇది మన సైనిక దళాల, మన యువత నైతిక బలం, వృత్తిపరమైన నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని ద్వివేదీ అన్నారు. ఒకరోజుకు ముందు ఆయన పాకిస్థాన్‌కు ఒక దృఢమైన సందేశాన్ని పంపించారు. 'ఆపరేషన్ సిందూర్ కొనసాగుతూనే ఉంది. శత్రువు చేసే ఏదైనా దుస్సాహసానికి దృఢంగా ప్రతిస్పందిస్తాం' అని ఆర్మీచీఫ్ చెప్పారు. జనవరి 13న భారత సైన్యం తన వార్షిక విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. అక్కడ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ మాట్లాడుతూ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేసేందుకు భారత సైన్యం లోతుగా దాడిచేయడంతో వ్యూహాత్మక అంచనాలను తిరిగి పొందడంలో ఈ నిర్ణయాత్మక ఆపరేషన్ సహాయపడిందని, ఇస్లామాబాద్ దీర్ఘకాలిక అణు వాక్చాతుర్యాన్ని పగులగొట్టిందని తెలిపారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ గత మేనెలలో జరిగిన నిర్ణయాత్మక సైనిక చర్యలో ఎన్‌సిసి సహకారాన్ని ద్వివేదీ గుర్తుచేసుకున్నారు. ఈ ఆపరేషన్ సమయంలో దేశవ్యాప్తంగా 75,000మంది ఎన్‌సిసి క్యాడెట్లు స్వచ్ఛందంగా పనిచేశారని, పౌర రక్షణ, ఆసుపత్రి నిర్వహణ, విపత్తు ఉపశమనం వంటి సమాజ సేవలలో అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. 2047 నాటికి 'వీక్షిత్ భారత్' అనే దార్శనికత ఆవశ్యకత గురించి కూడా జనరల్ ఉపేంద్ర ద్వివేదీ సమావేశంలో నొక్కిచెప్పారు.అభివృద్ధి చెందిన, సురక్షితమైన, స్వావలంభన స్వావలంభన కలిగిన ప్రభుత్వం మాత్రమే దీనిని సాధించగలదని ఆర్మీ చీఫ్ వివరించారు.

# జిల్లాల పునర్వ్యవస్థీకరణ

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత జిల్లాల పునర్వ్యవస్థీకరణకు రెండవ సారి అడుగులు పడుతున్నాయి. త్వరలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల క్రితం సచివాలయంలో టిఎన్‌జిఒల నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ సభలో ప్రకటించారు. సుప్రీం కోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వం వహించే ఈ కమిషన్ 119 జిల్లాల్లో పర్యటించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించి ఆరు నెల్లో ప్రభుత్వానికి నివేదికను అందజేస్తుందని వెల్లడించారు. జిల్లా పునర్వ్యవస్థీకరణ అనేది కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న హామీనే. తాము అధికారంలోకి వచ్చాక జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణపై సమీక్ష చేస్తామని, మరి కొన్ని కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. అలాగే కొత్తగా ఏర్పాటయ్యే ఒక జిల్లాకు మాజీ ప్రధాని మంత్రి పి.వి.నరసింహారావు పేరు పెడతామని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా పునః నామకరణం చేస్తామని కూడా ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న జిల్లాల్లో ఒక్క జిల్లాను రద్దు చేసినా ఊరుకోబోమని బిఆర్‌ఎస్ హెచ్చరిక చేసింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రాష్ట్ర ప్రభుత్వ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలనేది బిజెపి డిమాండ్.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ అవసరమెందుకు వచ్చింది? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడివడి 2014 జూన్ 2న పది జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటైంది. మూడున్నర కోట్లకు పైగా జనాభా కలిగిన తెలంగాణను పరిపాలన సౌలభ్యం, అధికార వికేంద్రీకరణ కోసం జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనివార్యమైంది. ఇందుకు అన్ని పార్టీలూ అంగీకారం తెలిపాయి. నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వం పది జిల్లాలకు అదనంగా 23 కొత్త జిల్లాలను చేసింది. దీంతో మొత్తంగా 2016లో 33 జిల్లాలు ఉనికిలోకి వచ్చాయి. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో జనాభా పరంగా పలు చిన్న చిన్న జిల్లాలు కూడా ఏర్పాటయ్యాయి. ఉదాహరణకు హైదరాబాద్ చుట్టూ విస్తరించిన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఒకటి. అక్కడి జిల్లా పరిషత్ కేవలం ఐదుగురు సభ్యులతోనే ఏర్పడింది. జిల్లా పరిషత్ సమావేశంలో జెడిపి చైర్మన్, జెడిపి వైస్ చైర్మన్, కలెక్టర్, ఇతర అధికారులు పైనె కూర్చుంటే, కింద కేవలం ముగ్గురు జెడిపిటిసి సభ్యులే ఉండేవారని నాటి మల్కాజ్‌గిరి ఎంపిగా రేవంత్ రెడ్డి సరదాగా చెబుతుండేవారు. పరిపాలన సౌలభ్యం, పరిపాలన వికేంద్రీకరణ అనే అసలు ఉద్దేశ్యానికి భిన్నంగా దాదాపు కోటి జనాభా కలిగిన హైదరాబాద్‌ను విభజించకుండా ఒకే జిల్లాగా కొనసాగించారు. జంట నగరాలుగా ఉన్న హన్మకొండ, వరంగల్‌లను విడదీసి వేర్వేరు జిల్లాలుగా చేశారు. కానీ, రెండింటికీ హన్మకొండనే జిల్లా కేంద్రంగా ఉండటం వైచిత్రి. తుంగతుర్తి, హుస్నాబాద్ వంటి శాసనసభ నియోజకవర్గాలలోని మండలాలను రెండు, మూడు జిల్లాల్లో పంపిణీ చేశారు. అంతే కాకుండా 33 జిల్లాలలో 3+3 సంఖ్యను కలిపితే నాటి సిఎం కెసిఆర్ అదృష్ట సంఖ్య ఆరు వచ్చే విధంగానే పునర్వ్యవస్థీకరణ జరిగిందనే విమర్శలూ లేకపోలేదు. అందుకోసం జనాభా పరంగా చిన్న జిల్లాలు కూడా ఏర్పడ్డాయనే అభిప్రాయం ఉంది. కాబట్టి, పునర్వ్యవస్థీకరణ అవసరమైనప్పటికీ సరైన ప్రాతిపదిక, శాస్త్రీయత అవసరమని పై ఉదాహరణలు రుజువు చేస్తున్నాయి.

ఇక ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టనుందనే వార్తలు గుప్పుమనగానే రకరకాల ఊహాగానాలు, పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిని పెంచి, మూడు కార్పొరేషన్‌లుగా విభజించే దిశగా ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తున్నది. అవి గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ మల్కాజ్‌గిరి, గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లు. జిహెచ్‌ఎంసి పరిధిలో ఉన్న అనేక డివిజన్‌లు పొరుగున ఉండే రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో భాగంగా ఉన్నాయి. మున్సిపల్ పనులకు హైదరాబాద్, రెవెన్యూ అంశాలకు ఆ జిల్లాలకు తిరగాల్సిన పరిస్థితి. దీనికి విరుగుడుగా మూడు కార్పొరేషన్‌లకు అనుగుణంగా హైదరాబాద్ మహానగరంలో మూడు జిల్లాలు అనేది మంచి ఆలోచనే. అయితే, దీనిని బిఆర్‌ఎస్ వ్యతిరేకిస్తోంది. చారిత్రక సికిందరాబాద్ పరిధిలోని ప్రాంతాలను మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌లో కలిపి, కొత్త జిల్లాకు కూడా మల్కాజ్‌గిరి అనే పేరు పెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తామని చెబుతోంది. మరోవైపు మీర్‌ఖాన్‌పేటలో తలపెట్టిన ముఖ్యమంత్రి స్వప్న నగరి 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి పేరిట జిల్లాగా ఏర్పాటు చేస్తారనే ప్రచారమూ ఉన్నది. ఈ నేపథ్యంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సందర్భంలోనే పుకార్లను నమ్మవద్దని సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేయడం గమనార్హం.


తెలంగాణలో మరోసారి జిల్లాల హేతుబద్ధీకరణ అనివార్యమైంది. అయితే, కేంద్రం జనగణన చేపట్టిన తరుణంలో మరో రెండేళ్ళ పాటు ప్రస్తుతం ఉన్న జిల్లాల మార్పు చేర్పులు సాధ్యం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు లోక్‌సభ స్థానాల పునర్విభజన కూడా చేపట్టాల్సి ఉన్నది. ఇది కూడా గమనంలోకి తీసుకోవాల్సిన అంశమే. మల్కాజ్‌గిరి నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉంది. ఎంపిల లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ నిధుల మంజూరుకు మూడు జిల్లాల చుట్టూ ఫైళ్ళు తిరగాల్సి రావడంతో జాప్యం జరుగుతోంది. దీనిని బట్టి లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన కూడా జరగాల్సి ఉంది. ఈ తతంగానికి రెండు, మూడేళ్ళు పట్టడం ఖాయం. కాబట్టి జిల్లాల పునర్వ్యవస్థీకరణ లేదా హేతుబద్ధీకరణ భౌగోళికంగా, రాగద్వేషాలకు అతీతంగా, శాస్త్రీయంగా, పరిపాలనా సౌలభ్యం, సమతుల్య అభివృద్ధి వంటి అంశాల ప్రాతిపదికన నిష్పాక్షికంగా జరగాల్సిన అవసరం ఉంది.



## నిధుల విడుదల హర్షణీయం

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ-పంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికి నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. గత దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూ.11వేల కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. గ్రామీణ స్థాయి నుంచి ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడం ద్వారా మారుమూల ప్రాంతాల వరకు కూడా జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది.

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి




# చరిత్రకెక్కిన చరితార్థుడు చాసో

ప్రముఖ తెలుగు రచయిత. చాసోగా అందరికీ సుపరిచితుడు. ఆయన జీవితం మానవతావాదిగా ప్రారంభమై, మార్క్సిస్టుగా మారి, కథల్లో ప్రగతిశీల విలువలు, పీడిత ప్రజల బాధలు, సమస్యలు గురించి విస్తృతంగా రచనలు చేశాడు. 1915, జనవరి 15న శ్రీకాకుళంలో కానుకొలను లక్ష్మీ నారాయణ శర్మ, తులసమ్మలకు చాగంటి సోమయాజులు జన్మించాడు. తులసమ్మ అనబడే పెదతల్లికి దత్తుడిగా విజయనగరం వెళ్ళాడు. నాగావళీ తీరంలో పైరుపచ్చల మధ్య బాల్యం గడిచింది. అయిదోఫారం వరకు శ్రీకాకుళంలో చదివాడు. విజయనగరం ఉన్నత పాఠశాలలో చాసో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తిచేసి మహారాజా కళాశాల విజయనగరంలో పై చదువులు చదివాడు. కళాశాల విద్యార్థిగానే ఆయన కవితారచనకి శుభారంభం పలికాడు. తొరుదత్, సరోజినీ నాయుడుల కవిత్వం, లియో టాల్‌స్టాయ్, మాక్సిం గోర్కీల కళాత్మక వ్యక్తీకరణ, ప్రగతిశీల మార్క్సిస్టు దృక్పథం చాసోను ప్రభావితం చేశాయి. సృజనాత్మక ప్రక్రియలైన కథ, కవిత్వం, రెండింటినీ దాదాపు ఒకే సమయంలో వ్రాస్తూ వచ్చినా తర్వాతికాలంలో ఆయన కథా రచనకే ప్రాధాన్యమిచ్చాడు.

అభ్యుదయ సాహిత్యోద్యమ వేదిక, అభ్యుదయ రచయితల సంఘం మొదటి మహాసభలు తెనాలిలో 1943లో జరిగాయి. ఆనాటి నుంచి కన్ను మూసే వరకూ ఆయన 'అరసం'లోనే ఉంటూ కార్యకర్తగా నాయకునిగా తెలుగునాట అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి విశేష సేవలందించారు.

ఈయన మొట్ట మొదటి రచన చిన్నాజీ 1942లో భారతి అనే పత్రికలో ప్రచురితమైంది. ఈయన రాసిన చాలా కథలు హిందీ, రష్యన్, కన్నడ, మరాఠి, మలయాళం, ఉర్దూ భాషలలోకి అనువదించబడ్డాయి. 1968లో చాసో కథలుగా పుస్తక రూపంలో చాసో కథా సంకలనం వెలువడింది.

వర్తమాన సమాజంలో వైరుధ్యాలు, ఆర్థిక సూత్రాలే మానవ సంబంధాలలో, మనిషి మనుగడలో కీలకపాత్ర నిర్వహిస్తాయనే సత్యాన్ని అలవోకగా 'కాందిశీకుడు' కవిత ఆవిష్కరించింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో బర్మాపై జపాన్ బాంబు దాడులు జరిపాక, బర్మా నుండి అనేక తెలుగు కుటుంబాలు కట్టుబట్టలతో కాలినడకతో స్వగ్రామాలు చేరినప్పుడు ఇక్కడి దుర్భరస్థితిని ఒక తల్లి హృదయావేదనగా చాసో అక్షరీకరించాడు. 'నమ్ముకున్న పుడమితల్లి, కట్టుకున్న భార్య రెండూ అతడికి కాకుండా పోయాయని', చివరికి 'పొయ్యిలో నిప్పులేదు, నీకేం పెట్టేది నాయనా' అనే తల్లి విలాపం పఠితను కన్నీళ్ళు పెట్టిస్తుంది. 1987లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయిత ల సంఘం, గుంటూరు జిల్లా శాఖ వారిచే కొండేపూడి సాహితీ సత్కారాన్ని అందుకున్నాడు. 1995 నుంచి చాసో కుటుంబ సభ్యులుబ ప్రతి ఏటా చాసో జన్మదినం జనవరి 15న సృజనాత్మక సాహిత్య వికాసానికి, నిబద్ధతతో కృషి చేస్తున్న అభ్యుదయ రచయితలలో ఒకరికి 'చాసో స్ఫూర్తి సాహితీ పురస్కారం' అందిస్తున్నారు. చాసో 1994 జనవరి 1న మరణించాడు. మరణానంతరం తన భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి పరిశోధనల నిమిత్తం ఇమ్మని కోరటం ఆయన అభ్యుదయ జీవన దృక్పథానికి నిదర్శనం.

**(జనవరి 15 చాగంటి సోమయాజులు జయంతి)**

**సుధాకర్ ఎ.వి,** 9000674747

# అమెరికా తదుపరి లక్ష్యం గ్రీన్‌లాండ్ స్వాధీనం



ఎం.కోటేశ్వరరావు

ప్రస్తుతం డెన్మార్క్‌లో స్వయం పాలిత ప్రాంతంగా ఉన్న గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకొనేందుకు అమెరికా రంగం సిద్ధం చేసింది. ఆ ప్రాంతాన్ని తమ 51వ రాష్ట్రంగా స్వాధీనం చేసుకొనేందుకు అధ్యక్షుడి కి అధికారం ఇవ్వాలంటూ ప్రజాప్రతినిధుల సభ సభ్యుడు రాండీ ఫైన్ ఒక బిల్లును ప్రవేశపెట్టాడు. ఈ దురాగతాన్ని ఐక్యంగా అడ్డుకోవాలని డెన్మార్క్, గ్రీన్‌లాండ్ నిర్ణయించాయి. గతంలో వాణిజ్యం పేరుతో ఐరోపా సామ్రాజ్యవాద దేశాలైన బ్రిటన్, డచ్, పోర్చుగీసు, ఫ్రాన్సు వంటి దేశాలు ప్రపంచాన్ని ఆక్రమించుకున్నా యి. ఆ క్రమంలో వాటి మధ్య యుద్ధాలు కూడా జరిగాయి. ఇప్పుడు తన భద్రతకు ముప్పు పేరుతో ప్రపంచాన్ని ఆక్రమించుకొనేందుకు అమెరికా పావులు కదుపుతోంది. మాదకద్రవ్యాలను సరఫరా చేసే ముఠాకు నాయకుడంటూ తప్పుడు ప్రచారం చేసి వెనెజులా అధ్యక్షుడిని అపహరించింది. ఇరాన్‌లో ప్రజాందోళనలను అణచివేస్తున్నందున జోక్యం చేసుకుంటామని బెదిరిస్తున్నది. ఏ క్షణమైనా ఏదైనా జరగవచ్చు. ఆర్కిటిక్ సముద్రం లో ఉన్న డెన్మార్క్‌కు చెందిన స్వయం పాలిత ప్రాంతం గ్రీన్‌లాండ్ దీవి తన రక్షణకు అవసరమంటూ దాన్ని ఆక్రమించుకొనేందుకు పూనుకుంది. అన్ని ఖండాలలో 800కు పైగా చిన్నా, పెద్ద మిలిటరీ కేంద్రాలు, లక్షలాది మంది సైన్యాన్ని మోహరించిన అమెరికా ఏ దేశం మీదనైనా దాడికి దిగదలుచుకుంటే కొన్ని గంటల్లోనే సైన్యాన్ని దించగలదు. అలాంటిది చిన్న దేశమైన క్యూబా మొదలు పెద్ద దేశమైన చైనా వరకు అన్నీ తన భద్రతకు ముప్పు తలపెట్టాయంటూ ఒక మైండ్ గేమ్(మానసిక క్రీడ) ఆడుతోంది. ఆ సాకుతో బెదిరింపులకు, ఆక్రమణలకు పాల్పడుతోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు చెప్పిన అనేక మధురమైన మాటలతో ఇంక పని లేదు, అనుకున్న లక్ష్యాలు నెరవేరటం లేదంటూ కర్ర పుచ్చుకొని దందా కు పూనుకుంది. తనకు లొంగని వెనెజులా మీద దాడిచేసి అధ్యక్షుడు నికొలస్ మదురోను అపహరించి విచారణ తతంగం ప్రారంభించింది. ఆ దేశానికి తానే తాత్కాలిక అధ్యక్షుడనని ట్రంప్ ప్రకటించుకున్నాడు. తదుపరి లక్ష్యాలుగా కెనడా, గ్రీన్‌లాండ్, ఇరాన్, మెక్సికో, కొలంబియా ఇలా జాబితాను పెంచుకుంటూ పోతోంది.

ఇరాన్ మీద గతేడాది భీకరదాడి జరిపినప్పటికీ అది సాధించిందేమీ లేదు. అణుస్థావరాలకు ఆవగింజంత నష్టం కూడా జరగలేదని తేలింది. అందువలన ఇప్పుడు మరోసారి దాడి జరగాలంటే అనేక అంశాలను మదింపు చేసుకోవాల్సి ఉంటుంది. అందువలన తొలుత గ్రీన్‌లాండ్‌తో ఆక్రమణ ప్రారంభం కావచ్చన్నది ఒక అభిప్రాయం. ఒక గుండా ముందుగా బలహీనులనే దాడికి ఎంచుకుంటాడు. దాని వలన రెండు ప్రయోజనాలు ఒకటి నా తడాఖా ఇట్లుంటది అని చూపుకోవచ్చు, మిగిలిన వారిని బెదిరించవచ్చు. గ్రీన్‌లాండ్‌ను తాను స్వాధీనం చేసుకోనట్లయితే రష్యా, చైనా ఆక్రమించుకుంటాయని అందువలన తానే ఆపని చేయనున్నట్లు ట్రంప్ ఒక అబద్ధాన్ని చెప్పాడు. నిజానికి అలాంటి ఆరోపణలను ఏ దేశం లేదా వాటిని వ్యతిరేకించే మీడియా కూడా చేసేందుకు సాహసించలేదు. జనాలను తప్పుదారి పట్టించేందుకు ఒక పథకం ప్రకా రం గోబెల్స్‌ను మించి ప్రచారాలు చేయటంలో అమెరికా పేరుమోసింది. ఆర్కిటిక్ సముద్రంలో అనేక దేశాలు పరిశోధనలు చేస్తున్నాయి. ఎక్కడా దాపరికం లేదు, చైనా కూడా అదే చేస్తోంది. కానీ గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకొనేందుకే అని బీజింగ్ మీద కథనాలు రాస్తున్నారు. ఆర్కిటిక్ సముద్రంలో మంచుకరిగి పోతున్నదని గత మూడుదశాబ్దాలుగా అనేక మంది చెబుతున్నారు, దాని పరిణామాలు, పర్యవసానాల గురించి పరిశోధనలు చేయటం ఆ ప్రాంత దేశాలైన నార్వే, డెన్మార్క్, స్వీడన్, ఐస్‌లాండ్, కెనడా, అమెరికా, రష్యా, ఫిన్లాండ్ దేశాలకే కాదు, యావత్ మానవాళికి అవసరం. అయితే అవి అంగీకరించిన అంతర్జాతీయ చట్టాలు, నిబంధన ల మేరకు జరగాలి. ప్రస్తుతం వార్తలోకి ఎక్కిన గ్రీన్‌లాండ్ దీవి డెన్మార్క్‌లోని స్వయం పాలిత ప్రాంతం. అది డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్‌కు అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసికి మధ్యలో రెండు దేశాలకు 3,200 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రష్యాకు ఐదువేలు, చైనాకు ఎనిమిది, మనదేశానికి తొమ్మిదివేల కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. గ్రీన్‌లాండ్ రాజధాని నుక్ పట్టణం డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్‌కు 3,500 కిలోమీటర్ల దూరంలో ఉంటే అమెరికా నగరం న్యూయార్క్‌కు 2,900కి.మీ దూరంలో ఉంది. దక్షిణ చైనా సముద్రంలో స్వేచ్ఛగా నౌకా రవాణా జరగాలని చెబుతున్న అమెరికా, ఆర్కిటిక్ సర్కిల్ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రాంతంలో పరిశోధనలు చేసే హక్కు చైనాతో సహా ఏ దేశానికైనా ఉంటుందా లేదా! ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఈ ప్రాంతంలో అమెరికా, సోవియట్ యూనియన్ కూడా అణుజలాంతర్గాములను మోహరించా యి. ఇప్పుడు మరోసారి ఆ ప్రాంతాన్ని ఒక యుద్ధ కార్యక్షేత్రంగా మార్చేందుకు అమెరికా పూనుకుంది. ఇప్పటికే గ్రీన్‌లాండ్‌లో ఉన్న తన మిలిటరీ కేంద్రాన్ని మరింత పటిష్ట పరిచేందుకు తనకు ఆ దీవి పూర్తిగా కావాలని, మర్యాదగా ఇస్తే సరి, లేకుంటే బలప్రయోగం చేయాల్సి వస్తుందని బెదిరింపులకు దిగింది. రష్యా, చైనా నుంచి ఆర్కిటిక్ ప్రాంతానికి ముప్పు వచ్చిందని 2024లోనే అమెరికా ప్రచారం ప్రారంభించింది.

గ్రీన్‌లాండ్ ప్రాంతంపై అమెరికా కన్ను ఎందుకు? ఆర్కిటిక్ ప్రాంతంలో విలువైన ఖనిజాలు ఉన్నాయి, అక్కడి సర్వేలో తేలిన 34 రకాల్లో 25 విలువైన ఖనిజ జాబితాలో ఉన్నాయి. నౌకా రవాణా మార్గం గా ఉండటం, మిలిటరీ రీత్యా కీలక ప్రాంతం కావటంతో దాన్ని తన ఆధిపత్యంలోకి తెచ్చుకోవాలని, చైనా, రష్యాలను మరింతగా ఇబ్బంది పెట్టాలన్నది అసలు లక్ష్యం. ఇదే జరిగితే ఐరోపా భద్రత, ప్రపంచ రాజకీయాల మీద ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. గ్రీన్‌లాండ్ భౌగోళికంగా ఉత్తర అమెరికాలో ఉంది, ఐరోపాలోని డెన్మార్క్‌లో భాగం అయినప్పటికీ స్వయం పాలిత ప్రాంతంగా ఉన్న ప్రపంచంలోని పెద్ద దీవి. జనాభా కేవలం 60వేల లోపే, వారు కూడా ఎక్కువగా చేపలవేట మీదే ఆధారపడుతున్నారు. ఈ ప్రాంతంలో మిలిటరీ కార్యకలాపాల నిర్వహణకు డెన్మార్క్‌తో అమెరికా రక్షణ ఒప్పందాలు చేసుకుంది. పర్యావరణ మార్పులతో మంచు కరిగిపోతుండటంతో నూతన నౌకా మార్గాలు ఏర్పడ్డాయి. ప్రయాణ దూరం తగ్గింది, ముడి చమురు, గ్యాస్, విలువైన ఖనిజాల వంటి లక్షల కోట్ల డాలర్ల విలువగల సహజవనరుల వెలికితీతకు మార్గం ఏర్పడింది. మిలిటరీ నిఘా కూడా పెరిగింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ ఆక్రమణను నిరోధించేందుకు అమెరికా ప్రవేశానికి డెన్మార్క్ అనుమతించింది. ఈ ప్రాంతాన్ని తమకు అమ్మాలని 1946లోనే వాషింగ్టన్ ప్రతిపాదించినప్పటికీ అంగీకరించలేదు.

ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియాలను దగ్గర చేసేందుకు సూయజ్ కాలువ మీదుగా కంటే ఆర్కిటిక్ ప్రాంతం అనువుగా ఉండటం, దూరం తగ్గటం, సమయం, ఖర్చు కూడా తగ్గుతుండటంతో ఇటీవలి కాలంలో నౌకా రవాణా పెరిగింది. చైనా, రష్యా నౌకలు సంచరిస్తున్నాయి. రష్యా నుంచి చైనాకు చమురు రవాణాకు ప్రత్యామ్నాయ నౌకా మార్గంగా ఈ ప్రాంతాన్ని ఎంచుకోవాలని చూస్తున్నారు. ఆ నౌకల మీద నిఘాపెంచాలంటే అమెరికన్లకు ఈ దీవి ఎంతో అనువుగా ఉంటుంది. దీనితో పాటు ఉపగ్రహాలకూ అనువైన ప్రాంతం. ప్రస్తుతం కొన్ని రంగాలకు చమురు, బంగారం కంటే విలువైన ఖనిజాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. చైనా వీటిపై 90శాతం అదుపు కలిగి ఉంది, ఎవరు తోక ఝాడించినా వాటి ఎగుమతులు నిలిపివేసి ప్రతీకారం తీర్చుకుంటున్నది. అమెరికా కూడా దానిమీద ఆధారపడి ఉండటంతో ఎక్కడ అలాంటి వనరులుంటే వాటిని సొంతం చేసుకొనేందుకు అమెరికా పూనుకుంది. లిథియం, కోబాల్ట్, చమురు, గ్యాస్ పుష్కలంగా ఉన్నాయి.

నిజంగా గ్రీన్‌లాండ్ ఆక్రమణకు పూనుకుంటే ఐరోపా ఎలా స్పందిస్తున్న అంశాన్ని ఇప్పుడు అమెరికా మదింపువేస్తున్నది. నాటో ప్రారంభ దేశాలలో డెన్మార్క్ ఒకటి. ఇప్పుడు దాని స్వయం పాలిత ప్రాంతాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకోవటం అంటే నిబంధనలకు విరుద్ధం. నాటో దేశాలన్నీ దాన్ని ఎదుర్కోవాలని నిబంధన ఉంది. అయితే గతంలో టర్కీ గ్రీస్ మధ్య తలెత్తిన వివాదంలో నాటో నాయకత్వం చేసిందేమీ లేదు. ఇప్పుడు కూడా అదే పునరావృతం అవుతుందా? ఆదివారం నాడు బ్రిటన్, జర్మనీ నాయకత్వంలో కొన్ని దేశాల ప్రతినిధులు సమావేశమై ఆర్కిటిక్ ప్రాంత భద్రత గురించి మరింత సమన్వయంతో పని చేయాలని నిర్ణయించినట్లు వార్తలు. ఒక దేశసార్వభౌమత్వానికి వ్యతిరేకంగా అమెరికా చేసిన వ్యాఖ్యల పూర్వరంగంలో అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని కెనడా కూడా కోరింది. అయితే ముసుగులో కుమ్ములాట మాదిరి తప్ప నేరుగా అమెరికాను విమర్శించటానికి ఇంకా ముందుకు రావటం లేదు. తాము అమెరికన్లుగా మారటానికి సిద్ధంగా లేమని గ్రీన్‌లాండ్ ప్రధాని జేన్స్ ఫ్రెడరిక్ నీల్సెన్‌తో సహా ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక ప్రకటన చేశాయి. తమ భవిష్యత్‌ను తామే నిర్ణయించుకుంటామని స్పష్టం చేశాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో తమ వ్యతిరేకులను అడ్డుకోవటానికి ప్రాధాన్యత ఇస్తామని అమెరికా అధ్యక్ష భవనం కొద్ది రోజుల క్రితం ప్రకటించింది. అంతకు ముందు జనవరి నాలుగున ట్రంప్ స్వయంగా మాట్లాడుతూ గ్రీన్‌లాండ్ ప్రాంతంలో రష్యా, చైనా నౌకలు తిరుగుతున్నందున తమ జాతీయ భద్రతా అవసరాల రీత్యా ఆ ప్రాంతం తమకు కావాలని చెప్పాడు. ఎలా స్వాధీనం చేసుకోవాలా అన్నది అధ్యక్షుడు తన బృందంతో చర్చిస్తున్నాడని, మిలిటరీ వినియోగ అవకాశం ఎప్పుడూ ఉంటుందని అధ్యక్ష భవన ప్రకటన తేటతెల్లం చేసింది. 1979 నుంచి గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌లో స్వయంపాలిత ప్రాంతంగా ఉంది, ప్రజాభిప్రాయ సేకరణ తరువాత స్వాతంత్ర్యం ప్రకటించుకొనే అవకాశం కూడా 2009 నుంచి దానికి వచ్చింది. అయితే ఇంతవరకు అలాంటి నిర్ణయం తీసుకోలేదు. నిజానికి ట్రంప్ 2019లోనే గ్రీన్‌లాండ్ స్వాధీనం గురించి చెప్పాడు. ట్రంప్ వ్యాఖ్యలు వెలువడిన జనవరి నాలుగునే డెన్మార్క్ ప్రధాని మెటీ ఫ్రెడరిక్సన్ ఖండించారు. డెన్మార్క్ రాజరికంలోని మూడు ప్రాంతాలలో ఏ ఒక్కదానిని విలీనం చేసుకొనే హక్కు అమెరికాకు లేదని ఆమె పేర్కొన్నారు. ఫారో దీవి కూడా గ్రీన్‌లాండ్ వంటిదే అన్నారు, మరో దేశంగానే గాక చారిత్రకంగా సన్నిహితంగా ఉన్న దేశంమీద అమెరికా ఇలాంటి కోరికలను వెలిబుచ్చటం తగదన్నారు.

అమెరికా విస్తరణ కాంక్ష ఒక్క గ్రీన్‌లాండ్‌కే పరిమితం కాదు. కెనడా తమ 51వ రాష్ట్రం కావాలని గతంలోనే ట్రంప్ కోరిన సంగతి తెలిసిందే. అందువలన కెనడియన్లు కూడా అప్రమత్తం కావాలని అనేకమంది హెచ్చరిస్తున్నారు. గ్రీన్‌లాండ్‌తో పోల్చితే కెనడా పక్కనే ఉంటుంది, అక్కడ కూడా సహజ సంపదలు పుష్కలంగానే ఉన్న సంగతి తెలిసిందే. ప్రపంచంలో అధిక చమురు నిల్వలున్న దేశాల్లో నాలుగవదిగా ఉంది. బ్రిటన్ నుంచి రెండు దేశాలూ స్వాతంత్ర్యం పొందినవే. గత రెండువందల సంవత్సరాల్లో లాటిన్ అమెరికాలో అమెరికన్లు జరపని కుట్ర లేదు, అనేక ప్రభుత్వాలను కూల్చివేశారు, అనేకమందిని హత్య చేయించారు. మొత్తం పశ్చిమార్ధగోళం తమకిందే ఉండాలని పదే పదే చెబుతున్న సంగతి తెలిసిందే. చరిత్రలోకి చూస్తే కెనడాను ఆక్రమించుకొనేందుకు అమెరికా 1812లోనే ప్రయత్నించింది. 1939వరకు కెనడాను ఆక్రమించాలనే మిలిటరీ వ్యూహాన్ని కొనసాగించి తరువాత ఉపసంహరించుకుంది, ట్రంప్‌కు ఆ గతం గుర్తుకు వచ్చి ఉంటుంది. కెనడా వర్తమాన చరిత్రను చూస్తే అన్ని అంశాల్లోనూ అమెరికాతో కలసి అనేక దాడుల్లో భాగస్వామి గా ఉంది. నాటో కూటమిలో కూడా చేరింది. అయితే కొన్ని సందర్భాల లో అమెరికా వైఖరితో విభేధించింది. అణ్వాయుధాల మోహరింపుకు అంగీకరించలేదు, వియత్నాంపై యుద్ధాన్ని అంగీకరించలేదు. క్యూబా విషయంలో కూడా సానుకూలంగా ఉంది. చివరికి తన ప్రయోజనాలను ఫణంగా పెట్టి అమెరికా రుద్దిన ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో మెక్సికోతో కలసి భాగస్వామి అయింది. గల్ఫ్‌వార్‌లో అమెరికాతో కలసిపనిచేసింది. వీటితో పాటు కొన్ని మిత్రబేధాలు ఉన్నాయి. అందుకే తాజా పన్ను ఉగ్రవాదాన్ని ట్రంప్ కెనడాకూ విస్తరించాడు. ఈ పూర్వరంగంలో చూసినపుడు గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకొంటే ఐరోపా, మిగతా ప్రపంచం ఎలా స్పందిస్తుందో చూసిన తరువాత కెనడాను కూడా తనదారికి తెచ్చుకుంటుందా? చూద్దాం !




# కేరళ ఆర్‌టిసి అద్భుత విజయగాథ

## అందుబాటు ధరలో గృహపథకాలకు లైఫ్ మిషన్ ఉత్తమ నమూనా

పి.శ్రీకుమరన్

కేరళ ఆర్థిక వ్యవస్థకు భారంగా, తెల్ల ఏనుగుగా పేరుబడిన కేరళ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కెఎస్ఆర్‌టిసి) పూర్తిగా మారిపోయిన అద్భుతమైన పరివర్తన కథ ఇది. కేవలం పదేళ్ల క్రితం కెఎస్ఆర్‌టిసి అపహాస్యానికి గురవుతూ, విమర్శకుల వెకిలి హాస్యానికి ఆలంబనగా ఉండేది. కెఎస్ఆర్‌టిసిని బాగుచేయ డం అసాధ్యమని, దానిని గౌరవప్రదంగా పాతర వేయాలని వారి విమర్శల సారాంశం. కానీ, అలాంటి నిరాశాజనకమైన రోజులు ముగిసిపోయాయి. ఈ సంస్థ నమ్మశక్యం కాని అద్భుతమైన మార్పుతో జన్మతః రంధ్రాన్వేషకుల ను, నిత్యం నిందించే వారి నోరు మూయించిం ది. నిరంతరం నష్టాల్లో ఉండే సంస్థ స్థాయి నుంచి కెఎస్ఆర్‌టిసి ఇప్పుడు లాభాలు ఆర్జించే సంస్థగా రూపాంతరం చెందింది. దీని పనితీరు ఎంత అద్భుతంగా ఉందంటే, ఇతర రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలు కూడా కెఎస్ఆర్‌టిసి నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. రవాణా శాఖ మంత్రి కె.బి. గణేశ్ కుమా ర్ నేతృత్వంలోని బృందం ఈ ఉత్తేజకరమైన గాథను లిఖించింది. అంకితభావం గల నిపుణుల బృందం, నిబద్ధత కలిగిన ఉద్యోగుల సమర్థవంతమైన సహకారంతో ఆయన ఈ అద్భుతమైన ఘనతను సాధించిన తీరును వర్ణించడానికి ఎంత ప్రశంసించినా తక్కువే. ఈ విజయం పట్ల మంత్రి అమితానందం వ్యక్తం చేశారు. అందుకు ఆయన వద్ద అన్ని కారణాలు ఉన్నాయి. సరైన రీతి లో గణేశ్ కుమార్ తన బృందానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే కష్టకాలంలో అనేక అడ్డంకులను ఎదుర్కొం టూ తాను చేపట్టిన ఈ ప్రయత్నానికి ముఖ్యమంత్రి పూర్తి మద్దతు ఇచ్చారని ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

మలయాళ సినిమా మెగాస్టార్ మోహన్‌లాల్ ఒక్క రూపాయి కూడా పారితోషికంగా తీసుకోకుండా కెఎస్ఆర్‌టిసి 'గుడ్‌విల్ అంబాసిడర్'గా వ్యవహరించేందుకు అంగీకరించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఆయన సేవ పూర్తిగా ఉచి తం. కెస్ఆర్‌టిసి ప్రకటనలలో నటించడానికి ఆయన అంగీకరించారు. ప్రతిభావంతులైన దర్శకుల సేవలను ఉపయోగించుకుని, మోహన్‌లాల్‌తో కెఎస్ఆర్‌టిసి కోసం కొన్ని ప్రకటనల ను చిత్రీకరించాలని సంస్థ యోచిస్తోందని మంత్రి గర్వంగా చెప్పారు. 2026 జనవరి 5, సోమవారంనాడు టిక్కెట్ల ద్వారా మొత్తం రూ.12.18కోట్లు వసూ లు చేసి ఈ సంస్థ టిక్కెట్ల వసూళ్లలో కొత్త రికార్డు సృష్టించింది. ఈ వసూళ్లకు 4,952 బస్సులు దోహదపడ్డాయి. సంస్థ యాజమాన్యంలోని భవనాల్లో అద్దెకు ఇచ్చిన దుకాణాల ద్వారా వచ్చే ఆదాయం, పెట్రోల్ పంపుల ద్వారా వచ్చే ఆదాయంతో సహా ఇతర వాణిజ్య ఆదాయాలను కూడా లెక్కిస్తే, సోమవారం నాటి మొత్తం ఆదాయం రూ.13 కోట్లు అని మంత్రి ఉద్వేగంగా తెలిపారు. 2025 సెప్టెంబర్ లో కెఎస్ఆర్టిసి రికార్డు స్థాయిలో రూ.10.19కోట్ల వసూళ్లను సాధించినప్పుడు ఈ మార్పు స్పష్టంగా కనిపించిందని, డిసెంబర్‌లో అది మరింత పెరిగి రూ.10.76 కోట్లకు చేరింది. బస్సుల నిర్వహణలో చేసిన కొన్ని చిన్నపాటి మార్పుల కారణంగానే ఈ రికార్డు వసూళ్లు సాధ్యమయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

ఈలోగా, కెఎస్ఆర్‌టిసి బడ్జెట్ టూరిజం సెల్ డిసెంబర్ లో ఒకే నెలలో రూ. 5.51 కోట్ల రికార్డు ఆదాయాన్ని నమోదు చేసి,కొత్త శిఖరాన్ని అధిరోహించడం హర్షణీయం. 2021లో ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యధిక నెలవారీ ఆదాయమని అధికారులు తెలిపారు. ఇది డిసెంబర్ 2024 లో నెలకొల్పిన రూ.4.5 కోట్ల మునుపటి రికార్డును అధిగమించింది. ఆకర్షణీయమైన ధరలతో కూడిన ప్యాకేజీలు, ప్రయాణికుల నుండి లభించిన భారీ స్పందన కలయికతో ఇది సాధ్యమైం ది.

అన్నింటికి మించి ముఖ్యంగా ఉత్సాహభరితమైన ప్రజల భాగస్వామ్యం కెఎస్ఆర్‌టిసి నిరాశ అగాధం నుండి ఆనంద శిఖరానికి అద్భుతంగా పుంజుకోవడానికి కీలకమైన అంశం. బడ్జెట్ టూరిజం సెల్ రాష్ట్ర సమన్వయకర్త ఆర్.సునీల్ కుమార్ ప్రకారం, డిసెంబర్, జనవరి నెలల్లో శీతాకాలపు పొగమంచు, సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం కింద ప్రవేశపెట్టిన కొత్త ప్రయాణ ప్యాకేజీల కారణంగా ఆదాయం పెరిగింది. వినూత్న టూర్ ప్యాకేజీల కారణంగా పెద్ద సంఖ్యలో పర్యాటకులు మేఘమలై, ఊటీ, కొడైకెనాల్, రామేశ్వరం, కన్యాకుమారి వంటి తమిళనాడులోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలకు కూడా క్యూ కడుతున్నారు.నీతి ఆయోగ్ నుండి లభించిన ప్రశంసలు రాష్ట్రానికి దక్కిన మరో ఘనతగా నిలిచాయి. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం చేపట్టిన లైఫ్ (లైవ్‌లీహుడ్(జీవనోపాధి), ఇన్‌క్లూజన్ (సమ్మిళి తం), ఫైనాన్షియల్ ఎంపవర్‌మెంట్ (ఆర్థిక సాధికారత)) మిషన్‌ను దేశంలో అందుబాటు ధర గృహనిర్మాణంలో ఉత్త మ పద్ధతులలో ఒకటిగా నీతి ఆయోగ్ గుర్తించింది.

కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) ఈ మిషన్‌పై దుర్మార్గపు, విషపూరిత ప్రచారాన్ని ప్రారంభించింది. నాటి యుడిఎఫ్ కన్వీనర్ ఎం. ఎం. హసన్ యుడిఎఫ్ అధికారంలోకి వస్తే ఈ మిషన్‌ను మూసివేస్తామని చెప్పేంత వరకు వెళ్లారు.

తాజా నీతి ఆయోగ్ నివేదిక లైఫ్ మిషన్‌ను 'బహుముఖ సమన్వయ, సమాజ ఆధారిత నమూనా'గా అభివర్ణించింది. ఇది పేదల గృహ అవసరాలను తీర్చడానికి వివిధ విభాగాలు, స్థానిక స్వపరిపాలన సంస్థల వనరులను సమర్థవంతంగా ఏకతాటిపైకి తీసుకువస్తుందని ఆ నివేదిక పేర్కొంది.

స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎం.బి. రాజేశ్ మాట్లాడుతూ ఈ పథకం కింద రాష్ట్రం ఇప్పటికే 4,76,076 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసిందని తెలిపారు. మరో 1,24,471 ఇళ్ళు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ పథకం కింద అందించబడే ఆర్థిక సహాయాన్ని మంత్రి రాజేశ్ ప్రస్తావిస్తూ లైఫ్ మిషన్ దేశంలోనే అత్యధిక గృహ సహాయం అందిస్తుందని అన్నారు. రాష్ట్రం ఒక్కో ఇంటికి రూ.నాలుగు లక్షలు అందిస్తుంది, షెడ్యూ ల్ కులాలు, షెడ్యూల్ తెగల లబ్ధిదారులకు రూ.ఆరు లక్షలు సహాయం అందిస్తుంది. కేరళ ప్రభుత్వం కొన్ని వినూత్న మార్పులను అమలు చేయడాన్ని కూడా పరిశీలిస్తోంది. ఇది రాష్ట్రంలోని విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం నుండి బరువైన స్కూల్ బ్యాగులతో పాఠశాలకు వెళ్లాల్సిన భారాన్ని తగ్గిస్తుంది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలలో చేసిన సూచనలలో ఎక్కువ పెద్దవి కాని —ప్యాడెడ్ షోల్డర్ స్ట్రాప్‌లతో వచ్చే స్కూల్ బ్యాగులు, పాఠ్యాంశాలు, టైమ్‌టేబుల్‌లో మార్పులు, పాఠశాలల్లో పుస్తకాలను నిల్వ చేయడానికి లాకర్లు వంటివి ఉన్నాయి. *(ఐపిఎ సర్వీస్)*

## సంస్కృతి, సంప్రదాయాలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది

### ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం భోగి పండుగ పర్వదినం సందర్భంగా పట్టణంలోని తన స్వగృహంలో ఇంటి ముందుకు వచ్చిన బసవన్నకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. చల్లంగా దీవించు..విజయాలను అందించు అంటూ బసవన్నను వేడుకున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డూడూ బసవన్న ఇంటి ముందు ప్రక్షణలు చేసి మేళ తాళాలతో పండుగ వాతావారాన్ని ఇంటి ముందు పరిచారు. బసవన్నకు నూతన వస్త్రాలను కప్పి పండుగ కానుకలను అందించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గాలి పటాలను ఆకాశంలోకి ఎగురవేసి చిన్నతనంలో స్నేహితులతో కలిసి గడిపిన విషయాలను ఒక్కసారి నేమరు వేసుకున్నారు. సంక్రాంతి సమయంలో పాటించే ప్రతి ఆచారం వెనక ప్రత్యేక నమ్మకం, చరిత్ర ఉందని, ఇది ప్రతి ఒక్కరు పాటించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో సంస్కృతి, సాంప్రదాయాలను మరుగున పడేసేందుకు ప్రయత్నాలు చోటు చేసుకుంటున్నాయని, పురాతనకాలం నుండి వస్తున్న ఆచారాలను కాపాడేందుకు ప్రజలందరు కృషి చేయాలని సూచించారు. చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ గాలిపటాలను ఎగురవేసేవారమని గుర్తు చేశారు. ఆరుగాలం కష్టపడి అన్నదాతలు పండించిన పంటలను ఇంటికి తీసుకువచ్చిన సమయంలో సంక్రాంతి పండుగ నిర్వహించుకుంటాని తెలిపారు. మకర సంక్రాంతి ఉత్తరాయణ సమయంలో గాలి పటాలు ఎగరవేస్తే మంచి జీవితాన్ని, సంతోషాన్ని ఇచ్చినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు గాలిపటాలను ఎగురవేస్తారనే విషయాన్ని పూర్వీకులు చెప్తుంటారని పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంతోపాటు నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.



## యువత క్రీడలతోపాటు చదువుల్లో రాణించాలి

**ప్రజాపక్షం/కొందుర్గు:** యువత క్రీడలతోపాటు చదువులపై దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని రేగడిచిల్కమర్రి గ్రామ సర్పంచ్ ఏనుబోతుల శ్వేత శివారెడ్డిలు కోరారు. బుధవారం మండల పరిధిలోని రేగడిచిల్కమర్రి గ్రామంలో సిపిఎల్4 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్వేత శివారెడ్డి మాట్లాడుతూ యువత చిన్నతనం నుండే క్రమశిక్షణతో నడవడికలు నేర్చుకుంటే భవిష్యత్ ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించేందుకు యువత ముందుకు రావాలని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముమ్మందు వచ్చే రోజులు యువతవే కాబట్టి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌కు టీ షర్టులను అందించిన ఎడ్ల రవి (ఎన్.కృష్ణారెడ్డి టీం)ను, మల్లారెడ్డి గూడెం బుచ్చయ్య (రాకేష్ టీం), పుడుగుర్తి రమేష్ (రాజు టీం), గోనె రవీందర్‌రెడ్డి (నవీన్ టీం)లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జమాల్పూర్ నందులాల్, వార్డు సభ్యులు కుమార్, మల్లారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నందిని రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో భోగి సంబరాలు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** బుధవారం ఉదయం పట్టణంలోని ఆర్‌టిసి కాలనీలో, శ్రీనివాస కాలనీలలో యోగా సెంటర్ ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. ఆనందోత్సాహాల మధ్య మూడు రోజుల పాటు నిర్వహించుకునే ఈ సంక్రాంతి పండుగ వేళ మొదటి రోజు భోగి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని యోగా శిక్షకులు, అభ్యాసకులు తెలుగు లోగిళ్లలో బోగీ పండుగ జరుపుకుంటున్న తెలుగు ప్రజలందరికీ ప్రత్యేకంగా శుభాకాంక్షాలు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు రావడంతోపాటు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని యోగా శిక్షకుడు గవ్వయ్య ఆకాంక్షించారు. ప్రజలందరూ భోగభాగ్యాలతో తులతూగాలని, చేదు జ్ఞాపకాలను భోగీ మంటల్లో ఆహుతి చేద్దాం అని పేర్కొన్నారు. సరికొత్త ఆశలకు నాంది పలుకుదామని ఆకాంక్షించారు.

## మా పల్లెల్లోకి కొత్త విద్యుత్ వెలుగులు

### సర్పంచ్‌లను అభినందిస్తున్న గ్రామస్తులు

**ప్రజాపక్షం/కేశంపేట:** సంక్రాంతి పర్వది నం పురస్కరించుకొని గ్రామాలకు సర్పంచ్‌లు కొత్త విద్యుత్ వెలుగులు తీసుకువచ్చారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని లే మామిడి గ్రామంలో సర్పం చ్ సులోచన శ్రీను, ఉప సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, పాల్కోనిగుట్ట తండాలో సర్పంచ్ రాత్లావత్ భాస్కర్ నాయక్‌లు తన సొంత ఖర్చులతో గ్రామాల్లో విద్యుత్ ఎల్ఇడి లైట్లను వేయించారు. దాంతో సర్పంచులు చేసిన మంచి పనికి ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ లైట్లు లేక ప్రజలు రాత్రి సమాయాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ఇబ్బందులను దూరం చేసేందుకే తాము సొంత ఖర్చులతో లైట్లు వేయించినట్లు తెలిపారు. తాము సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు. ప్రజల సమస్యల ను తమ సమస్యలుగా భావిస్తూ పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్న ట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లే మామిడి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్‌తోపాటు గ్రామస్తులు ఉన్నారు.





సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లోఅంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ ఘనంగా సాగుతోంది. సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పతంగుల పండుగకు సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. 19 దేశాల నుంచి సుమారు 40 మంది కైట్ ఫ్లైయర్స్ ఈ ఫెస్ట్‌కు వచ్చారు. వారు ఎగురవేస్తున్న వివిధ ఆకృతుల పంతంగులను చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

## నుమాయిష్ వేదికగా... రహదారి భద్రతా పాఠాలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:**హైదరాబాద్ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే నుమాయిష్ లో నగర పోలీసులు సందడి చేశారు. ప్రజలకు రక్షణ, వివిధ భద్రతాంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నగర పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనర్, ఎసిబి అదనపు డిజిపి చారుసిన్హా బుధవారం ప్రారంభించారు. నగర విసి సజ్జనర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ అనగానే చార్మినార్, బిర్యానీతో పాటు నుమాయిష్ కూడా నగర గుర్తింపులో ఒక భాగమని పేర్కొన్నారు. 1938 లో కేవలం పదుల సంఖ్యలో స్టాల్స్‌తో ప్రారంభమైన ఈ ప్రదర్శన.. నేడు దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా ఎదిగిందన్నారు. 85 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ వేదిక జాతీయ సమైక్యతకు, గంగాజమునా తహజీబ్ సంస్కృతికి అద్దం పడుతోందని కొనియాడారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ స్టాల్స్ ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమని సిపి తెలిపారు. ప్రధానంగా మహిళల రక్షణ కోసం పనిచేస్తున్న 'షీ టీమ్స్' పనితీరు, ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇక్కడ ప్రత్యేక అవగాహన కల్పిస్తామని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా పోలీసు స్టాల్స్‌కు తీసుకురావాలని, చిన్ననాటి నుంచే వారికి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పిస్తే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని సూచించారు. రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ట్రాఫిక్ విభాగం పనితీరును, జాయింట్ సిపి జోయల్ డెవిస్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అదనపు డిజిపి చారుసిన్హా మాట్లాడుతూ.. ఉమెన్ సేఫ్టీ వింగ్, భరోసా, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ మహిళలకు భద్రతపై పూర్తి భరోసా కల్పిస్తాయన్నారు. సందర్శకులకు చట్టాలపై అవగాహన కల్పించడానికి ఇదొక మంచి వేదికని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధు లు నగర పోలీసులకు రూ.15 లక్షల విరాళ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సిపి(ట్రాఫిక్) డి. జోయల్ డెవిస్, డిసిపిలు రాహుల్ హెగ్డే, జి. చంద్రమోహన్, వి.అరవింద్ బాబు, లావణ్య నాయక్ జాదవ్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షు డు సుకేష్ రెడ్డి, కార్యదర్శి బి.ఎన్. రాజేశ్వర్, కోశాధికారి డాక్టర్ ఎన్. సంజీవ్ కుమార్‌లు పాల్గొన్నారు.




## ఓవర్ లోడ్‌కు అడ్డు ఏది?

### పట్టించుకోని పోలీసులు, రవాణా శాఖాధికారులు

**ప్రజాపక్షం/తాండూరు:** ఓవర్ లోడ్‌కు అడ్డు అదుపులేకుండా పోయింది. తట్టేపల్లి కేంద్రంగా నిత్యం వందలాది భారీ టిప్పర్ల ద్వారా ఓవర్ లోడ్‌తో ఎర్రమట్టిని తరలిస్తూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఓవర్‌లోడ్‌ను అడ్డుకోవాల్సిన రవాణశాఖ, పోలీసు, మైనింగ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తట్టేపల్లి, పాషాపూర్, జయరాంతాండ పరిసర ప్రాంతాలలో సుమారు 30వరకు ఎర్రమట్టి క్వారీలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడి క్వారీల నుండి భారీ టిప్పర్ల ద్వారా ఓవర్ లోడ్‌తో ఎర్రమట్టిని తరలిస్తున్నారు. వాహనాలలో పరిమితికి మించిన లోడ్ నింపుకుని భారి వాహనాలు రోడ్డు ఎక్కడంతో రోడ్లు మరింత అధ్వాన్నంగా మారుతున్నాయి. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధి తట్టేపల్లి కేంద్రంగా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతూ భారీ టిప్పర్ల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ చేసుకుని అక్రమ రవాణ చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొందుతున్నారు. ఈ ప్రాంతం నుండి నిత్యం దాదాపు 100కుపైగ భారీ టిప్పర్ల ద్వారా కర్నాటక రాష్ట్రంలో ఉన్న సిమెంట్ కర్మగారాలకు ఎర్రమట్టిని తరలించి దండుకుంటున్నారు. ఇలా గ్రామం నడిబోడ్డు నుండి అక్రమంగా భారీ వాహనాలు రవాణా సాగిస్తుండడంతో చిన్నారులు, రోడ్డుపై వెళ్ళాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. ఓవర్ లోడ్‌ను అడ్డుకోవాల్సిన రవాణశాఖ అధికారులు, పోలీసులు నిద్రమత్తు వీడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు, టాస్క్ ఫోర్స్ అధికారులు ఈ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రమట్టి అక్రమ రవాణాపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## పశుబల ప్రదర్శన పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న అంతర్రాష్ట ఒంగోలు జాతి పశుబల ప్రదర్శన పోటిలను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలుజాతి పశువులు తెలుగు రైతుల గర్వకారణమని, దేశవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన ఈజాతి పరిరక్షణకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని అన్నారు. రైతులు పశుపోషణను వృత్తిగా అభివృద్ధి చేసుకుంటే ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈపశుబల ప్రదర్శన పోటిలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులోను రైతులు, పశుపోషకులకు ప్రభుత్వం తరపున అన్నివిధాల సహకారం అందించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమలో సర్పంచ్ లక్ష్మి కర్నాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, రైతులు, యువకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.





## దైవచింతనతో మానసిక ప్రశాంతత

### ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం భోగి పండుగను పురస్కరించుకొని ఆదిభట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ రంగనాయక సమేత శ్రీ గోదా రంగనాథస్వామి దేవాలయంలో గోదా అమ్మవారి కుంకుమార్చన, శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ భోగి పండుగ వంటి పవిత్ర సందర్భాల్లో ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను బలోపేతం చేస్తాయని అన్నారు. ప్రజలు శాంతి, సౌభ్రాతృత్వాలతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు తొర్రూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయమని మల్‌రెడ్డి రాంరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నల్లబోలు అనిల్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు సంరెడ్డి వెంకట్ రెడ్డి, మెకం ఎల్లయ్య, భూషణం గౌడ్, దప్పు సుమలత, మాజీ కౌన్సిలర్ నక్క శివలింగం, తదితరలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు నమోదు?

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తలసాని పై కాంగ్రెస్ నేత రవికిరణ్ చేసిన ఫిర్యాదుపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. సికింద్రాబాద్ లో జరిగిన ఓ మీడియా సమావేశంలో సిఎం ను ఉద్దేశించి తలసాని వ్యాఖ్యలు చేసినట్టు రవికిరణ్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



## జహంగీర్ ఫీర్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు

**ప్రజాపక్షం/కొత్తూరు:** పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం జహంగీర్ ఫీర్ దర్గాలో ఉర్సు ఉత్సవాల సందడి మొదలైంది. బుధవారం కేశంపేట మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తనయుడు వై. మురళి యాదవ్‌లు బాబాకు ఛాదర్ సమర్పించి ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు కలిసిమెలిసి ప్రార్థనలు నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఎంతో చరిత్రాత్మకమైన ప్రదేశంగా ఉన్న జహంగీర్ ఫీర్ దర్గా పుణ్యక్షేత్రం వల్ల ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లి విరియాలని బాబాను కోరినట్లు తెలిపారు. ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు తగిన మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లలిత గోపాల్‌నాయక్, మేళ్ళగూడ తండా సర్పంచ్ రవి నాయక్, నేతలు పెంటనోళ్ల యాదగిరి శ్రీరాములు, ముఖీద్, సాలి, కుమార్‌లు పాల్గొన్నారు.

## పురపోరు ఎన్నికల రిజర్వేషన్లపై నేతల్లో ఉత్కంఠ

- ఓటర్ జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- విద్యార్థుల పరీక్షలు మొదలయ్యేలోగా ఎన్నికలు పూర్తి
- అధిష్టానాల వద్దకు పరుగులు తీస్తున్న నేతలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండటంతో రాజకీయ పార్టీల నేతల్లో తీవ్ర ఉత్కంఠత నెలకొంది. రిజర్వేషన్లు ఎలా వస్తాయి..తమకు సీట్లు ఇస్తారా..లేదా అనే సందేహాల మధ్య రాజకీయ పార్టీల నేతలు అధిష్టానాల వద్దకు పరుగులు తీస్తున్నారు. వార్డుల్లో తమకు అనుకూలత ఎక్కువగా ఉంది.. తమకే టికెట్లు కేటాయించండి..రిజర్వేషన్లు తమకు అనుకులంగా ఉండే విధంగా చూడాలంటూ పార్టీల అధిష్టాల ముందు ఎవరి గోడు వారు వెళ్లబోసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఈ నెల 16వ తేదీ తరువాత రిజర్వేషన్లు ప్రకటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. రిజర్వేషన్లు ప్రక్రియ పూర్తి కాగానే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని నేతలు, అధికారులు భావిస్తున్నారు. ఫిబ్రవరి నెల 10వ తేదీలోనే మున్సిపల్ ఎన్నిక లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న ట్లు తెలియడంతోనే స్థానిక రాజకీయ పార్టీల నేతలు అధిష్టానాల వద్దకు ఉరుకులు..పరుగులు పెడుతున్నారు.

2026 జనవరి రెండోవారం నాటికి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంతోపాటు వార్డు వారీగా పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులు ఉన్నాయి..ఈ వార్డుల్లో గతంలో ఉన్న రిజర్వేషన్లు ఉంటాయా..లేక కొత్త రిజర్వేషన్లు ఏమైనా వస్తాయా అనే విషయాలపై జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు ఎక్కువ గా ఉండటంతో సీట్లు ఎవరికి వస్తాయోననే భయంలో నేతలు ఉండిపోయారు. రాజకీయ పార్టీల అధిష్టానం ముందు కనిపించేందుకు నిత్యం నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. వార్డుల వారీగా యువతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న తరుణంలో పార్టీలో ఏళ్ల తరబడి పని చేస్తున్నా మ ని తమకు అవకాశం ఇవ్వాలని నేతలు పట్టు బడుతుండటంతో ఏమి చేయాలో తెలియక అధిష్టానం నేతలు తలలు పట్టుకుంటున్నా రు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చేసిన పొరపాట్లు చేయకుండా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ప్రణాళికబద్ధంగా, పకడ్బంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తుంటే తామేమీ తక్కువ కాదంటూ అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ విజయం దిశగా ప్రతిపక్ష పార్టీ ముందుకు వెళ్తుంది. ఈ తరుణంలో ఎవరు విజయం సాధిస్తారనే కోణా ల్లో నేతలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరిలో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలోనే స్థానికంగా రాజకీయ వేడి మొదలైందని చెప్పవచ్చు.

పురపాలక సంఘం - షాద్‌నగర్ జిల్లా. రంగారెడ్డి

**విద్యార్థుల పరీక్షలు రాకముందే ఎన్నికలు పూర్తి**

విద్యార్థుల వార్షిక పరీక్షలు రాకముందే మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేయాలనే ఆలోచనలో ఎన్నికల కమీషన్ ఉన్నట్లు తెలుస్తుంది. ఫిబ్రవరి రెండోవారంలో మున్సిపల్ ఎన్నికలు పూర్తిచేస్తే విద్యార్థుల పరీక్షలకు ఎలాం టి ఆటంకం ఉందనే ఉద్దేశంతోనే ఎన్నికల పనులకు కమీషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. 2026 జనవరి రెండోవారం నాటికి మున్సిపాలిటిలోని వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను సైతం కమీషన్ ఆదేశించినట్లు తెలుస్తుంది. ఆ దిశగానే మున్సిపల్ అధికారులు ఎన్నికల పనుల్లో పూర్తిగా నిమగ్నమైనట్లు సమాచారం.

ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా పూర్తి చేశా మో అదే తరహాలో మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేసేందుకు అధికారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

**మున్సిపల్ వార్డుల విభజన ఇప్పట్లో లేనట్లే**

మున్సిపాలిటీలో వార్డుల విభజన ఇప్పట్లో లేనట్లే ఉందని తెలుస్తుంది. ఎలాంటి హడావుడి లేకుండా ఫిబ్రవరి నెలలో మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేయాలని ఎన్నికల కమీషన్ భావిస్తున్న నేపథ్యంలో వార్డు విభజన లేనట్లే. దాంతో గతంలో ఉన్న వార్డుల ప్రకారమే ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తులు మొదలు పెట్టారు. వార్డుల రూట్ మ్యాప్‌లతోపాటు ఓటర్ల జాబితాను సిద్ధం చేయడమే కాకుండా పోలింగ్ కేంద్రాలను సైతం అధికారులు గుర్తించారు.

**షాద్‌నగర్ మున్సిపాలిటీలో 53, 403మంది ఓటర్లు**

షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 28వార్డుల్లో 53,403మంది ఓటర్లు ఉన్నట్లు మున్సిపల్ కమీషనర్ సునీతారెడ్డి తెలిపారు. ఇందులో పురుషులు 26,679మంది మహిళలు 26,723మంది, ఇతరులు ఒకరు ఉన్నట్లు వివరించారు. 28వార్డులకు గాను మొత్తం 76 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వీటిలోనే మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు.

## అలరించిన ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సంస్కృతికి అద్దం పట్టేలా మహిళలు ముగ్గులు వేసి సాంప్రదాయాన్ని కాపాడుతున్నారని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్ కొల్తూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలకు మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అద్యక్షుడు దోసకాయల వెంకటేష్ ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు మొదటి బహుమతి తేజస్విని రూ.5వేలు, ద్వితీయ బహుమతి అక్షర రూ.3వేలు, తృతీయ బహుమతి ఆశ్రితలకు రూ.2 వేలు, కన్సోలేషన్ నగదు 1 వేయి చొప్పున ముగ్గురికి అందజేశారు. ముగ్గుల పోటిల్లో పాల్గొన్న ప్రతి మహిళకు రూ. 500 అందజేశారు. కార్యక్రమంలో మంద శ్రీనివాస్‌రెడ్డి, నల్ల శిల్పా యాదగిరి, బొగ్గుల వెంకటేష్, జైపాల్‌రెడ్డి, నర్సింలు, నర్సారెడ్డి, వంగ వెంకటరమణరెడ్డి, బస్వారెడ్డి, దామోదర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, కొల్తూర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భోగి సంబరాలు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** సంక్రాంతి పండుగలో తొలి రోజు పండుగైన భోగి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.బుధవారం చర్లపల్లి,కుషాయిగూడ,నాగారం,దమ్మాయిగూడ,కీసరలో తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో మంటలు వేసుకుంటు ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతూ భోగి సంబరాలను నిర్వహించారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నాగారం :** జిహెచ్ఎంసి పరిధిలోని 5వ డివిజన్ నాగారం వెస్ట్ గాంధీ నగర్ కాలనీలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరై ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గులు వేసిన మహిళా కానిస్టేబుళ్లకు చీరలు పంపిణీ




**ప్రజాపక్షం/చర్లపల్లి :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళ పోలీస్ కానిస్టేబుల్‌లకు బహుమతులు అందజేశారు. లైన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మాయాచారి ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఉప్పల్ జోన్ అడిషనల్ డిసిపి వెంకటరమణ హాజరై చీరలను అందజేశారు. కార్యక్రమంలో సిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, లయన్ సభ్యులు మహంకాళి నరసింహచారి, నారా మోహన్‌రావు పాల్గొన్నారు.

## గంగపుత్రుల సంక్షేమానికి సహకారం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గంగపుత్రుల సంక్షేమానికి బిఆర్ఎస్ అన్నివేళలా సహకరిస్తుందని పార్టీ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ తెలిపారు. గౌతంనగర్ డివిజన్‌కు చెందిన గంగపుత్ర సంఘ ప్రతినిధులు బుధవారం స్థానిక కార్పొరేటర్ కార్యాలయానికి వచ్చి గత కొద్ది కాలంగా తామెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ కోరటంతో స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళుతానన్నారు.

## ఈటల సమక్షంలో బిజెపిలో చేరిక



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్‌కు చెందిన ర్యాకల నర్సింలుగౌడ్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సమక్షంలో బుధవారం బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల నర్సింలుగౌడ్‌కు బిజెపి కండవా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, తప్పెట్ల నరేందర్‌గౌడ్, యాదిరెడ్డి, రవీందర్, సుధాకర్, నర్సింహారెడ్డి, సుధాకర్‌నాయక్, దాసరి నర్సింహారెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, తూం పరమేశ్వర్‌రావు, రాంపల్లి పరమేశ్వర్‌రావు, శ్రీశైలం, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.





సంక్రాంతి పండుగకు నగరవాసులు తమ స్వగ్రామాలకు తరలివెళ్లడంతో బుధవారం నిర్మానుష్యంగా మారిన సెక్రటేరియట్ రహదారులు

## మౌలాలి డీజిల్ షెడ్ ఉద్యోగి ఆత్మహత్య - కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :**మౌలాలి డీజిల్ షెడ్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ ఎస్‌సి వెంకట్ రాజేష్ కుమార్(39) మంగళవారం కాచిగూడ విద్యానగర్ రైల్వేలైన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొన్నాడు. అతడి ఆత్మహత్యకు నిరసనగా బుధవారం డీజిల్ షెడ్‌లో పని చేసే కార్మికులు కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అధికారుల ఒత్తిడి, వేధింపుల కారణంగానే రాజేష్‌కుమార్ ఆత్మహత్యకు కారణమని కార్మికులు ఆరోపించారు. ఆత్మహత్యకు బాధ్యులైన అధికార్లపై చర్యలు తీసుకోవాలని, అతడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



## ప్రజలకు స్పీకర్ సంక్రాతి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా ప్రజలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో భోగభాగ్యాలతో, భోగి సకల సంపదలతో సంక్రాంతి, కన్నుల పండుగా కనుమను జరుపుకోవాలని ఆకాక్షించారు.

## గాలిపటాలతో చిన్నారుల సందడి



**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా కేంద్రంలో సంక్రాంతి కోలహలం సందడి కొనసాగుతుంది. చిన్నపిల్లలు గాలి పటాలను ఎగురవేస్తూ ఉల్లాసంగా ఉత్సాహంగా సందడి చేశారు. జిల్లాలో వ్యాప్తంగా ఇంటి ముగ్గట భోగి మంటలు వేశారు. మహిళలు తమ ఇంటి ముంగిట అందమైన రంగవల్లులు వేశారు.

## తాండూరు మున్సిపల్ తుది ఓటరు జాబితా విడుదల



**ప్రజాపక్షం/తాండూరు :** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తాండూరు మున్సిపల్ అధికారులు తది ఓటరు జాబితాను బుధవారం విడుదల చేశారు. ఈ మేరకు తాండూరు మున్సిపల్ కమీషనర్ యాదరిగి ఎన్నికల సంఘం సూచన మేరకు తుది ఓటరు జాబితాను విడుదల చేయడంతో పాటు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సైతం పరిశీలించిన ఏర్పాట్లును చక్క దిద్దుకుంటున్నారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు చెందిన 77,029 మంది తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఓటరు తుది జాబితాలో 37,499మంది పురుష ఓటర్లు ఉండగా, 39,525మంది మహిళ ఓటర్లు ఉన్నారు. వార్డుల వారీగా వివరాలు ప్రకటించారు.

## ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికలు కీలకం

'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించిన సర్పంచ్‌లు



**ప్రజాపక్షం/బంట్వారం :** తుర్‌మామిడి గ్రామ సర్పంచ్ ఎం.సంజీవయ్య, బస్వాపూర్ గ్రామ సర్పంచు ఎం.స్రవంతి శివరాజ్ చేతులు మీదుగా 2026 ప్రజాపక్షం నూతన క్యాలెండర్‌ను బుధవారం తుర్‌మామిడి గ్రామ పంచాయతీ కార్యలయంలో నూతన క్యాలండర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అనునిత్యం సేకరిస్తూ వాటిని అధికారుల దృష్టికి తీసుకోరావడంలో పత్రికలు ఎంతో కీలకమైనవన్నారు. ప్రజాపక్షం దినపత్రిక ప్రజలకు మరింత చేరువై ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయాలన్యారు. కార్యక్రమంలో తుర్‌మామిడి మరియు బస్వపూర్ వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## యువతలో క్రీడాస్ఫూర్తిని వెలికితీయాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యువతలో దాగిఉన్న క్రీడాస్ఫూర్తిని వెలికితీయడానికి క్రీడలు దోహదపడతాయని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రాధమిక పాఠశాలలో వాలీబాల్ టోర్నమెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండి జగన్నాదం ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 11 టీమ్‌లు వాలీబాల్ క్రీడా పోటీల్లో తలపడ్డారు. మొదటి విజేతకు కిట్టు యాదవ్ ఫ్రెండ్స్ రూ. 4 వేలు, రెండవ బహుమతి సీనియర్స్ లక్ష్మాపూర్ టీమ్ రూ. 2 వేలతో పాటు మెమోంటోలు, షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరేషం, వైద్యనాద్, తూం వేణుగోపాల్‌రావు, గోపి, బండి రవిందర్, కొల్తూర్ బాలకృష్ణ, పాల యాదిరెడ్డి, రహ్మాన్ గ్రామస్థులు శంకర్, కరుణాకర్, వంశీ, యాదగిరి, రామకృష్ణ, మురళి, యాంకర్ అంగడి కృష్ణ, సంతోష్‌గౌడ్, కుమార్, ప్రేమ్‌కుమార్, వెంకటేష్, అనిల్‌కుమార్, నాగరాజు, బాలకృష్ణ, యువకులు పాల్గొన్నారు. యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ ఆద్వర్యంలో బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లో సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి రూ. 2 వేలు (లాస్య), రెండవ బహుమతి రూ. 1 (బట్టు సౌజన్య), మూడవ బహుమతి రూ. 500 (ఎల్లగౌని ఉమారాణి) లు గెలుచుకున్నారు. గెలిచిన విజేతలకు నగదు పురస్కారాలు అందజేశామని క్యాతం మధుకృష్ణ తెలిపారు. అలాగే గురువారం సాయంత్రం లక్ష్మాపూర్‌లోని ప్రాధమిక పాఠశాలలో యువకులకు వాలీబాల్ టోర్నమెంట్‌లు నిర్వహిస్తామని గెలిచిన టీమ్‌లకు మొదటి బహుమతి రూ. 3 వేలు, రెండవ బహుమతి రూ. 1500 నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.



## చైనా మాంజా విక్రేత అరెస్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి :** చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని భవాని నగర్ సులభ్ కాంప్లెక్స్ సమీపంలో పతంగుల షాపులో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేయగా చైనా మాంజా పట్టుబడింది. కాప్రా గాంధీనగర్‌కు చెందిన వెంకటసాయిని పట్లుకుని చైనా మాంజాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు 5 బైకుల స్వాధీనం


**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న యువకుడిని అరెస్టు చేసి ఐదు బైకులను స్వాధీనం చేసుకొన్నారు. నేరేడ్‌మెట్ ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్ నివాసి కావేరి రామకృష్ణ అలియాస్ కిట్టు (25) అనుమానాస్పదంగా బైకుపై సంచరిస్తుండగా అదుపులోకి తీసుకొన్నారు. విచారణలో నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోరీ చేసిన బైకులను నిందితుడి నుండి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

# మున్సి'పోల్'కు అటు అధికారులు, ఇటు రాజకీయపార్టీల సన్నాహాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు త్వరలో జరుగనున్న ఎన్నికలకు అటు అధికారులు, ఇటు రాజకీయ పార్టీలు సన్నాహాలు వేగంగా కొనసాగిస్తున్నారు. బ్యాలెట్ ప్రాతిపదికలో జరుగనున్న ఈ ఎన్నికలకు గాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఓటరు జాబితా విడుదల చేసింది. ఇప్పటికే జిల్లా కలెక్టర మనుచౌదరి సంబంధిత అధికారులతో ఎన్నికల ఏర్పాట్ల విషయమై సమీక్షా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేసారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేందుకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఇప్పటికే విడుదల చేసిన ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలియచేసేందుకు అవకాశం సైతం కల్పించారు. ప్రభుత్వం రాష్ట్రంలో జరుగనున్న మున్సిపాలిటీల ఎన్నికల్లో చైర్మన్ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించనుంది. . జిల్లాలో ఉన్న 12 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోని తొమ్మిదింటిని గ్రేటర్ జిహెచ్ఎంసిలో విలీనం చేయగా మిగిలిన ఆలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపల్లి మున్సిపాలిటీలకు చెందిన 68 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మూడు మున్సిపాలిటీలు మేడ్చల్ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోనే ఉండటం గమనార్హం.

**సంక్షేమ పథకాలే విజయ కారణాలుగా కాంగ్రెస్**

రాజకీయ పార్టీల గుర్తులపై జరుగనున్న ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్‌తోపాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్‌లు ఎవరికి వారే అన్ని స్థానాలను దక్కించుకొనేందుకు పోటాపోటీగా ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. ఇటీవలి ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అదే జోష్‌తో గత రెండేళ్ల కాలంలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల ముందుంచటం ద్వారా విజయం దక్కించుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళికతో కదులుతున్నారు. గతంలో రాష్ట్రాధికారం కోల్పోయినప్పటికి మేడ్చల్ జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో తమ ఉన్న ఎమ్మెల్యేలతో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టటం ద్వారా ఎలాగైనా పూర్వ వైభవం దక్కించుకొనేందుకు తపనతో బిఆర్ఎస్ పథకాలు వేస్తోంది. మరో పక్క మేడ్చల్ జిల్లా పరిధిలోకి వచ్చే మల్కాజిగిరి ఎంపిగా ఉన్న బిజెపికి చెందిన ఈటెల రాజేందర్ సైతం మూడు మున్సిపాలిటీలలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముందుంచి వాటిని దక్కించుకోవాలని కదం తొక్కుతున్నారు. దీని కోసం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకమైన తోటకూర వజ్రేష్‌యాదవ్, బిఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, బిజెపికి చెందిన మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్‌లు మూడు మున్సిపాలిటీలను దక్కించుకోవటం సవాల్‌గా తీసుకొంటున్నారు. ఇప్పటికే వజ్రేష్‌యాదవ్ నిర్వహించిన ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధి పార్టీ కార్యకర్తలు, నేతల విస్తృత సమావేశం మూడు మున్సిపాలిటీలు కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని చెబుతూ జోష్ తీసుకొని వచ్చారు. డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌తో పాటు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఇదే నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ప్రముఖ నేతలు నక్క ప్రభాకర్, మార్కెట్ కమిటి చైర్మన్ నరసింహులు యాదవ్‌లకు ఎన్నికల్లో అన్ని స్థానాలను దక్కించుకొనే బాధ్యతలు అప్పచెప్పారు. మున్సిపాలిటీలలో పోటీ చేసేందుకు ఆసక్తి కనపరుస్తున్న ఆశావహులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడా తిరుగుబాటు లేకుండా ఏకధాటిన తెచ్చేందుకు ప్రణాళికాయుక్తంగా వెళుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో వచ్చాకా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, సన్న వడ్ల బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళా సంఘాల ప్రోత్సాహాల వంటి అమలవుతున్న ప్రజాసంక్షేమ పథకాలు ప్రజల ముందుంచేందుకు కార్యకర్తలు బాధ్యత తీసుకొని ప్రచారం కొనసాగించాలని దిశానిర్దేశం చేసారు.






**పూర్వవైభవం కోసం బిఆర్ఎస్**

రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవటంతో పాటు ఇటీవలి ఉప ఎన్నికల్లో పరాభవంతో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించటం ద్వారా పూర్వవైభవాన్ని పొందేలా క్యాడర్‌ను బలోపేతం చేసే దిశగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై పార్టీ అగ్రనేతలు బాధ్యత అప్పచెప్పారు. దీని కోసం తన స్టైల్‌లో మల్లారెడ్డి పర్యటిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలంటూ దుయ్యబడుతున్నారు.

**పల్లె మున్సిపాలిటీల్లో బిజెపి పట్టు సాధించేనా**

అర్బన్ ప్రాంతాలకే పరిమితమవుతున్న బిజెపి మేడ్చల్ జిల్లాలోని పల్లె ప్రాంతాలుగా ఉన్న మూడు మున్సిపాలిటీల్లో జరిగే ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టటం నుండి విజయం సాధించటం కత్తితో సాముగానే ఉంటుందని చెప్పవచ్చు. దీని కోసం మల్కాజిగిరి ఎంపి ఈటెల తన స్టైల్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలే విజయానికి నాందిగా ఉంటాయన్న విశ్వాసంతో ఉన్నారు. మరో పక్క మేడ్చల్ జిల్లాకు చెందిన బిజెపి ప్రధాన నేతలు, ఎంపి మధ్య సయోధ్య లేక పోవటం సైతం బిజెపికి మైనస్ పాయింట్‌గా మారనుంది.

## మిచెల్, విల్‌యంగ్

# మెరుపులు

### రెండో వన్డేలో న్యూజిలాండ్ విజయం





**రాజ్‌కోట్ :** భారత్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో కివీస్ 1–1తో సమం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని న్యూజిలాండ్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. డారిల్ మిచెల్ (131; 117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సు) శతకం బాదాడు. విల్ యంగ్ (87; 98 బంతుల్లో 7 ఫోర్లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఓపెనర్లు డేవాన్ కాన్వే (16), హెన్రీ నికోల్స్ (10) త్వరగానే నిష్క్రమించినా.. తర్వాత వచ్చిన విల్ యంగ్, డారిల్ మిచెల్ మూడో వికెట్కు 162 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. గ్లెన్ ఫిలిప్స్ (32*; 25 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇండోర్లో జరగనుంది.

భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (112; 92 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ శుభ్మన్ గిల్ (56; 53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ చేశాడు. రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), రవీంద్ర జడేజా (27), నితీశ్ రెడ్డి (20) పరుగులు చేశారు. శ్రేయస్ అయ్యర్ (8) నిరాశపర్చాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జేమీసన్, ఫాక్స్, జేడెన్ లెనాక్స్, మైకేల్ బ్రాస్వెల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

కాగా భారత్‌తో టీమ్‌ఇండియాపై న్యూజిలాండ్ వన్డేలలో ఇదే అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం.



## ఐసిసి వన్డే ర్యాంకింగ్స్..

# అగ్రస్థానంలో కోహ్లీ



**దుబాయ్:** ఇండియన్ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వన్డే ర్యాంకింగ్‌లో టాప్ ప్లేస్ కొట్టేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో హాఫ్ సెంచరీ చేసిన కోహ్లీ తన ర్యాంక్ ను మెరుగుపరుచుకున్నాడు. 37 ఏళ్ల కోహ్లీ .. 2021 జూలై తర్వాత మళ్లీ వన్డే ర్యాంకింగ్‌లో తొలి స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ వర్మ వన్డే బ్యాటింగ్‌లో మూడవ స్థానానికి పడిపోయాడు. కోహ్లీ ఫస్ట్ వన్డేలో కివీస్‌పై 93 రన్స్ స్కోరు చేశాడు. దీంతో అతను వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. మొదటి స్థానంలో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. కోహ్లీ తన చివరి అయిదు ఇన్నింగ్‌లలో అద్భుతమైన బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 74, 135, 102 స్కోర్ చేశాడు. ఇక సఫారీలతో ఓ మ్యాచ్‌లో 65, కివీస్‌తో ఫస్ట్ మ్యాచ్‌లో 93 స్కోరు చేశాడు. అక్టోబర్ 2013లో కోహ్లీ తొలిసారి వన్డే ర్యాంకింగ్‌లలో నెంబర్ వన్ స్థానంలో నిలిచాడు. ఇక ఆ పొజిషన్లో మొత్తం 11 సార్లు అతను టాప్ ప్లేస్‌లో నిలిచాడు. కోహ్లీ తన కెరీర్‌లో 825 రోజుల పాటు వన్డే టాప్ బ్యాటర్‌గా నిలిచాడు. శుభమన్ గిల్ అయిదవ స్థానంలో, శ్రేయాస్ అయ్యర్ టాప్ 10లో ఉన్నాడు.

# హీలి వీడ్కోలు



**మెల్బోర్న్ :** ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు సారథి అలిస్సా హీలి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. త్వరలో సొంతగడ్డపై భారత్‌తో జరుగబోయే మూడు ఫార్మాట్ల సిరీస్ తర్వాత క్రికెట్ నుంచి వైదొలుగనున్నట్టు ఆమె తెలిపింది. 15 ఏండ్ల నుంచి ఆస్ట్రేలియాకు ప్రాతినిథ్యం వహిస్తున్న 35 ఏండ్ల హీలి.. ఆ జట్టు గెలిచిన 8 ప్రపంచకప్‌లలో భాగస్వామిగా ఉన్నది. మూడు ఫార్మాట్లలో కలిసి సుమారు 300 మ్యాచ్‌లలో ఆడి 7 వేలకు పైగా పరుగులు సాధించింది. 2023లో మెగ్ లానింగ్ నుంచి సారథ్య పగ్గాలు అందుకున్న ఆమె.. జట్టును విజయపథంలో నడిపించినా కీలక టోర్నీల్లో ఆసీస్ తడబాటుకు గురైంది.

## గాంధారి ఖిల్లా

# రహస్యం..




తెలంగాణ చారిత్రక భూపటంలో మంచిర్యాల జిల్లాలోని గాంధారి ఖిల్లా ఒక అద్భుతమైన ఏకశిలా సౌధం మాత్రమే కాదు, అది ఒక ఆదిమ గిరిజన తెగ అస్తిత్వానికి సజీవ సాక్ష్యం. సుమారు ఎనిమిది వందల ఏళ్ల క్రితం ఒకే కొండ రాయిని మలిచి నిర్మించిన ఈ దుర్భేద్యమైన కోట అసలు నిర్మాతలు ఎవరు, దీని వెనుక ఉన్న చారిత్రక సత్యాలేమిటి అనే రహస్యాలను ప్రముఖ చరిత్రకారుడు డాక్టర్ సత్యనారాయణ ద్యావనపల్లి తన అన్వేషణ ద్వారా వెలుగులోకి తెచ్చారు. 1990లో పురావస్తు శాఖ గుర్తించిన ఒక శాసనాన్ని ఆయన లోతుగా అధ్యయనం చేసి పరిష్కరించడంతో, పద్మనాయక వంశానికి మరియు నేటి నాయకపోడు (నాయక) ఆదిమ గిరిజన తెగకు మధ్య ఉన్న విడదీయలేని అనుబంధం శాస్త్రీయంగా నిరూపితమైంది. పల్లాలు, గుట్టల మధ్య దాగి ఉన్న ఈ చారిత్రక సత్యం, మధ్యయుగ తెలంగాణ సామాజిక పరిణామాలకు ఒక కొత్త అర్థాన్ని ఇచ్చింది. చరిత్ర గమనంలో క్రీస్తు శకం 1384 నుండి 1399 మధ్య కాలం అత్యంత కీలకమైనది. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతాన్ని పద్మనాయకులు పాలిస్తున్నారు. ఈ శాసనాన్ని వేయించిన శ్రీ పెద్దిరాజు అనంతరాజు, నాయక తెగకు చెందిన అత్యంత శక్తివంతమైన యోధుడు మరియు పాలకుడు. ఆయన కేవలం పాలకుడు మాత్రమే కాదు, గొప్ప దైవచింతన కలిగిన వ్యక్తి కూడా. కంచి వంటి దక్షిణ భారత క్షేత్రాల నుండి వచ్చిన వైష్ణవ సాధువుల ప్రభావంతో, ఆ కాలంలో పద్మనాయక రాజులు వైష్ణవ సంప్రదాయాన్ని స్వీకరించారు. దీనికి అనుగుణంగానే క్రీస్తు శకం 1403లో (స్వభాను సంవత్సరం) పెద్దిరాజు అనంతరాజు గాంధారి కొండపై రఘునాయకులైన శ్రీరామచంద్రుని ప్రీత్యర్థం హనుమంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంలోనే విగ్రహం ఇరువైపులా 'తిరుమణి నామాలు' అని పిలవబడే వైష్ణవ చిహ్నాలను చెక్కించారు. ఈ చారిత్రక ఆధారమే నేటి నాయకపోడులను 'తిరుమణి దారులు'గా గుర్తించడానికి పునాది వేసింది. చరిత్ర గమనంలో అనేక రాజ్యాలు అంతరించిపోయినా, గాంధారి ఖిల్లా వైభవం, దానిని పాలించిన నాయక రాజుల వారసత్వం నేటికీ ఆదిమ గిరిజన తెగ అయిన నాయకపోడుల రూపంలో సజీవంగా ఉంది. ఒకప్పుడు కోటలను రక్షించి, రాజ్యాలను ఏలిన ఈ వీర జాతి, కాలక్రమేణా సామాజిక మార్పుల వల్ల అడవులకు పరిమితమై ఆదిమ గిరిజనులుగా గుర్తించబడినప్పటికీ, వారి మూలాలు మాత్రం గొప్ప రాజవంశానికి చెందినవేనని గాంధారి శాసనం నిరూపిస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆరు వందల ఏళ్ల క్రితం శాసనం వేయించిన పెద్దిరాజు అనంతరాజు వారసులు ఇప్పటికీ ఆ ప్రాంతంలోనే నివసిస్తున్నారు. వారి పేర్లలో 'పెద్ది' లేదా 'పెద్దులు' అనే గౌరవ ప్రదమైన పదం కొనసాగుతుండటం ఒక విశేషం. గాంధారి జాతరలో ప్రధాన పూజారిని 'పెద్దులు' అని పిలవడం, వారి పూర్వీకులైన పెద్దిరాజు పట్ల ఆ తెగకు ఉన్న గౌరవానికి నిదర్శనం. సాంస్కృతిక పరంగా చూస్తే, నాయకపోడులు నేటికీ ఆచరిస్తున్న 'రణం కుడుపు' అనే సంప్రదాయం వారి వీరత్వానికి చిహ్నం. పద్మనాయక రాజుల కాలంలో యుద్ధంలో మరణించిన వీరులను స్మరిస్తూ, వారి త్యాగానికి గుర్తుగా నిర్వహించే ఈ క్రతువు, కేవలం ఈ ఆదిమ తెగకు మాత్రమే పరిమితమైనది. ఇది వారిని ఇతర సామాజిక వర్గాల నుండి వేరు చేయడమే కాకుండా, వారిని నిజమైన పద్మనాయక వారసులుగా ధృవీకరిస్తోంది. పెద్దిరాజు భార్య పెద్దమ్మ కూడా ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందని, కోటలోని ఆలయాలను పునరుద్ధరించిందని జానపద గాథలు చెబుతున్నాయి. దీనిని బట్టి 15వ శతాబ్దపు ఆరంభంలోనే ఈ ఆదిమ తెగ ఒక సుసంపన్నమైన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు నిలయంగా ఉండేదని తెలుస్తోంది. కోటలో నాగశేషుడు, శివుడు, హనుమంతుడు, కాలభైరవుడు వంటి ఏకశిలా విగ్రహాలు ఆనాటి శిల్పకళా వైభవానికి నిదర్శనం. నాయకపోడుల సామాజిక జీవనంలో పద్మనాయక వారసత్వం అనేది కేవలం అధికారం గురించి మాత్రమే కాదు, అది ఒక జాతి ఆత్మగౌరవంతో ముడిపడి ఉంది. శతాబ్దాల తరబడి అడవి బిడ్డలుగా, కొండ కోనలను రక్షించే కావలికారులుగా ఉన్న వీరు, తమ పూర్వీకుల రాజసంస్కృతిని మరువలేదు. తమ కులదైవాలను కొలిచే పద్ధతుల్లో, వీరగాథలను వినిపించే తీరులో ఆ ప్రాచీన పరాక్రమం నేటికీ కనిపిస్తుంది. గాంధారి ఖిల్లా పైన ఉన్న ప్రతిరాయి, ప్రతి చెక్కడం ఈ ఆదిమ తెగ మూలాలను చాటుతుంటాయి. ఈ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, కొండల అమరిక కూడా ఆకాలపు నాయక రాజుల యుద్ధ తంత్రానికి అనుగుణంగానే మలచబడ్డాయి. ఇది వారి మేధోశక్తికి, నిర్మాణ నైపుణ్యానికి పరాకాష్ట. శత్రువుల రాకను గమనించే నగారా గుండు ఆనాటి రక్షణ వ్యూహాలకు అద్దం పడుతుంది.



లోతుగా విశ్లేషిస్తే, ఈ నాయక రాజుల పాలన కేవలం రక్షణకు మాత్రమే పరిమితం కాలేదు, అది అడవి వనరుల సముచిత వినియోగానికి, పర్యావరణ సమతుల్యతకు ఒక గొప్ప నమూనాగా నిలిచింది. పద్మనాయక రాజులు తమ పరిధిలోని గిరిజన ప్రాంతాలను కేవలం పన్నుల కోసం కాకుండా, వ్యూహాత్మక సైనిక కేంద్రాలుగా మలుచుకున్నారు. నాయకపోడులు తమ సహజాతమైన మెరుపు దాడి యుద్ధ నైపుణ్యాలతో శత్రువులకు సింహస్వప్నంగా మారారు. గాంధారి ఖిల్లాపై చెక్కబడిన శిల్పాలు, అక్కడ నిర్మించబడిన నీటి గుండాలు ఆనాటి సాంకేతిక తెలివితేటలకే కాకుండా, ఒక సంపూర్ణ స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థకు అద్దం పడుతున్నాయి. ఎత్తైన గుట్ట పైన ఉన్నప్పటికీ, ఎండాకాలంలో కూడా నీరు ఇంకిపోని 'నవతుల బావులు' ఆనాటి జల సంరక్షణ పద్ధతులకు సాక్ష్యం. రాచకొండ కేంద్రంగా సాగిన నాయకపోడుల పరిపాలన తెలంగాణ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. శత్రుదుర్భేద్యమైన కొండలు, లోయల మధ్య విస్తరించిన రాచకొండ సామ్రాజ్యం ఆనాడు నాయక రాజుల వ్యూహాత్మక చతురతకు నిదర్శనంగా నిలిచింది. ఈ కొండలనే తమ కోటలుగా మలుచుకున్న నాయకపోడులు, ప్రకృతి సిద్ధమైన రక్షణ కవచాల మధ్య సుస్థిరమైన పాలనను అందించారు. ఈ ప్రాంతంలో కొలువై ఉన్న మైసమ్మ తల్లిని వారు తమ కులదైవంగా, రాజ్య రక్షకురాలిగా ఆరాధించేవారు. యుద్ధానికి వెళ్లే ముందు నాయక వీరులు మైసమ్మ తల్లికి రక్తాన్ని తర్పణంగా ఇచ్చి 'రణం కుడుపు' నిర్వహించేవారని, ఆతల్లి మహిమ వల్లనే వారు ఎంత టి క్లిష్ట పరిస్థితుల్లోనైనా శత్రువులను జయించేవారని జానపద గాథలు చెబుతున్నాయి. నేటికీ రాచకొండ పరిసరాల్లో ఉన్న గుట్టలు, శిథిలమైన కట్టడాలు ఆనాటి పాలకుల పౌరుషాన్ని చాటిచెబుతున్నది.

**– వెంకగారి భూమయ్య**

# పోరాటాల స్మరణ.. భవిష్యత్తు కార్యాచరణ

### 18న నూరేళ్ల సిపిఐ సమర సంబురం : బాగం

### ఖమ్మంలో వంద అడుగుల జెండా ప్రదర్శన



**ప్రజాపక్షం/ఖమ్మం:** వందేళ్ల పోరాటాలను మననం చేసుకుని.. త్యాగాలను స్మరించుకుని.. భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించే లక్ష్యంగా ఈనెల 18న సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ జరుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. 2024 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు జనవరి 18న ఖమ్మంలో జరిగే సభతో ముగుస్తాయని ఈ సందర్భంగా జాతీయ కౌన్సిల్ సమావేశంతో పాటు జాతీయస్థాయి సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ప్రచారంలో భాగంగా బుధవారం వంద అడుగుల సిపిఐ జెండాతో ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించారు. బైపాస్ రోడ్డు సిపిఐ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన కొత్తబస్టాండ్ మీదుగా రాపర్తి నగర్ ఫ్లైఓవర్ బైపాస్‌రోడ్డులో ఎన్‌టిఆర్ విగ్రహం వరకు సాగింది. ప్రదర్శనను ఉద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ లక్ష్యమే ప్రజలకు హక్కుల సాధన, సమానత్వం, సంక్షేమమని ఆ ఆశయ లక్ష్యంతో వందేళ్లుగా ముందుకు సాగుతుందన్నారు. ఓట్లు, సీట్లు, నోట్లు కమ్యూనిస్టు పార్టీ ఎజెండాలో లేవని ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే లక్ష్యంగా సిపిఐ సుదీర్ఘ ప్రయాణం సాగిందన్నారు. పాలక వర్గాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిన ప్రతిసారి సిపిఐ ప్రతిఘటించిందని హేమంతరావు గుర్తుచేశారు. వందేళ్ల సుదీర్ఘ పోరాటంలో ప్రజల పక్షాన పోరాడుతూ ఎందరో యోధులు ప్రాణాలను అర్పించారని వారందరికి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నివాళులర్పిస్తూ భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యమైందని ఇప్పుటి కేంద్రపాలకులు ప్రజాస్వామ్య మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణకు సిపిఐ మరో పోరాటానికి పిలుపునిస్తుందన్నారు. మోడీ పాలనలో దేశం కార్పొరేట్ల కబంద హస్తాల్లో చిక్కుకుందని కార్పొరేట్ల కబంద హస్తాల నుంచి ఈదేశ సంపదను కాపాడే సత్తా కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని హేమంతరావు స్పష్టం చేశారు. ఈనెల 18న ఒక మహోత్సవంలా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు సాగనున్నాయని ఆయన తెలిపారు. ప్రతి ఊరు నుంచి ప్రతి ఇంటి నుంచి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు మహాసభకు తరలి వస్తున్నారని తెలిపారు. ఖమ్మంలో మూడు ప్రదేశాల నుంచి ప్రదర్శనలు ప్రారంభమవుతాయని జనసేవాదళ్ కవాతు, కళాకారుల ప్రదర్శన పెవిలియన్ మైదానం నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని హేమంతరావు తెలిపారు. వైరా రోడ్డు నుంచి వచ్చే వాహనాల ద్వారా వచ్చిన వారితో ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం నుంచి సభా స్థలి ఎస్ఆర్‌అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానానికి చేరుకుంటుందన్నారు. రెండవ ప్రదర్శన నయాబజార్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమై పాత బస్టాండ్, జెడ్పిసెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానానికి చేరుకుంటుందని హేమంతరావు తెలిపారు. ఈ మూడు ప్రదర్శనలకు సిపిఐ అగ్ర నాయకత్వం నేతృత్వం వహిస్తుందన్నారు. ఈ జెండా ప్రదర్శనలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, సిహెచ్.సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ప్రజాసంఘాల బాధ్యులు గాదె లక్ష్మి నారాయణ, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, మద్దోజు శ్రవణ్, జిల్లాకౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, బోడా వీరన్న, సైదా, యాకూబ్, నాయకులు నంబూరి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల పోరాట స్ఫూర్తితో

# ప్రజాసమస్యలపై సమరశంఖం



### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 18న ఖమ్మం నగరంలో నిర్వహించే శతాబ్ధి ముగింపు సభను విజయవంతం చేయాలని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వందేళ్ల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై సమరశంఖం పూరించాలని ఆయన కోరారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని హేమచంద్రాపురం, కోరుకొండ, తెలగరామవరం, శ్రీనగర్, అశోక్‌నగర్ కాలనీలు, గడ్డిగుట్ట, శేషగిరినగర్, లోతువాగు, లక్ష్మీ దేవిపల్లి, అనిశెట్టిపల్లి, పట్టణ పరిధిలోని రామవరం, బూడిదగడ్డ, బర్మా క్యాంపు తదితర ప్రాంతాల్లో ఆయన బుధవారం విస్తృతంగా పర్యటించి ఖమ్మం సభ విజయవంతానికి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా పాషా మాట్లాడుతూ శతాబ్ది కాలంగా ఎర్రజెండా పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. భూపోరాటల నుండి హక్కుల సాధన వరకు అగ్రభాగాన నిలిచిందన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి, రాజ్యాంగ పరిరక్షణకు ఖమ్మం సభ దిక్సూచిలా నిలుస్తుందన్నారు. గ్రామగ్రామాన కార్మికులు, కర్షకులు మేధావులు ఈసభకు భారీఎత్తున తరలిరావాలని, ప్రజా స్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశాల్లో సిపిఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, గెద్దాడు నగేష్, పల్లపోతు సాయి, లగడపాటి రమేష్, లక్ష్మారెడ్డి, వైకాని కృష్ణరాజు, జర్పుల మురళి, సాదిక్ పాషా, సౌజన్య పాల్గొన్నారు.

## మానుకోటలో

# 16 కళాప్రదర్శన, 17న బైక్ ర్యాలీ

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి వెల్లడి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఈనెల18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు మానుకోట నుంచి ఎర్రసైన్యం పెద్ద ఎత్తున కదిలి రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. సిపిఐ మహబూబాబాద్ పట్టణ కార్యదర్శివర్గ సమావేశం బుధవారం పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు నర్రా శ్రావణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విజయసారథి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభ విజయవంతానికి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 16న కళా ప్రదర్శన, 17న వార్డుల్లో ప్రచార బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన మానుకోట ప్రజలను కోరారు. జనవరి 18న ఖమ్మం పట్టణ కేంద్రంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి., మాజీ ఎంపి డి.రాజా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ, రాష్ట్ర నేతలతో పాటు 40 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం సభకు మానుకోట పట్టణ కేంద్రం నుంచి వేలాదిగా కదలి రావాలని విజయసారథి పిలుపునిచ్చారు. ఖమ్మం సభ విజయ వంతానికి ఇప్పటికే జిల్లా ప్రచార జాతాలు నిర్వహించనట్టు తెలిపారు. సమావేశంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులతోనే ప్రజాసమస్యలు పరిష్కారం

### సిపిఐ సీనియర్ నాయకులు రత్నాకర్‌రావు, రవీంద్రచారి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కమ్యూనిస్టుల పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, అందోజు రవీంద్రచారి అన్నారు. రంగారెడ్డి జిల్లా నాగోల్‌లోని ఎస్ఎ.డాంగే భవన్‌లో బుధవారం సిపిఐ ప్రజాసంఘాల నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, రాయ బండి పాండురంగాచారి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో ఎల్‌బి.నగర్ పరిధిలోని సిపిఐ సీనియర్ నాయకులను సన్మానించారు. ఈసందర్భంగా రత్నాకర్‌రావు, రవీంద్రచారి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యలపై ఉద్యమించారని, ఈ పోరాట కార్యక్రమంలో అనేకమంది అమరులయ్యారని గుర్తుచేశారు. ఎల్‌బి.నగర్ సర్కిల్ ప్రాంతంలో సిపిఐ ఉద్యమాలతోనే నల్లగొండ, మహబూబ్‌నగర్, తదితర ప్రాంతాల నుంచి బతుకుబండి లాగించడానికి వచ్చిన పేదలకు భగత్‌సింగ్ నగర్, డాక్టర్ అధికారి నగర్, భూపేష్ గుప్తానగర్, జైపూర్ కాలనీ, ఫత్తులగూడా, సాయి నగర్, మీర్‌పేట, లెనిన్‌నగర్, నాంచారమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెల వేయించి ఇండ్లు, ఇళ్ల పట్టాలు ఇప్పించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని గుర్తుచేశారు. ఇప్పటికి కుంట్లూర్ ప్రాంతంలో రావి నారాయణ రెడ్డినగర్ పరిధిలోని భూధానభూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు అండగా ఉన్నామని తెలిపారు. 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శత వసంతాల ముగింపు సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ, ఎఐటియుసి సీనియర్ నాయకులు బోయపల్లి రాములుగౌడ్, నర్సిరెడ్డి, తయార్, చుక్కయ్య, ఆదినారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మగాని నాగభూషణం, శాంతి సంఘం నాయకులు రవి కిషోర్, బషీర్, శ్రీధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐలో పలువురి చేరిక

**అబ్దుల్లాపూర్‌మెట్ :** శ్రామికుల, కష్టజీవుల సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టుపార్టీ మాత్రమే మార్గమని సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టి అన్నారం లక్ష్మి గణపతి కాలనీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ నివాసాలకు చెందిన మొహమ్మద్ బగ్దాద్, మనోజ్ సింగ్, శంశుద్దీన్, అజీమ్‌జానీ, జమల్, యూసుఫ్ తదితరులు బుధవారం సిపిఐలో చేరారు. వారికి అందోజు రవీంద్రచారీ, యాదిరెడ్డి సిపిఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, బిఒసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, మానా, సైదులు ముదిరాజ్, గణేష్ నాయక్ పాల్గొన్నారు.





## కాంగ్రెస్ చెడు ఆలోచనలు భోగిమంటల్లో మాడిపోవాలి

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం చెడు ఆలోచనలు భోగి మంటల్లో మాడిపోయి ఈ ఏడాది నుంచైనా మంచి పరిపాలన కొనసాగించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో జరిగిన భోగి మంటల వేడుకల్లో పాల్గొని అందరికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం పట్ల సోయిలేని కాంగ్రెస్ పార్టీ పాలకుల తీరు ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉందన్నారు. రెండేళ్ల పాలనలో ఆరాచకాలు, అక్రమాలు తప్ప చేసిందేమీలేదన్నారు. కాంగ్రెస్ మంత్రుల చెడు ఆలోచనలు కూడా ఈ భోగి మంటల్లో కాలిపోయి ప్రజాపరిపాలన కొనసాగించాలని సూచించారు. సంక్రాంతి పండుగ రైతుల పంటల పండుగన్నారు. పతంగులతో చిన్నారులు, ముగ్గులతో మహిళలు మురిసేపోతారని అన్నారు. సిరి సంపదలతో ప్రతి ఇంటా వెలుగులు నిండా సంక్రాంతి పండుగను అందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

## గోదా సత్యనారాయణ మరణం బాధాకరం

### సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు సోదరుడు సిపిఐ సీనియర్ నాయకులు గోదా సత్యనారాయణ మరణం బాధాకరమని, పార్టీకి తీరనిలోటని మాజీ శాసనసభ్యులు, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. యాదగిరిగుట్టలో ఆయన బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి ఎండి జహంగిర్ కూడా సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళులు అర్పించారు. యాదగిరిగుట్ట మండల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటి వద్ద సంతాప కార్యక్రమం నిర్వహించి వారికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మారెడ్డి గూడెం గ్రామ సర్పంచ్ కొల్లూరు రాజయ్య, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, బబ్బురి శ్రీధర్, కల్లెపల్లి మహేందర్, పేరబోయిన పెంటయ్య, గోరేటి రాములు, పేరబోయిన బంగారి, గుండు వెంకటేష్, మాటూరీ మల్లయ్య, ఆరె పుష్ప, పబ్బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యత



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన కబడ్డీ క్రీడను నల్లగొండ డిఎస్‌పి శివరాంరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు ఉన్నత విద్యకు, క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి తమ భవిష్యత్తును ఉజ్వలంగా మలుచుకోవాలని సూచించారు. యుక్త వయస్సులో మత్తు పదార్థాలు, మద్యం, జూదం తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువతను సమన్వయపరిచేలా క్రీడలను నిర్వహించిన వారిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, నాయకులు పంది నరేష్, అరూరి ప్రణీత అరూరి శ్రీను, నెలికంటి నర్సింహ్మా, నాతి వెంకటరామయ్య పాల్గొన్నారు.

**బహుమతుల పంపిణీ:** చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మాజీ ఎంఎల్‌సి చెరుపల్లి సీతారాములు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిట్ట సరోజ, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బొబ్బలి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఎఎస్‌రావు పరీక్షలో జయ ప్రభంజనం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతిష్టాత్మకమైన డాక్టర్ ఎఎస్‌రావు 35వ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష యందు జయ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు 9, 10వ తరగతి కేటగిరిలలో మొదటి ర్యాంకు సాధించడంతో పాటు మొత్తం 14 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించి ఆయన మాట్లాడారు. 2025 డిసెంబర్‌న నిర్వహించగా 10వ తరగతి నుండి వి వైష్ణవి 100 శాతం మార్కులు సాధించి రెండు తెలుగు రాష్ట్రాల నుండి మొదటి ర్యాంకు సాధించినట్లు వివరించారు. 9వ తరగతి నుండి వై వీక్షణ 100 శాతంతో మొదటి ర్యాంకు పొందినట్లు చెప్పారు. 9వ తరగతిలో 21 ర్యాంకులు ప్రకటించగా అందులో 6గురు జయస్కూల్ విద్యార్థులు, 10వ తరగతిలో 20 ర్యాంకులు ప్రకటించగా అందులో 8 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ర్యాంకులు సాధించడంలో సహకరించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ పాల్గొన్నారు.




# జర్నలిస్టులు రాసే ప్రతి అక్షరం 'ప్రజలపక్షం'

### అవినీతి అక్రమాలను నిర్భయంగా వెలుగులోకి తీయాలి

### 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ:** సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలు,ప్రజాసమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకరావడంలో ప్రజాపక్షం దినపత్రిక ముందుడాలని ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం అన్నారు. 'ప్రజాపక్షం' దినపత్రిక 2026క్యాలెండర్‌ను బుధవారం నల్లగొండలోని తన నివాసంలో ఆవిష్కరించి మాట్లాడుతూ జర్నలిస్టులు రాసే ప్రతి అక్షరం ప్రజల పక్షాన ఉంటూ ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాపక్షం నిరంతరం కృషి చేస్తోందని,గ్రామీణ ప్రాంతాల సమస్యల నుంచి పట్టణ ప్రజల అవసరాల వరకు సమతుల్యంగా వార్తలను అందిస్తోందని తెలిపారు. కట్టు కల్పితాలకు తావులేకుండా వాస్తవాలను ప్రతిబింబిస్తూ, విలువలతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఎన్‌టివి జర్నలిస్టులను అక్రమంగా అర్ధరాత్రి ఇళ్లపై దాడి చేసి అరెస్ట్ చేయదని తీవ్రంగా ఖండిచారు. ఈ కార్యక్రమంలో గీతాపనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పబ్బు వీరస్వామి, ప్రజాపక్షం దినపత్రిక జిల్లా ప్రతినిధి జిల్లా యా దయ్య, చండూరు ఇంచార్జి కర్నాటి వెంకటేష్,మర్రిగూడ విలేఖరి ఆకుల రఘుమయ్య, నల్లగొండ విలేఖరి తెలగమళ్ళ దశరథ, నాంపల్లి విలేఖరి ఉరిపాక వెంకటయ్య ఉన్నారు.

### ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్ఐ సందీప్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** ప్రజాపక్షం దినప్రతిక 2026 క్యాలెండర్, డైరీలను మండల కేంద్రంలో ఎస్ఐ సందీప్ రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు ఉస్తెల నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి పత్రికలు వారధిలాగా పనిచేయాలని, పత్రికలు ప్రజలకు మెరుగైన సమాచారాన్ని అందిస్తూ చట్టాల పట్ల, సమాజం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రజాపక్షం పత్రిక ముందుం




టుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం మండల రిపోర్టర్ షేక్ అబ్దుల్ రహీం, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు సిహెచ్ సురేందర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిలక ఏసు, పోలీసు స్టేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలకు 42శాతం నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సంక్రాంతి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం నామినేటెడ్ పదువులు ఇవ్వాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమైన పదవులన్ని కేవలం ఒకే సామాజికవర్గానికి కేటాయిస్తూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించడం లేదని ఆరోపించారు. మీ చేతిలో మీరు ఇచ్చే అవకాశం ఉన్న పదవులు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనం విడ్డూరంగా ఉందన్నారు. 60శాతానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత లేని పోస్టులే ఇస్తున్నారని అన్నారు. ఓట్లు బీసీలవి అధికారం మాత్రం కొన్ని కులాల వారే అనుభవిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దొనేటి శేఖర్, గంటా రాంబాబుయాదవ్, కన్నెబోయిన వినయ్‌యాదవ్, గుండు గోపికృష్ణ ఉన్నారు.



# ఇంటి స్థలం లేనివారికి స్థలం ఇచ్చేందుకు కృషి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రత్యేక పథకం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్షన్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.17కోట్లతో మిర్యాలగూడ పట్టణంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో భాగంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బుధవారం పట్టణంలోని గాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్‌తో కలిసి పట్టనంలోని ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ప్లాట్లు దరఖాస్తు పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో వివిధ పథకాలకు ఇప్పటివరకు రూ.400కోట్లను తీసుకుని రావడం జరిగిందన్నారు. ఆ నిధుల ద్వారానే గతంలో విఫలమైన అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ నిర్మా ణం, నూతన మంచినీటి పైపులైన్, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పార్కుల సుం దరీకరణ, ఎన్ఎస్పీ క్యాంపు రాజీవ్‌గాంధీ స్టేడి యం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, టాకా రోడ్డు విస్తీ ర్ణం, సీసీ రోడ్డు నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించుకోని పనులను కొనసాగించడం జరుగుతుందన్నారు. పట్టణంలో సొంత ఇల్లు లేక బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు మిర్యాలగూడ పట్టణంలో ప్రత్యేకంగా సొంత స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చేందుకు కృషి చేస్తాన్నారు. ప్రతి ఒక్కరు ఈనెల 16లోపు సబ్‌కలెక్టర్, తహసీల్దార్, కమిషనర్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/రామన్నపేట :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ 18న ఖమ్మం జిల్లాలో లక్షలాది మందితో నిర్వహిస్తున్నారని రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుల అవసరం ఎంతో ఉందని, ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సిపిఐ పార్టీ ఆవిర్భావం నుంచి రైతాంగ సమస్యలపై పోరాడిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. పేద ప్రజలకు అండ సిపిఐ జెండా అని, దున్నేవానికి భూమి అనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కిందన్నారు. ఈ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల గ్రామశాఖల నుండి జనసమీకరణతో సభను విజయవంతం చేయాలని, పార్టీ కార్యకర్తలే కాకుండా సానుభూతిపరులు అధికసంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలన్నారు.

## 23, 24 తేదీలలో జర్నలిస్టులకు శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/చిట్యాల:** మండలాల నుండి వివిధ పత్రికలలో పనిచేసే జర్నలిస్టులు తెలంగాణ మీడియా అకాడమి, టియూడబ్ల్యూజె(ఐజెయూ) ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజానికి మెరుగైన సేవలను అందించేందుకు జర్నలిస్టులకు ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తరగతులకు హాజరుకావాలనుకునే వారు ఈ నెల 17వ తేదీలోపు మండల కమిటికి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. జర్నలిజంలో వృత్తిపరంగా మెలకువులను నేర్పించడానికి తరగతులను ఏర్పాటు చేసిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డికి ఆయన కృతజతలు తెలియజేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు పులిమామిడి మహేందర్‌రెడ్డి, దోటి శ్రీనివాస్, యేళ్ళ బయన్న, మండల నాయకులు మెండె వెంకన్న, పోకల కరుణాకర్, చెరుపల్లి శ్రీనివాస్, మిర్యాల ప్రకాష్, అమరోజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఉద్యోగాలు వరిస్తాయి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా వరిస్తాయని యాదగిరిగుట్ట పట్టణ ఇన్స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ అన్నారు. మండలంలోని వంగపల్లిలో కేసరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైండ్ల సూర్యకాల రాములు స్మారక క్రికెట్ క్రీడోత్సవాల్లో విజేతలకు బాహుమతి అందజేసి మాట్లాడారు. యాదగిరిగుట్ట పోలీస్ జట్టుకు ప్రథమ బాహుమతి కప్పుతో పాటు రూ.25,116, ద్వితీయ బహుమతి కేసరి యూత్ జట్టుకు రూ.15,116లతో పాటు కప్పులు అందజేశారు.

# క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు, సామాజిక బాధ్యత

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

### గ్రామస్థాయి క్రీడా ప్రతిభను వెలికితీయాలి



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఎం కప్ ద్వారా గ్రామస్థాయి నుండి ప్రపంచ స్థాయి వరకు క్రీడా ప్రతిభను వెలికి తీసే అవకాశాలు కలుగుతున్నాయని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నల్లగొండ కేంద్రంలో గడియారం సెంటర్లో సీఎం కప్ టార్చ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 17 నుండి సీఎం కప్ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్య ఉద్దేశం గ్రామస్థాయి నుంచి ప్రపంచ స్థాయికి నేటి అథ్లెట్స్‌ని తయారు చేయడం సంకల్పంతో ప్రారంభించామని, గ్రామ, మండల,జిల్లాస్థాయి రాష్ట్రస్థాయిల క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎంఈఓలు పీఈటీలతో కోరారు. ఈపోటీలలో అందరినీ భాగస్వాములు చేసి మెరుగైన అథ్లెట్స్‌ను నల్లగొండ జిల్లాకు సిద్ధం చేయాలని కోరారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెరుగుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్‌ను విస్తృతంగా నిర్వహిస్తోందని,ప్రతి ఒక్కరూ ఇందులో ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విజయం,పరాజయం కంటే పాల్గొనడమే ముఖ్యమని,క్రీడాస్ఫూర్తితో ముం దుకు సాగాలని సూచించారు. క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు,సామాజిక బాధ్యత పెరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి రమేష్, ఎస్‌బిఐ మల్లారెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ హాఫీజిఖాన్, కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి కాలేజ్ సీఈవో గోనా రెడ్డి,అబ్బగోని రమేష్ గౌడ్, గుమ్మల మోహన్ రెడ్డి,జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి మీరు అక్బర్ అలీ పాల్గొన్నారు.

## మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉంది : బత్తుల




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని, అందుకు తనవంతుగా ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఏర్పాటు విషయమై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ ప్రజల ఆకాంక్షలు తెలుసని, ప్రస్తుత జిల్లాల పునర్విభజనలో ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. జిల్లా సాధన సమితి నేతలు జిల్లా ఏర్పాటు ఉద్యమాన్ని నాటి నుంచి నేటి వరకు చేస్తున్నారని, వారి కోరిక నెరవేరాలని అందరుకు కోరుకుంటున్నామని చెప్పారు. ఏ మాత్రం అవకాశం ఉన్నా జిల్లా ఏర్పాటు ఉద్దేశ్యాన్ని వదిలేది లేదని తెలిపారు. కమిటీ ముదు మన జిల్లా ఏర్పాటు వాదనను వినిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా మిర్యాలగూడను జిల్లా చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ మాలెంపాటికి వినతి పత్రం అందచేశారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకత, ప్రజల ఆకాంక్షలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నేతలు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, బీసీ జేఏసీ కన్వీనర్ దాసరాజు జయరాజు, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణరాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్, సీనియర్ జర్నలిస్టులు ఖాజా హమీదొద్దీన్, ఎండి.అసా, రంగా శ్రీనివాస్, బంగరాల మట్టయ్య, పుప్పాల యాదగిరి, బెజ్జం సాయి, సిద్ధునాయక్ పాల్గొన్నారు.

# విదేశీపెట్టుబడుల పేరుతో ప్రజా సంపద దోపిడీ




### సంయుక్త కిసాన్‌మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక నల్ల చట్టాల ప్రతులు బోగి మంటల్లో దహనం

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** విదేశి పెట్టుబడుల పేరుతో ప్రజా సంపదను కేంద్రం దోపిడి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు దొడ్డా వెంకటయ్య ధ్వజమెత్తారు. బుధవారం సంయుక్త కిసాన్‌మోర్చా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా నరేంద్రమోడి కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక చట్టాలకు నిరసనగా మకర సంక్రాంతి, బోగి పండుగ సందర్భంగా చిలుకూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో చట్టాల ప్రతులను మంటల్లో దగ్ధం చేసి మాట్లాడారు. విద్యుత్ చట్టం, విత్తన చట్టం, పనికి ఆహార చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో విదేశి ప్రైవేట్ పెట్టుబడుల ఆహ్వానం, నాలుగు లేబర్ కోడ్‌లు, ప్రభుత్వ రంగ సంస్థలను, విదేశి, బహుళజాతి, ప్రైవేట్ సంస్థలకు దారాదత్తం చేసే విధానాలు రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు. ప్రజా వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు మల్లెల ఆదినారాయణ, దొడ్డ కరుణాకర్, రాంబాబు, దొడ్డ సీతమ్మ, అక్షయ్, వాసవి, శ్రీజ, కొల్లి సౌజన్య, బండారుపల్లి మంజుల పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నాంపల్లి:** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన కార్మిక,కర్షక,వ్యవసాయ చట్టాలు నష్టం చేసే విధంగా పార్లమెంటు సమావేశాల్లో నల్ల చట్టాలను తీసుకురావడం నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంలో సీఐటియు,రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భోగిమంటల్లో నల్ల చట్టాల ప్రతులను వేసి దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నాయకులు కామనబోయిన ఈశ్వరయ్య,కోమల్ల వెంకటయ్య,శంకర్ లక్ష్మయ్య,సైదులు, నాగ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నకిరేకల్ :** సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం నకిరేకల్ పట్టణంలో అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక చట్టాల ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి మాట్లాడుతూకార్మిక,రైతు,పేదల హక్కులను కాలరాసే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు.ఈకార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా కోశాధికారి గజ్జి రవి,పెండెం రామచంద్రయ్య,ఊడెల్లి మల్లేష్,ముషం విద్యాసాగర్,గంజి శంకర్,తాటికొండ నాగచారి,కొండ ప్రభాకర్ పాల్గొన్నారు.



## ఉత్సాహంగా విలేజ్ ప్రీమియర్ క్రికెట్ లీగ్

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలేజ్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ (విపిఎల్) సీజన్ 5 పోటీలు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామీణ యువత క్రీడా ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా చేపట్టిన ఈ క్రికెట్ పోటీలు ప్రారంభం నుంచే క్రీడాభిమానుల్లో విశేష ఉత్సాహాన్ని నింపాయి. ఈ క్రికెట్ పోటీలను వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు, ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్, ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, తొలి బంతిని విసిరి టోర్నీని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్ మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మంచి క్రీడాకారులు ఎదగడానికి ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా యువత క్రీడా ప్రోత్సాహానికి ట్రస్ట్ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు విజయ భాస్కర్ రెడ్డి, మౌలాలి, నాయకులు ధనుంజయ, చిన్నా రెడ్డి, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా భోగి సంబరాలు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** సంక్రాంతి పండుగకు ముందస్తుగా వచ్చే భోగి పర్వదినాన్ని మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలు అత్యంత ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే గ్రామాల వీధుల్లో భోగి మంటలు వెలిగించి, చెడు అలవాట్లు దూరం కావాలని, మంచి జీవనానికి ఆహ్వానం పలుకుతూ సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, పిల్లలు పెద్దలు కలిసి భోగి పళ్ళు పోసుకుని పండుగ సందడి చేశారు. గ్రామాల్లో సంప్రదాయ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వాతావరణం పండుగ కళను సంతరించుకుంది, భోగి సంబరాలతో గ్రామాలన్నీ హర్షాతిరేకంగా మారి, సంక్రాంతి శుభారంభానికి నాంది పలికాయి.



## కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఉట్కూర్ మండల పరిధిలోని చిన్న పొర్ల గ్రామంలో బుధవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ గాండ్ల నిఖిత ప్రశాంత్, మాజీ సర్పంచ్ మాలిపటేల్ రవీందర్ రెడ్డిలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి మైదానంలో సందడి చేసి, పోటీలకు శుభారాంభం పలికారు. వారు మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ బందే నవాజ్, కాంగ్రెస్ నాయకులు జి.నాగరాజ్, ద్యావాలి నర్సింహులు, గ్రామస్తులు నర్సింహా రెడ్డి, చామ్కుర్ మైనుద్దీన్ తదితరులు పాల్గొని పోటీలను తిలకించారు. పెద్ద సంఖ్యలో యువకులు, క్రీడాభిమానులు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

## బైకును ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట్ జిల్లా కృష్ణ మండలం గూడెబల్లూరు సమీపంలో బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ లో నివాసం ఉండే నేతాజీ (36) సంక్రాంతి పండుగకు అత్తారింటికి వచ్చి పని నిమిత్తం టై రోడ్డు వైపు వెళ్తుండగా కొద్ది దూరానికే రాయచూరు వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి బైక్ ను ఢీకొట్టడంతో నేతాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు ఆకాష్ తీవ్రగాయలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం నేతాజీ మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ఎమ్ నవీద్ తెలిపారు.

## భోగి సంబరాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంపతులు

**ప్రజాపక్షం/మక్తల్ :** సంక్రాంతి పండుగ సంబరాలలో భాగంగా జరిగే భోగి సంబరాల్లో మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి. నరసింహ గౌడ్ వారి సతీమణి మాజీ కౌన్సిలర్ పి. ధనలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. బుధవారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో తన నివాసం లో గంగిడి ఎద్దుల ప్రదర్శన చేయించి వాటికి వస్త్ర దానం చేశారు. పండుగ అందరి ఇండ్లలో సంతోషాన్ని ఆనందాన్ని కలిగించాలని ఈ ప్రాంత ప్రజలు ఎల్లప్పుడూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ వారు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో.. ముగ్గుల పోటీలు

**ప్రజాపక్షం/వెల్దండ :** రాష్ట్రమిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్ జన్మదినం , సంక్రాంతి సందర్భంగా మండలపరిధిలోని 32గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటిలను నిర్వహించారు. మొదటి బహుమతి రూ.3వేలు, పట్టుచీర, రెండోబహుమతి రూ.2వేలనగదు, పట్టుచీర, మూడో బహుమతి రూ.వెయ్యి , పట్టుచీరతోపాటు పాల్గొన్న మహిళలకు పట్టచీర అందజేశారు.

**ఘనంగా జన్మదిన వేడుకలు :** మండలకేంద్రంలోని బిఆర్ఎస్‌పార్టీ కార్యాలయంలో మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్ జన్మదినం సందర్భంగా టిఆర్ఎస్‌శ్రేణులు ఏర్పాటుచేసిన కేక్‌ను ఉప్పలవెంకటేష్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈకార్యక్రమంలో అజిలాపూర్ సర్పంచ్ సిద్దగొని రమేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, లింగంముదిరాజ్, హన్మంతునాయక్, మండల బిఆర్ఎస్‌పార్టీ నాయకులు ఆర్కేగౌడ్, శ్రీనివాసులు, పోలేఅశోక్ పాల్గొన్నారు.

### కొత్తకోట పట్టణంలో...

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణంలో దాదాపు రూ.15కోట్ల వ్యయంతో పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకోట పట్టణంలో శెనగ చెరువు కట్ట అభివృద్ధి కోసం రూ. 5 కోట్లతో, పార్కుల అభివృద్ధి కోసం రూ. 2 కోట్లతో, రూ. 50 లక్షల వ్యయంతో రహదారుల పై ప్లాంటేషన్ రూ. 1.50 కోట్లతో స్టోమ్ వాటర్ డ్రైనేజీ పనులు, కొత్తకోట పట్టణంలో రూ. 1.50 కోట్లతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును మంత్రులు ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు సన్న బియ్యం రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ని ఇచ్చిన సోనియా గాంధీకి మన మందరం రుణపడి ఉన్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## తోమాలపల్లి సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రులు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన 33/11వి సబ్ స్టేషన్ ను తెలంగాణ రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, అన్ని వర్గాల వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, అక్కి శ్రీనివాస్ గౌడ్, రంజిత్ కుమార్ వైశాఖపూర్ సర్పంచ్ నికిత తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ దురుసు ప్రవర్తనపై పోలీస్ స్టేషన్ వద్ద నిరసన

### జిల్లా ఎస్పీకి బాధితులు, బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు

**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మూర్తి అసభ్య పదజాలం, దురుసు ప్రవర్తనపై బుధవారం పోలీసు స్టేషన్ వద్ద పానుగల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బాధితులు గద్వాల రామస్వామి, మొద్దులబండ రామస్వామి, కందూరి భీమ్‌రెడ్డిలతో పాటు మండల బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తపేట గ్రామంలో డిసెంబర్ 6వ తేదీన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. విగ్రహ ఏర్పాటు కోసం కమిటీ ఏర్పడి శిలాఫలకంపై ఎవరి పేర్లు కూడా లేకుండా అందరి సహకారంతో, అందరూ ముఖ్య అతిథులే అని తీర్మానం చేసుకొని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోగా శిలాఫలకం పై ఒకరి పేరు మాత్రమే ముద్రణ చేయించుకోవడంతో ఆగ్రహించి ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ప్లేట్‌పై యాసిడ్ పోశారు.

ఇందులో సంబంధం లేని పై వ్యక్తులం మమ్ములను కానిస్టేబుల్ మూర్తి అనే వ్యక్తి స్టేషన్‌కు పిలిపించి 4 గంటల పాటు స్టేషన్‌లో నిలబెట్టి దుర్భాషలాడి నిర్బంధించి, అసభ్య పదజాలంతో దూషించినట్లు బాధితులు తెలిపారు. చేతులతో కొట్టేందుకు, కాళ్ళతో తన్నేందుకు ప్రయత్నం చేశాడని బాధితులు తెలిపారు. నేరాన్ని ఒప్పుకోవాలని లేని పక్షంలో నానా ఇబ్బందులకు గురిచేస్తామని, రేపు మరోసారి ట్రీట్మెంట్ వేరేలా ఉంటుందని బెదిరింపులకు గురి చేసినట్లు బాధితులు తెలిపారు.

మాకు ఎలాంటి సంబంధం లేదు, గ్రామంలో ఏమైనా నేరాలు జరిగితే గుర్తించుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామస్థులు అడగడంతో సిసి కెమెరాలు స్వంత ఖర్చులతో ఇప్పించడం జరిగిందని నన్ను కూడా 4 గంటల పాటు మధ్యాహ్న భోజనాన్ని తిననివ్వకుండా నిర్బంధించాడని గ్రామస్థుడు భీమ్‌రెడ్డి తెలిపారు. మీరు గ్రామంలో విచారణ చేపట్టాలని మేము చెప్పిన కూడా దుర్భాషలాడాడు. ఈ సంఘటన పై మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీరసాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్ , రైతు బంధు మండల మాజీ కో ఆర్డినేటర్ వెంకటయ్య నాయుడు, మండల నాయకులు రాజేష్ రెడ్డి, ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు కానిస్టేబుల్ మూర్తి పై ఎస్సై కి ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధితులు ఫిర్యాదు చేశారు.




## జంగంరెడ్డి పల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/నర్వ :** మండలంలోని జంగాంరెడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ తిరుపతమ్మ భగవంతు, ఉప సర్పంచ్ డి. జగదీశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతమ్మ భగవంతు మాట్లాడుతూ. యువకులు క్రీడలు ఆడడంతో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తుందని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెతికి తీసేందుకు తోడ్పడుతుందని తెలిపారు. యువకులు ఎలాంటి సంఘటనలకు తావియ్యకుండా శాంతియుతంగా కొనసాగించాలని సైచించారు. క్రీడలకు బహుమతులుగా మొదటి బహుమతి 20 వేలు, రెండవ బహుమతి 10 వేలుగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు డి. రాజేశ్వర్ రెడ్డి, డి. వెంకటేశ్వర్ రెడ్డి, బి. రాజారెడ్డి, బి. వెంకట్ రెడ్డి, బి. ఆనంతా రెడ్డి, బి. బస్వరాజ్, డి. వెంకటయ్య, జి. భారత్, కె. నవీన్, ఎం. నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



## సిఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఈనెల 17వ తేదీన మహబూబ్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయుటకు విచ్చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవిఎస్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న బహిరంగ సభకు, అలాగే మల్లెబోయినిపల్లి సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాట్లను ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు పర్యవేక్షించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాటు చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు.



## వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** వనపర్తి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తా అని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కుటుంబ సమేతంగా కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంతో ప్రాశస్త్యం గల ఈ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 1 కోటి రూపాయల వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. మరో నాలుగు ఐదు కోట్లు అయినా ఖర్చు చేసి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అయ్యలూరి రఘునాథచార్యులు, అనే కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.




# సమాజంలో మీడియాపాత్ర ఎంతోకీలకం

### మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నేటి సమాజంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మీడియా పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు.

ప్రజాపక్షం తెలుగుదిన పత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను బుధవారం మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్, తాజామాజీ ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని వెలికితీయడంలో, నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియాపాత్ర కీలకమని, సమాజం పరివర్తనం చెందడానికి నైతికవిలువలు పెంపొందించడానికి మీడియాపాత్ర అమోఘమైనదని అన్నారు. ప్రజల సమస్యలను వెలికితీస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తున్న పత్రిక ప్రజాపక్షం తెలుగుదినపత్రిక అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజాపక్షం ప్రతినిధి సామబాలయ్య, పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో మాజీచైర్మన్ దేవరపాక బాలస్వామి, ఎంపిటిసి రవికుమార్, వెన్నచర్ల డిప్యూటి సర్పంచ్ రాముడు పాల్గొన్నారు.





## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

### మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/పెద్దకొత్తపల్లి :** ఇందిరమ్మ రాజ్యంలో గ్రామీణ ప్రాంతాలే అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండలపరిధిలోని వెన్నచర్ల గ్రామంలో సిసిరోడ్ల నిర్మాణపనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.8లక్షలతో 126మీటర్ల సిసిరోడ్లు, సైడ్‌డ్రైనేజికాల్వల నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.

**క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలి :** క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగితే జీవితంలో ఉన్నతమైన శిఖరాలకు చేరుకుంటారని మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండలపరిధిలోని వెన్నచర్ల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈటోర్నమెంట్‌లో 34జట్లు పాల్గొనగా , గెలుపొందిన జట్లకు విజేతలకు నగదుతోపాటు మెమోంటోను అందజేశారు. ప్రథమబహుమతి రూ.25వేలు(గంట్రావుపల్లిజట్టు), రెండోబహుమతి రూ.15వేలు(బిజినేపల్లి జట్టు),మూడో బహుమతి రూ.10వేలు(సింగోటం జట్టు) గెలుపొందారు. కార్యక్రమంలో సింగిల్‌విండోమాజీచైర్మన్ దేవరపాక బాలస్వామి, ఉపసర్పంచ్ రాముడు, మాజీ ఎంపిటిసి రవికుమార్, వార్డుమెంబర్లు కోళ్ల సుదర్శన్, వంగూరు రాంప్రసాద్, బాలింగాచారి, సుదర్శన్‌రాజు, శంకర్, గ్రామప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉప్పల జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణకేంద్రంలోని సిల్వర్‌జూబ్లీ మీయాడ్స్ కార్యాలయంవద్ద రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలను పట్టణ టిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను ఉప్పలవెంకటేష్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. మొదటగా ఉప్పలవెంకటేష్‌కు ఉప్పలచారిటబుల్‌ట్రస్టుసభ్యులు దారమోనిగణేష్ గజమాలవేసి ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో మున్సిపల్‌మాజీచైర్మన్ ఎడ్మ సత్యం, ఊర్కొండ సర్పంచ్ శ్రీనివాసులు, మున్సిపల్‌మాజీ కోఆప్షన్ సభ్యులు మనోహర్ రెడ్డి, మాజీకౌన్సిలర్ సూర్యప్రకాష్‌రావు, ఉప్పల చారిటబుల్‌ట్రస్టు సభ్యులు దారమోనిగణేష్, మధు, టిఆర్ఎస్ నాయకులు, ఉప్పలట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

**ఉప్పలట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు :** రాష్ట్రమిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్ పుట్టిన రోజు, సంక్రాంతి సందర్భంగా మండలపరిధిలోని 24 గ్రామాలతోపాటు కల్వకుర్తి పట్టణ మహిళలకు ముగ్గుల పోటిలను నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటుచేసిన ముగ్గులను ఉప్పల చారిటబుల్‌ట్రస్టుచైర్మన్ ఉప్పలవెంకటేష్ పరిశీలించారు. ముగ్గుల పోటిలలో గెలుపొందిన మహిళలకు మొదటిబహుమతి రూ.3వేల నగదుతోపాటు పట్టు చీర, రెండోబహుమతి రూ.2వేల నగదు, పట్టుచీ, మూడో బహుమతి రూ.వెయ్యి నగదు, పట్టుచీరతోపాటు పాల్గొన్న మహిళలకు పట్టుచీర అందజేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఉప్పలట్రస్టు సభ్యులు, పట్టణ మహిళామణులు పాల్గొన్నారు.




## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

### సర్పంచ్ వార్లవెంకటయ్య

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గ్రామ సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని గుంతకోడూర్ గ్రామసర్పంచ్, సిపిఐరాష్ట్రసమితిసభ్యులు వార్లవెంకటయ్య అన్నారు. బుధవారం తాడూరు మండలం గుంతకోడూరు గ్రామంలో గల వాటర్‌సప్లైకొరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ ఏఈ శ్రీరాములు, లైన్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, లైన్‌మెన్ ప్రకాష్‌గౌడ్, హెల్పర్ ఖాదర్, వార్డుసభ్యులతో కలిసి స్థలపరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారమయ్యే విధంగా కృషిచేస్తానన్నారు.

రోహిత్ వర్మ హీరోగా గోవింద రెడ్డి చందా దర్శకత్వంలో క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపొందుతోంది. ఈ సినిమాలో రియా సుమన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. భోగి, సంక్రాంతి పండుగ సందర్భంగా మేకర్స్ ఈ సినిమా టైటిల్‌ని రివీల్ చేశారు. ఈ చిత్రానికి 'పల్నాడు' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. ఎగిరే నిప్పురవ్వల బ్యాక్ డ్రాప్‌లో హీరో మండుతున్న కర్రని పట్టుకొని, పవర్‌ఫుల్ ఇంటెన్స్‌గా కనిపించిన టైటిల్ లుక్ పోస్టర్ సినిమాపై క్యురియాసిటీ క్రియేట్ చేసింది.

రీల్

## ప్రేక్షకులకు కృతజ్ఞతలు

- నవీన్ పొలిశెట్టి



'అనగనగా ఒకరాజు' సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ ఇచ్చినా ప్రేక్షకులకు హీరో నవీన్ పోలిశెట్టి కృతజ్ఞతలు తెలిపారు. భారీ అంచనాలతో సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం.. మొదటి ఆట నుంచే అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ ఓవర్సీస్‌లో ప్రీమియర్ షోల నుంచే అద్భుతమైన స్పందన లభించింది. థియేటర్‌లో ప్రతి ఒక్కరూ సినిమాని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్ అంటూ ప్రేక్షకుల నుంచి ఈ స్థాయి స్పందన రావడం సంతోషంగా ఉంది. ఇంకా సినిమా చూడనివారు టికెట్ బుక్ చేసుకొని వెళ్ళండి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ఉదయం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్ లో ప్రేక్షకులతో కలిసి సినిమా చూశాము. ఫస్ట్ హాఫ్, సెకెండ్ హాఫ్ అనే తేడా లేకుండా సినిమా అంతా నవ్వుతూనే ఉన్నారు ప్రేక్షకులు. అదే సమయంలో క్లైమాక్స్‌లో ఎమోషన్ కూడా బాగా వర్కౌట్ అయిందని అంటున్నారు. హాయిగా నవ్వుకుందామని వస్తే, చివరిలో కంటతడి పెట్టించారు అంటూ ఎందరో ప్రశంసిస్తున్నారు. మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ ని ఇచ్చిన ప్రేక్షకులకు పేరుపేరునా కృతజ్ఞతలు. మాకు మద్దతుగా నిలిచిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు.' అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. 'మా సినిమాకి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ ఫలితం మా అందరి కష్టాన్ని మర్చిపోయేలా చేసింది. నేను పోషించిన చారులత పాత్ర బాగుందని అందరూ ప్రశంసించడం ఆనందంగా ఉంది. నటిగా ఇది ఛాలెంజింగ్ పాత్ర. మొదటిసారి ఇలాంటి క్యూట్ మాస్ కామెడీ చేశాను. సంక్రాంతి పండుగకు నేను నటించిన సినిమా విడుదలై విజయం సాధించడం నాకు మరింత ఆనందాన్ని ఇచ్చింది. అందరూ ఈ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను.' అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగ వంశీ మాట్లాడుతూ.. 'అనగనగా ఒక రాజు సినిమాపై ముందు నుంచి నమ్మకంగా ఉన్నాము. ఆ నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. అన్ని చోట్లా సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. ప్రేక్షకులు సినిమాలో కామెడీని ఎంత ఎంజాయ్ చేస్తున్నారో.. అంతకన్నా ఎక్కువ చివరిలో ఎమోషన్ కి కనెక్ట్ అవుతున్నారు. రానున్న రోజుల్లో థియేటర్ల సంఖ్య పెరిగే అవకాశముంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ లో భారీ వసూళ్లు వస్తాయి.' అన్నారు.

## పీపుల్ మీడియాతో పవన్ కళ్యాణ్ భేటీ..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ స్థాపించిన 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్', ప్రముఖ నిర్మాణ సంస్థ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ'తో చేతులు కలిపింది. ఈ రెండు సంస్థలు కలిసి కొన్ని చిత్రాలను ప్రేక్షకులను అందించడానికి సిద్ధమవుతున్నాయి. గతంలోనే ఈ సంస్థల మధ్య కథలకు సంబంధించిన చర్చలు జరిగాయి. తాజాగా మరోసారి పవన్ కళ్యాణ్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కలిసి రాబోయే ప్రాజెక్టులపై చర్చించారు. పవన్ కళ్యాణ్, టీజీ విశ్వప్రసాద్ భేటీ గురించి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' స్పందిస్తూ భోగి శుభ సందర్భంగా కొత్త ఆరంభాల స్ఫూర్తిని సూచిస్తూ, రాబోయే ప్రాజెక్టులపై గతంలో జరిగిన చర్చలను కొనసాగిస్తూ, పవన్ కళ్యాణ్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్‌ని కలిసి మరింత విస్తృతంగా చర్చించారు అని తెలిపింది. 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' ట్వీట్ కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ బదులిస్తూ.. 'కథలపై చర్చించడానికి మాకు అవకాశం కల్పించినందుకు పవన్ కళ్యాణ్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది మాకు ఎంతో విలువైనది. ప్రేక్షకులకు బలమైన, అర్థవంతమైన, ప్రభావవంతమైన కంటెంట్‌ను అందించేందుకు 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్'తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాము. ఈ కలయిక మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ అద్భుత ప్రయాణం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాము.' అని తమ సంతోషాన్ని విశ్వ ప్రసాద్ పంచుకున్నారు.

## చిరు ఇంట్లో 'సక్సెస్' పార్టీ



మెగాస్టార్ చిరంజీవి మెగా ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు' అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం కేవలం రెండు రోజుల్లోనే రికార్డులను బద్దలు కొట్టి, సంచలనాత్మకంగా 100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 120 కోట్లు వసూలు చేసింది. ఇండియాలో జోరును కొనసాగిస్తూ, ఉత్తర అమెరికాలో 2 మిలియన్ డాలర్ల మైలురాయికి చేరువవుతున్న తరుణంలో మెగాస్టార్ ఇంట్లో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని, చిరంజీవి తన హైదరాబాద్ నివాసంలో ఒక గ్రాండ్ పార్టీని ఇచ్చి, సంక్రాంతి వేడుకల కొనసాగింపుగా మార్చారు. తారల సందడితో కూడిన వేడుకకు రామ్ చరణ్, వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెలతో పాటు పలువురు హాజరయ్యారు.ఈ వేడుకలు ఉత్సాహభరితమైన కేక్ కటింగ్ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి, అనంతరం చిత్ర బృందం అద్భుతమైన విందులో పాల్గొంది. నవ్వులు, కృతజ్ఞతలు, ఆత్మీయ సంభాషణలతో వేడుక కన్నుల పండగలా సాగింది. సినిమా ఘన విజయానికి కారణమైన ప్రతి సభ్యుడికి చిరంజీవి స్వయంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకను విజయోత్సవంగా మాత్రమే కాకుండా ముందస్తు భోగి, సంక్రాంతి సంబరాలుగా ఆనందంగా జరుపుకున్నారు. టీంలో కనిపించిన ఐక్యత, సినిమాకు లభిస్తున్న డ్రీమ్ రన్ కలిసి ఈ వేడుక మెగా మెమరబుల్ మూమెంట్‌గా నిలిచింది.

## మర్చిపోలేని అనుభూతి

- నిధి అగర్వాల్



ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్‌తో కలసి నటించడం జీవితంలో మరచిపోలేని అనుభూతినిచ్చిందని అంటోంది రాజా సాబ్ హీరోయిన్ నిధి అగర్వాల్. సంక్రాంతి పండుగా సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన మొట్ట మొదటి సినిమా రాజాసాబ్. ఈ సినిమాపై డివైడ్ టాక్ ఉన్న నేపథ్యంలో తనకు సంతృప్తినిచ్చిన సినిమా రాజాసాబ్ అంటోంది హీరోయిన్ నిధి అగర్వాల్. రాజాసాబ్ విడుదలై థియేటర్లలో నడుస్తున్న నేపథ్యంలో నిధి అగర్వాల్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 'రాజా సాబ్' సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌తో హ్యాపీగా ఉన్నాను. ఈ సినిమా కోసం మేమంతా 3 ఏళ్లు కష్టపడ్డాం. ఆ కష్టానికి ప్రేక్షకులు మంచి రిజల్ట్ ఇచ్చారని భావిస్తున్నాం. ఈ పాత్ర కోసం చాలా ప్రిపరేషన్స్ చేశాం. ముఖ్యంగా డ్రెస్ ఎలా ఉండాలనే విషయంలో డిస్కషన్స్ బాగా జరిగాయి. 'రాజా సాబ్' ముందు సినిమా హరిహర వీరమల్లులో నేను రాకుమారి పాత్రలో నటించాను. ఈ సినిమాలో ఏంజెల్‌గా కనిపించాను. ఈ రోల్‌లో నటించడాన్ని ఎంజాయ్ చేశాను. రాజాసాబ్‌లో నా క్యారెక్టర్ వరకు కాకుండా మొత్తం కథ విన్నాను. కథ విన్నప్పుడే ఇది ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటుందని అర్థమైంది.ప్రభాస్ బిగ్గెస్ట్ పాన్ ఇండియా స్టార్ అనేది ఎప్పుడూ అనుకోరు. మా అందరితో సరదాగా కలిసిపోయేవారు. ఆయనలోని మంచితనం వినయం చూశాక మంచి వాళ్లకు తప్పకుండా మంచే జరుగుతందనే విషయాన్ని మరింతగా నమ్మాను. హాస్పిటల్ సీన్‌లో ఆయన అద్భుతంగా పర్ ఫార్మ్ చేశారు. ప్రభాస్‌తో నటించడం, ఇంత భారీ చిత్రంలో నేనూ ఒక భాగం కావడం హ్యాపీగా ఉంది. విజువల్ ఎఫెక్టులు ఉన్న సీన్ లో యాక్టింగ్ కరెక్ట్ గా చేసేందుకు కొంత టైమ్ పట్టేది. లుక్ ఎక్కడ ఇవ్వాలి, లేనివి ఉన్నట్లు ఊహించుకుని రియాక్ట్ కావాలి..ఇలాంటివి కొన్ని సీన్స్ చేశాక ఈజీ అనిపించింది. నిజానికి నాకు దెయ్యాలు, ఇలాంటి హారర్ కంటెంట్ అంటే భయం. రాత్రి నిద్రపోయేప్పుడు లైట్స్ వేసుకుని హనుమాన్ చాలీసా లూప్‌లో వింటూ నిద్రపోతా. ప్రస్తుతం తెలుగులో మూడు చిత్రాల్లో నటిస్తున్నా. హిందీలో రెండు మూవీస్ చేస్తున్నా. తెలుగులో బిజీగా ఉండటం వల్ల హైదరాబాద్‌లో ఇల్లు తీసుకున్నా. ఇక్కడికి షిఫ్ట్ అవుతున్నా. నా బాల్యం నుంచే హీరోయిన్ కావాలని కలగన్నా. నేను కలగన్న కెరీర్ నే కొనసాగిస్తున్నా కాబట్టి కొత్తగా నేను కోరేది ఏమీ లేదు. హీరోయిన్‌గా మంచి పర్పస్ ఫుల్ ప్రాజెక్ట్స్ చేయాలని ఆశిస్తున్నా.

## 'కొత్త మలుపు' ఫస్ట్ లుక్



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రేక్షకులకు ప్రత్యేక కానుకగా 'కొత్త మలుపు' సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా, భైరవి అర్ధ్యా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోంది. శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వంలో, తాటి బాలకృష్ణ నిర్మాణంలో రూపొందుతున్న ఈ సినిమాలో సీనియర్ నటులు రఘు బాబు, పృధ్వీ, ప్రభావతి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రొమాంటిక్ లవ్ సస్పెన్స్‌తో పాటు హాస్యరసాన్ని కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఆకాష్–భైరవి జోడీ చాలా చక్కగా కుదిరింది. సంక్రాంతి కానుకగా ఫస్ట్ లుక్ విడుదల చేశాం.

## సిద్దుకు 'శోభన్ బాబు' అవార్డ్



నటభూషణ శోభన్ బాబు భౌతికంగా లేకపోయినా తాను నటించిన సినిమాల ద్వారా ఆయన ప్రేక్షకాభిమానులలో చెరగని ముద్రను వేసుకున్నారు. అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి పేరిట ఆయన అభిమానులు రెగ్యులర్ గా వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతూ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఇటీవల సురేష్ ప్రొడక్షన్స్ సంస్థతో కలసి 'సోగ్గాడు' సినిమా స్వర్ణోత్సవాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. కాగా బుధవారం శోభన్ బాబు జయంతిని పురస్కరించుకుని యూత్ హీరో ఒకరికి ఈ ఏడాది నుంచి సోగ్గాడు శోభన్ బాబు పేరిట అవార్డ్ ను ప్రదానం చేయనున్నట్లు అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ రాశీ మూవీస్ నరసింహారావు, అడ్వైజర్ జేష్ఠ రమేష్ బాబు, నిర్మాత జె.రామాంజనేయులు, ప్రెసిడెంట్ సుధాకర్ బాబు, కన్వీనర్స్ సాయి కామరాజ్, పూడి శ్రీనివాసరావు, వీరప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, బి.శ్రీనివాసరావు, యు.విజయ్, కుర్రా రాంబాబు, ధార సత్యం ప్రకటించారు. ఈ ఏడాది ఈ అవార్డ్ కు యువ హీరో సిద్ధు జొన్నలగడ్డను ఎంపిక చేసినట్లు, త్వరలో ఈ అవార్డ్ ను ప్రదానం చేయనున్నట్లు వారు వెల్లడించారు.

# చేనేత కార్మికుల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హామీ మేరకు చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ కోసం రూ.16.27 కోట్లకు అదనంగా పరిపాలన అనుమతులు జారీ**

**మంత్రి తుమ్మల నాగేశ్వరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత కార్మికుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ కోసం రూ.16.27 కోట్లకు అదనంగా పరిపాలన అనుమతులు జారీ అయ్యాయని మంత్రి తుమ్మల తెలిపారు. గతంలో 33 కోట్లు రూపాయలు నిధులు చేనేత కార్మికులు రుణమాఫి వారి అకౌంట్స్ లో జమ చేయుటకు ఆయా జిల్లాలకు విడుదల చేయడం జరిగిందన్నారు. గతంలో రూ.33 కోట్లు రుణమాఫీ నిధులు విడుదల కాగా ఇప్పుడు విడులైన రూ.16.27 కోట్ల మొత్తం రూ.48.31 కోట్ల రుణమాఫీ ద్వారా మొత్తం 6784 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి చేనేత కార్మికుల సంక్షేమం కోసం దాదాపు 960 కోట్లు ఖర్చు చేశామన్నారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడు పని కల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో నుండే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్టు, అందుకు అనుగుణంగా ఇప్పటికే రూ.896 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా 30 వేల మర మగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రూ.150 కోట్ల రూపాయలతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం కార్మికులకు చెల్లించకుండా వదిలేసిన రూ. 290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాలలో జమ చేశామన్నారు. చేనేత సహకార సంఘాల నుంచి వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత వస్త్ర ప్రదర్శన, వర్కింగ్ క్యాపిటల్ సపోర్ట్ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు.ఈ సంవత్సరంలో జిల్లా సహకార బ్యాంకులు ద్వారా 78 సహకార సంఘాలకు రూ.19కోట్లు వర్కింగ్ క్యాపిటల్ మంజూరు చేశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# 19 నుంచి నూతన సర్పంచ్‌లకు సమగ్ర శిక్షణ

**ట్రైనింగ్ షెడ్యూల్ ఖరారు చేసిన పంచాయతీ రాజ్ శాఖ**

**ఈనెల 19 నుంచి వచ్చేనెల 21 వరకు శిక్షణ**

**గ్రామ పాలనను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దే దిశగా శిక్షణా తరగతులు**

**మంత్రి సీతక్క ఆదేశాలతో టిజిఐఆర్‌డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా శిక్షణా తరగతులు**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ పాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సమగ్ర శిక్షణా కార్యక్రమాలను టిజిఐఆర్‌డి ఆధ్వర్యంలో జనవరి 19 నుంచి ఫిబ్రవరి 21 వరకు జిల్లాల వారీగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ ట్రైనింగ్ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. సర్పంచ్‌లకు వారి విధులు, నిధులు, బాధ్యతలు, హక్కులు, అలాగే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంపై లోతైన అవగాహన కల్పించే విధంగా శిక్షణ మాడ్యూల్‌ను రూపొందించారు. ఇప్పటికే సర్పంచ్‌ల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్, కరదీపికను సిద్ధం చేశారు. మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు టిజిఐఆర్‌డి ద్వారా అందించనున్నారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పారదర్శక పరిపాలన లక్ష్యంగా ఈ శిక్షణలు రూపుదిద్దుకున్నాయి. సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పనిచేసే విధంగా, గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రతి జిల్లాలో 5 బ్యాచ్‌లుగా సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనుండగా, ఒక్కో బ్యాచ్‌లో కనీసం 50 మంది సర్పంచ్‌లు పాల్గొంటారు. ఒక్కో బ్యాచ్‌కు 5 రోజుల పాటు తరగతులు నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వనుండగా, ఒక్కో సర్పంచ్‌కు ఐదు రోజుల పాటు బస, భోజనం, శిక్షణా ఖర్చుల కోసం రూ.5,000 వరకు ప్రభుత్వం వెచ్చించనుంది. ఈ శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు మొత్తం 253 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, వారికిటిజిఐఆర్‌డిలో ఇప్పటికే ఓరియంటేషన్ పూర్తి చేశారు. వీరు సర్పంచ్‌లకు ప్రాక్టికల్‌గా ఉపయోగపడే విధంగా, పరిపాలన, అభివృద్ధి, ఆర్థిక నిర్వహణ, ప్రజాసేవ అంశాలపై శిక్షణ అందిస్తారు. సర్పంచ్ శిక్షణా తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. శిక్షణలో పాల్గొనే సర్పంచ్‌లకు భోజనాలు, వసతి సౌకర్యాలు, శిక్షణా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కూడా స్పష్టం చేసింది. సర్పంచ్‌లకు సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామ పంచాయతీలు మరింత బలోపేతం అవుతాయని, పారదర్శకమైన పాలన, సమర్థవంతమైన నిధుల వినియోగం, ప్రజల అవసరాలకు వేగంగా స్పందించే వ్యవస్థ ఏర్పడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఈ శిక్షణా కార్యక్రమం గ్రామ స్వరాజ్యానికి దృఢమైన పునాది వేయనుందని పంచాయతీరాజ్ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

## అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ చెల్లించాలి

**నండూరి కరుణ కుమారి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాపితంగా రిటైర్డ్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణ కుమారి డిమాండ్ చేశారు. టీచర్‌కు రూ.2 లక్షలు ఆయాకు రూ. 50వేలు వడ్డీతో సహా ప్రభుత్వం వెంటనే బడ్జెట్ విడుదల చేయాలని ఆమె కోరారు. 2023 సెప్టెంబర్‌లో చేసిన 24 రోజుల సమ్మె కాలపు వేతన బకాయిలతో పాటు రిటైర్‌మెంట్ అయిన టీచర్లకు, ఆయాలకు నెలకు రూ.5వేల పెన్షన్ సౌకర్యం, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26,000లు చెల్లించాలని, సెంటర్ అద్దెలు, గ్యాస్, ఆరోగ్య లక్ష్మి బిల్లులు ప్రతినెలా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వమే అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని, రెండు యాప్‌లను ఒకటిగా చేయాలని, 5 జీ ఫోన్స్ ఇవ్వాలని, నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లకు ఇచ్చే విధంగా అంగన్‌వాడీ టీచర్లు, కూడా సెలవులు మంజూరు చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు సర్వీసును బట్టి సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించాలని కరుణ కుమారి డిమాండ్ చేశారు.

## నాలుగు ప్రత్యేక రైళ్లు నడపనున్న దక్షిణ మధ్య రైల్వే



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే వివిధ గమ్యస్థానాల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సదుపాయాన్ని వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఏ. శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెల 16, 19, 20 తేదీల్లో ఒక్కో ట్రిప్‌గా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ – గుంతకల్లు (07484) రైలు 16న రాత్రి 7 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు గుంతకల్లు చేరుకుంటుంది. ఈ రైలు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపూర్ రోడ్ కుంబం, నంద్యాల, ధోనె స్టేషన్లలో ఆగుతుంది. మచిలీపట్నం – ధర్మవరం (07485) రైలు 16న సాయంత్రం 6 గంటలకు మచిలీపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లె, కదిరి తదితర స్టేషన్లలో ఆగుతుంది. వికారాబాద్–హజూర్ సాహిబ్ నాందేడ్ (07486)రైల్ 20న ఉదయం 11.30 గంటలకు వికారాబాద్ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 8.30 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది. శంకర్‌పల్లి, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, బోలారం, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర్ తదితర స్టేషన్లలో ఆగుతుంది. వికారాబాద్ – తిరుపతి (07487)రైలు 19న సాయంత్రం 4.15 గంటలకు వికారాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, తెనాలి, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది.

## అడవి వీడిన నక్సల్స్

(మొదటి పేజీ తరువాయి)

పోడియం బుద్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది. మిగిలిన క్యాడర్‌లు డివికెఎంఎస్, మిలీషియా, మావోయిస్టుల జనతానా సర్కార్ విభాగాలలో సభ్యులని ఆ అధికారి తెలిపారు. ఇటీవల గోగుండ ప్రాంతంలో భద్రతా శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఈ లొంగుబాటులో కీలక పాత్ర పోషించింది. శిబిరం ఏర్పాటు చేసిన తర్వాత, ముమ్మరమైన నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు, నిరంతర ఒత్తిడి, గాలింపు చర్యలు ఈ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను గణనీయంగా తగ్గించాయని ఆయన అన్నారు. గోగుండ ప్రాంతం, దాని కఠినమైన, మారుమూల భౌగోళిక పరిస్థితుల కారణంగా, గతంలో మావోయిస్టుల దర్భా డివిజన్‌కు సురక్షితమైన, వ్యూహాత్మక స్థావరంగా పరిగణించబడింది. కానీ భద్రతా శిబిరం ఏర్పాటు చేసిన తర్వాత, మావోయిస్టుల కంచుకోటను సమర్థవంతంగా నిర్మూలించామని ఆ అధికారి తెలిపారు. ఈ లొంగుబాటుతో, దర్భా డివిజన్‌లో మావోయిస్టుల మద్దతు వ్యవస్థ కూడా బలహీనపడిందని ఆయన అన్నారు. నిషేధిత మావోయిస్టు సంస్థతో సంబంధం ఉన్న వారందరూ హింసను విడనాడాలని చవాన్ విజ్ఞప్తి చేశారు. వారికి భద్రత, గౌరవప్రదమైన జీవితాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈనెల 8న పొరుగున ఉన్న దంతెవాడ జిల్లాలో 63 మంది నక్సలైట్లు లొంగిపోగా, 7న సుక్మాలో 26 మంది క్యాడర్‌లు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలో చేరారు. 2025లో రాష్ట్రంలో 1,500 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారు.

## మేం అమ్మకానికి సిద్ధంగా లేం

(మొదటి పేజీ తరువాయి)

ఏకంగా దేశాధ్యక్షుణ్ణి, దేశ ప్రథమ మహిళను కిడ్నాప్ చేసి తీసుకుపోయిన తర్వాత ట్రంప్ చేసిన హెచ్చరికలతో గ్రీన్‌లాండ్ ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. ట్రంప్ అన్నంతపనీ చేస్తారని నమ్ముతున్నారు. వారిలో దేశాభిమానం తలెత్తింది. మంచుతో కప్పేసి ఉన్న దుకాణాలు,షాపులపైన గ్రీన్‌లాండ్–సార్వభౌమాధికారం'' అనే పెద్ద పెద్ద బోర్డులు కనిపిస్తున్నాయి. ఇక్కడి ప్రజలు అమెరికాకు వ్యతిరేకంగా ఉన్నారనడానికి ఈ బోర్డులే అతిపెద్ద తార్కాణాలుగా ఉన్నాయి. తాము డెన్మార్క్ జాతీయులుగానో, అమెరికా జాతీయులుగానో బతకడానికి ఇష్టపడటంలేదని, గ్రీన్‌లాండ్ ప్రాంతం గ్రీన్‌లాండ్ వాసులదేనని చెప్పారు. తాము స్వతంత్రంగా ఉండటానికే ఇష్టపడుతున్నామన్నారు. ''మా దేశం స్వతంత్రంగా ఉండాలన్నదే మా ఆశ, ఈ దేశం ఎవ్వరూ కొనుక్కోడానికి లేదు'' అని ఆర్కిటిక్‌లోని దేశీయ ఇన్యూట్ తెగల రచయిత, సంగీతకారుడు సిప్పి సోక్ రాస్క్ చెప్పారు. అమేలీ జీబ్ అనే మహిళ మాట్లాడుతూ, ''డోనాల్డ్ ట్రంప్ తన రెండు చెవులనూ తెలివిగా ఉపయోగించడం మంచిది, ఎక్కువగా విని, తక్కువగా మాట్లాడటం మంచిది, గ్రీన్‌లాండ్ అమ్మకానికి సిద్ధంగా లేదు'' అని ఘాటుగా చీవాట్లు పెట్టారు.

ఈ ప్రాంతంలో 57,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. పూర్తిగా మంచు ఆవరించుకున్న ఈ ఆర్కిటిక్ ప్రాంతం అమెరికా చెబుతున్నట్లుగా యుద్ధపరంగా ఒక వ్యూహాత్మక ప్రాంతం మాత్రమే కాదు, గ్రీన్‌లాండ్‌లో అపారమైన ప్రకృతి సంపద ఉంది. ఈ సంపదను కూడా సొంతం చేసుకునేందుకు వీలుగా రిపబ్లికన్‌పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యుడు రాండీఫైన్ ఒక బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఆమోదం పొందితే, గ్రీన్‌లాండ్‌ను స్వాధీన చర్యలతోపాటు డెన్మార్క్ నాయకత్వంతో చర్చలకు కూడా ఆయనకు పూర్తి అధికారాలుంటాయి. ఈ దీవి స్వాధీనాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరనీ ట్రంప్ పదే పదే ప్రకటనలు చేస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com